ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.APTEL / 2013 /50370

సోమవారం 08.07.2024 | సంపుటి : 10 సంచిక : 359 | పేజీలు : 12 వెల: రూ. 4/-






# ఐదేళ్ల వరకూ.. రేవంత్ సర్కారుకు ఢోకా లేదు





## ఏక్‌నాథ్ షిండేలను సృష్టించడం తెలంగాణలో బీజేపీకి సాధ్యం కాదు

### కేంద్రంలో పూర్తి మెజారిటీ రాకపోవడంతో ఎన్డీయే సర్కారుకు దడ

### రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చడానికి నితీశ్, చంద్రబాబు నాయుడు ఒప్పుకోరు

### సంకీర్ణ సర్కారులు ప్రజాస్వామ్యానికి మంచిదే..!

హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి (జనంసాక్షి)

లోక్‌సభ ఎన్నికల ముందు వరకూ తెలంగాణలో రేవంత్ సర్కారు నిలబడుతుందా అన్న చర్చ సాగినా పార్లమెంట్ ఫలితాల చూసి తర్వాత అవన్నీ పటాపంచలయ్యాయి. ఎన్డీయే సర్కారుకు పూర్తిమెజారిటీ రాకపోవడంతో ఇతర పార్టీలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ చిన్న తేడాజరిగినా ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఫామ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో అప్రజాస్వామిక చర్యలకు మోడీ సర్కార్ సాహసించదు. గత కొన్నేళ్లలో వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను పడగొట్టేందుకు మోడీ, షా ద్వయాలు చేసిన ప్రయత్నాలను ప్రజలు అంగీకరించలేదు. ఫలితంగానే మొన్నటి మహారాష్ట్ర పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ప్రజలు తిరస్కరించారు. 2019లో బీజేపీ-శివసేన కూటమి మొత్తం 48 స్థానాలకుగాను 41 స్థానాలు గెలుచుకోగా.. 2024లో కేవలం బీజేపీ కూటమి మొత్తం

మిగతా 2లో..

తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరిన మొదలు పాలన సాగిస్తుందా? పడిపోతుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సర్కారుకు పూర్తి మెజారిటీ రాకపోవడంతో ఏక్‌నాథ్ షిండేలు పుట్టుకొస్తారని, ప్రభుత్వాన్ని పడగొడతారని రాజకీయ వర్గాల్లో తీవ్రచర్చకే దారితీసింది. ఒకానొక సందర్భంలో సీఎం రేవంత్‌రెడ్డి 'నా సర్కారుపై కుట్ర జరుగుతోంది' అంటూ ఆందోళన వెలిబుచ్చడం మరింత చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో జాతీయ, రాష్ట్ర రాజకీయాలను నిశితంగా అధ్యయనం చేస్తున్న పరిశీలకులు రేవంత్ సర్కారుకు ఢోకా లేదనే ప్రకటిస్తున్నారు. ఐదేండ్ల వరకూ తెలంగాణలో కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని, వారి పరిపాలన రాబోయే రోజుల్లో గీటురాయిగా మారుతుందని భావిస్తున్నారు.

# గ్రూప్1 ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల

- మెయిన్స్‌కు 31,382 మంది అభ్యర్థులు అర్హత
- ప్రకటించిన టీజీపీఎస్సీ
- అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలు

హైదరాబాద్(జనంసాక్షి): టీజీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాలు విడుదలయ్యాయి. టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితా లను అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు తమ లాగిన్‌లోకి వెళ్లి చెక్ చేసుకోవచ్చు. తుది కీతో పాటు రిజల్ట్స్‌ను టీజీపీఎస్సీ ఒకేసారి విడుదల చేసింది. గ్రూప్-1 మెయిన్స్‌కు 31,382 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు.



## విజేతలకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. టీజీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్‌కు

మిగతా 2లో..

# కదిలిన జగన్నాథ రథ చక్రాలు

## సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయండి

### పెండింగ్ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి

### అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న పలు సాగునీటి ప్రాజెక్టులను వీలైనంత తొందరగా వినియోగంలోకి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. గోదావరి బేసిన్‌లో ఉన్న నీలం వాగు, పింప్రి ప్రాజెక్టు, పాలెం వాగు, మత్తడి వాగు, ఎస్సారెస్పీ

మిగతా 2లో..

## హైదరాబాద్‌లో రథయాత్ర ప్రారంభించిన సీఎం రేవంత్



హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అందరిదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రను ఆయన ప్రారంభించారు. అనంతరం స్వామి వారికి హారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు."సర్వమతాలకు ప్రాధాన్యం ఇస్తాం. అన్ని మతాలకు చెందిన భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించడం మా బాధ్యత. రాష్ట్రం

మిగతా 2లో..

# రెండు రాష్ట్రాలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి

### ఆంధ్రా,తెలంగాణ నాకు రెండు కళ్లులాంటివి

### ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబు

హైదరాబాద్(జనంసాక్షి): ఏపీలో విజయానికి తెలంగాణ తెదేపా శ్రేణులు పరోక్షంగా కృషి చేశారని ఆ పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. తెలంగాణ గడ్డపై తెదేపాకు పునర్ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ, తెలంగాణ తనకు రెండు కళ్లు అని వ్యాఖ్యానించారు. నాలుగోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌కు చంద్రబాబు తొలిసారి వచ్చారు. కార్యకర్తలు, నేతలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు."ఆత్మీయులను కలిసి అభినందనలు తెలియజేయాలని వచ్చాను. మీ అభిమానం చూస్తుంటే నాకు ఉత్సాహం వస్తుంది. ఏపీలో విజయానికి తెలంగాణ తెదేపా శ్రేణులు పరోక్షంగా

మిగతా 2లో..





టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి తెలంగాణతో

# పేగుబంధాన్ని తెంచుకున్నాం

### కేసీఆర్‌తో ఈవిషయమై చర్చిస్తా

### మాజీ ఎంపీ వినోద్ కీలక వ్యాఖ్యలు

కరీంనగర్(జనంసాక్షి): టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి తెలంగాణ పేగుబంధాన్ని తెంచుకున్నాం. ఏస్, అందులో నేనూ ఓ పాత్రధారినే అంటూ బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కీలక వ్యాఖ్యలు

మిగతా 2లో..

# విచారణ షురూ..

### త్వరలో బోలేబాబాను ప్రశ్నించనున్న పోలీసులు

న్యూఢిల్లీ(జనంసాక్షి):హత్రాస్‌లో బోలేబాబా సత్సంగ్‌లో తొక్కిసలాటపై విచారణకుగాను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్‌ను నియమించింది. ఈ ఘటనలో ఇప్పటికే తొమ్మిది మందిని అరెస్టు చేశారు. కీలక నిందితుడు దేవ్‌ప్రకాశ్ సహా తొమ్మిదిమందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ఓ రాజకీయ పార్టీ నిధులు సమకూర్చిందనే విషయంపైనా దర్యాప్తు చేస్తున్నామని, నిజమని తేలితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. మరోవైపు తొక్కిసలాట ఘటనపై అవసరమైతే బాబాను కూడా విచారిస్తామని దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జ్యుడీషియల్ కమిషన్ పేర్కొంది. దుర్ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సమర్పించాలని పౌరులకు సూచించింది. తొక్కిసలాటలో చనిపోయిన వారి పోస్టుమార్టం రిపోర్టులను పరిశీలిస్తే వారు ఊపిరాడకపోవడం వల్లే చనిపోయారని స్పష్టంగా తెలుస్తుంది. అంతేగాక సత్సంగ్ సమీపంలోనే దుండగులు పారిపోయేందుకు వాహనాలు కూడా సిద్ధం చేసి ఉంచుకున్నారు. ఇందుకు మా వద్ద ఆధారాలున్నాయి. సాక్షులకు సెక్యూరిటీ ఇవ్వాలి'అని సింగ్ కోరారు.



మిగతా 2లో..



# బీఆర్ఎస్‌కు బిగ్ షాక్..

### కాంగ్రెస్‌లోకి మరో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ?

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ఆపరేషన్ ఆకర్ష్ కార్యక్రమం విజయవం తంగా కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు ప్రతిపక్ష నేతలు హస్తం గూటికి చేరగా..పార్టీ మారేందుకు మరికొందరు నేతలు సిద్ధంగా ఉన్నారు. మరో ఇద్దరు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైనట్టు సమాచారం. జోగులాంబ గద్వాల జిల్లాలో బీఆర్‌స్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆయన కొడుకు

మిగతా 2లో..

# రష్యాకు దీటుగా ఉక్రెయిన్ ప్రతిదాడులు

### రష్యాలో పలు ప్రాంతాల్లో ఎమర్జెన్సీ విధింపు!



మాస్కో(జనంసాక్షి):రష్యా చేస్తున్న దాడులను దీటుగా ఎదుర్కొంటున్న ఉక్రెయిన్.. డ్రోన్లు, క్షిపణి దాడులతో విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో ఇటీవల చేసిన డ్రోన్ల దాడితో రష్యాలోని మందుగుండు గోదాముల్లో మంటలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో వొరోనెజ్ ప్రాంతంలో పలుచోట్ల అత్యవసర స్థితి విధించారు. ప్రధాని మోదీ రష్యా పర్యటనకు ఒక రోజు ముందు రష్యాలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్‌లో విద్యుత్ సరఫరా వ్యవస్థలే లక్ష్యంగా రష్యా కొంతకాలంగా దాడులకు తెగబడుతోంది. ఈ క్రమంలో సుమి ప్రావిన్సుపై ఇటీవల వైమానిక దాడులు చేసింది. దీంతో లక్షల మంది చీకట్లో మగ్గిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా సుమి ప్రావిన్సు రాజధానికి నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో రష్యాపై ప్రతిదాడులకు దిగిన ఉక్రెయిన్.. వొరోనెజ్ ప్రాంతంపై డ్రోన్లతో విరుచుకుపడింది. మందుగుండు సామగ్రి ఉన్న గోదాములో మంటలు చెలరేగాయి. ఈ దాడుల్లో ప్రాణనష్టం ఏమీ జరగలేదని వొరోనెజ్ గవర్నర్ అలెగ్జాండర్ గుసేవ్ పేర్కొన్నారు. అయితే,

మిగతా 2లో..



# ఎన్టీఆర్ జిల్లాలో ఘోర ప్రమాదం

### సిమెంటు పరిశ్రమలో బాయిలర్ పేలుడు

### 20మంది కార్మికులకు తీవ్ర గాయాలు

### చికిత్స పొందుతూ ఇద్దరి మృతి..

ఎన్టీఆర్ జిల్లా (జనంసాక్షి): ఎన్టీఆర్ జిల్లా బోదవాడలోని అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో బాయిలర్ పేలి 20మంది కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను బిహార్, యూపీ, మధ్యప్రదేశ్ వాసులుగా గుర్తించారు. బాధితులకు విజయవాడలోని మణిపాల్, ఆంధ్రా ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. వీరిలో అర్జున్, వెంకటేశ్ మృతి

మిగతా 2లో..



# ఉత్తరాఖండ్ అతలాకుతలం

### ఉప్పొంగుతున్న వరదలు • చార్‌ధామ్ యాత్ర నిలిపివేత

### ఘాట్‌ల వద్దకు వెళ్లొద్దని హెచ్చరికలు

రిషికేశ్(జనంసాక్షి):ఉత్తరాఖండ్‌లో వర్షాలు కుండపోతగా కురుస్తున్నాయి. భారీగా వరద నీరు వచ్చి చేరడంతో గంగా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఆదివారం నాటికి నీటిమట్టం రిషికేశ్‌లోని త్రివేణి ఘాట్, గంగా హారతి ప్రాంతాల్లో ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. దీంతో రాత్రివేళల్లో ఘాట్‌ల వద్దకు పర్యాటకులెవరూ వెళ్లొద్దని రాష్ట్ర విపత్తుల ప్రతిస్పందన దళం హెచ్చరికలు జారీ చేసింది. ఉన్నతాధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు ఎస్పీ వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. మరోవైపు మరో మూడు రోజుల పాటు ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించింది. ప్రధానంగా కుమాన్, చమోలి, రుద్రప్రయాగ, పౌడీ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. మరోవైపు డెహ్రాడూన్, తెహ్రీ, హరిద్వార్, ఉత్తరకాశీ

మిగతా 2లో..

# భాజపాకు అనేక అంశాల్లో కేసీఆర్ మద్దతిచ్చారు

### 16 ఎంపీ సీట్లు గెలిచి ప్రధాని కావాలని కలలు కన్నారు

### మంచి పాలన అందించకనే ప్రజలు ఓడించారు: జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్(జనంసాక్షి):భాజపాకు పార్లమెంటులో కేసీఆర్ అనేక అంశాల్లో మద్దతు ఇచ్చారని మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. ప్రతి సందర్భంలో రాజకీయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "రాష్ట్రంలోని 16 ఎంపీ సీట్లు గెలిచి కేసీఆర్ ప్రధాని అవ్వాలని కలలు కన్నారు. ఆయనే మంచిగా పరిపాలిస్తే కాంగ్రెస్‌కు ప్రజలు ఎందుకు అధికారం ఇచ్చారు? ప్రజలు ఎక్కడైనా తప్పు చేస్తారా? ఇచ్చిన హామీలను కేసీఆర్ అమలు చేశారా? దళితుడిని సీఎం చేస్తానని కేసీఆర్ సీఎం అయ్యారు. రాహుల్‌గాంధీని

మిగతా 2లో..





# స్వపక్షం నుంచే ఆందోళనలు

### పోటీపై బైడెన్ త్వరలో నిర్ణయం తీసుకుంటారు

### సన్నిహితుడు హవాయి గవర్నర్ వెల్లడి

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ పోటీపై స్వపక్షం నుంచే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బరి నుంచి వైదొలగబోనని ఇప్పటికే ఆయన తేల్చి చెప్పారు. అయినప్పటికీ.. రేసు నుంచి పక్కకు జరగాలనే డిమాండ్లు బలంగా వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో ఆయనకు అత్యంత సన్నిహితుడు, హవాయి గవర్నర్ జోష్ గ్రీన్ కీలక వ్యాఖ్యలు చేశారు. పోటీలో

మిగతా 2లో..



# నెతన్యాహుకు నిరసన సెగలు

**కీవ్(జనంసాక్షి):**హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌లో మారణహోమం సృష్టించి.. 250 మందికిపైగా పౌరులను బందీలుగా తీసుకెళ్లిన విషయం తెలిసిందే. దీంతో హమాస్ అంతమే లక్ష్యంగా ఇజ్రాయెల్ ప్రతిదాడులు చేపట్టింది. ఇలా గాజా లో యుద్ధం ప్రారంభమై నేటికి తొమ్మిది నెలలు పూర్తయ్యింది. ఈ క్రమంలోనే బందీలను విడిపించాలంటూ ఇజ్రాయెల్‌లో నిరసనకారులు కదం తొక్కారు. గాజాలో దశలవారీగా కాల్పుల విరమణకు మార్గం సుగమమైనట్లు కనిపిస్తోన్న వేళ.. ఈ పరిణామం చోటుచేసుకుంది. నిరసనకారులు దేశవ్యాప్తంగా హైవేలను దిగ్బంధించారు. ప్రజాప్రతినిధుల ఇళ్లముందు ప్రదర్శనలు నిర్వహించారు. కాల్పుల విరమణకు అంగీకరించాలని, ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పదవి నుంచి దిగిపోవాలని డిమాండ్ చేశారు. అక్టోబరు 7నాటి ఘటనలో ప్రాణాలు కోల్పోయిన, బందీలుగా చిక్కుకున్నవారికి గుర్తుగా గాజా సరిహద్దు సమీపంలో 1,500 నలుపు, పసుపు రంగు బెలూన్లను ఎగురవేశారు. ఇదిలా ఉండగా.. బందీల్లో ఇప్పటివరకు 100 మందికిపైగా విడుదలయ్యారు. మరో 120 మంది అక్కడే ఉన్నారు. 40 మంది చనిపోయి ఉండొచ్చని టెల్‌అవీవ్ భావిస్తోంది. తమవారిని విడిపించాల్సిందిగా నెతన్యాహుపై బాధితుల కుటుంబీకులు, పౌరుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది తాజాగా అమెరికా మద్దతిస్తున్న మూడు దశల కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు సాగుతున్నాయి. గాజాలో యుద్ధాన్ని ఇజ్రాయెల్ శాశ్వతంగా ముగిస్తేనే కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరిస్తామని చెప్పిన హమాస్.. తాజాగా ఆ కీలక డిమాండ్‌పై వెనక్కి తగ్గింది.

### సాగునీటి ప్రాజెక్టులను

# త్వరిగతిన పూర్తి చేయ్యండి

స్టేజీ 2, సదర్మట్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరి బేసిన్‌తో పాటు కృష్ణా బేసిన్‌లో అర్థాంతరంగా ఆగిపోయిన ? ప్రాజెక్టుల వివరాలపై ఇరిగేషన్? ఇంజనీర్ల నుంచి సీఎం ఆరా తీశారు. ఇప్పటికే చాలావరకు నిధులు ఖర్చుపెట్టి మధ్యలో వదిలేసిన సాగునీటి ప్రాజెక్టులను రైతులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఆయకట్టు భూములకు నీళ్లను పారించే డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గత ప్రభుత్వం పదేండ్లలో ప్రాజెక్టులన్నీ బ్యారేజీలు, పంప్ హౌజులకే పరిమితమయ్యాయన్నారు. మెయిన్ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆయకట్టుకు నీటిని అందించే కాల్వలు నిర్మించకుండానే గత ప్రభుత్వం వదిలేసిందన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన చాలా ప్రాజెక్టులు అసంపూర్తిగా మిగిలిపోయాయ

## ఆర్మీ క్యాంపు వద్ద కాల్పుల కలకలం

**- గాయపడిన జవాన్**

**రాజౌరి:** జమ్మూకశ్మీర్‌లో రాజౌరి వద్ద మంజకోట్ ఆర్మీ క్యాంపు సమీపంలో శనివారం రాత్రి ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డట్లుగా అధికారులు పేర్కొన్నారు.ఈ ఘటనలో ఓ సైనికుడు గాయపడినట్లుగా ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయి. ఇప్పటికే కుల్గాం జిల్లాలో రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. వీటిల్లో ఐదుగురు ఉగ్రవాదులు హతమైనట్లు అధికారులు వెల్లడించారు. ఇద్దరు సైనికులు కూడా అమరులయ్యారు. శనివారం సైనిక బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య ఎన్‌కౌంటర్లు ప్రారంభమై.. ఇప్పటికీ కొనసాతున్నాయి.కుల్గాం జిల్లాలోని మోడెర్‌గాం, ఫ్రిజల్ ప్రాంతాల్లో ఉగ్రకదలికలు ఉన్నాయన్న పక్కా సమాచారంతో శనివారం భద్రతా బలగాలు ఆపరేషన్లు చేపట్టాయి. మోడెర్‌గాం గ్రామంలోని ఓ ఇంట్లో ఉగ్రవాదులు నక్కినట్లు తెలుసుకున్న సీఆర్‌పీఎఫ్, ఆర్మీ జవాన్లు కాల్పులు జరిపారు. అప్రమత్తమైన ఉగ్రవాదులు ఎదురు దాడి చేశారు. తీవ్ర గాయాలపాలైన ఓ జవాన్.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు.

## ఝార్ఖండ్‌లో కూప్పకూలిన భవనం

**డియోఘర్(జనంసాక్షి):**ఝార్ఖండ్‌లోని డియోఘర్ నగరంలో ఆదివారం తెల్లవారుజామున మూడంతస్తుల భవనం కుప్పకూలింది. శిథిలాల్లో పలువురు చిక్కుకుపోయారు. ఘటనాస్థలికి చేరుకున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది శిథిలాల్లో చిక్కుకున్న ఇద్దరు పిల్లలు, ఓ మహిళను రక్షించారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ విశాల్ సాగర్ తెలిపారు.గొడ్డ నియోజక వర్గ ఎంపీ దూబే మాట్లాడుతూ "ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో డియోఘర్‌లోని బంబం ఝా పాత్‌లో మూడంతస్తుల భవనం కుప్పకూలింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే స్పందించి ఘటనా స్థలానికి సహాయక బృందాలను పంపారు. ఇప్పటి వరకు శిథిలాల నుంచి ముగ్గురిని రక్షించారు. గాయపడిన వారిని దియోఘర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నాం" అని తెలిపారు.

# ఐదేండ్ల వరకూ రేవంత్ సర్కారుకు ఢోకా లేదు

17 సీట్లను మాత్రమే దక్కించుకుంది. అదేవిధంగా ఉత్తరప్రదేశ్‌లోనూ బీజేపీకి ఘోర పరాభవం ఎదురైంది. కర్నాటక, రాజస్థాన్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో కూడా బీజేపీ చతికిలపడింది. ప్రజా వ్యతిరేక విధానాలు, అప్రజాస్వామిక చర్యలను ఓటర్లు నిర్ద్వంద్వంగా వ్యతిరేకించినందునే ఎన్డీయే కూటమికి మెజారిటీ దక్కలేదు. మహారాష్ట్రలాగా వివిధ రాష్ట్రాల్లో ఏక్‌నాథ్ షిండేలను సృష్టించేందుకు వేసిన ఎత్తుగడలు బెడిసికొట్టాయి. ఇప్పుడు ఇతర పార్టీల మద్దతుతో తిరిగి గద్దెనెక్కిన మోడీ సర్కార్.. బీజేపీయేతర రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చే దుస్సాహసానికి యత్నించదు.

**ఎన్డీయేకు మొదలైన మెలికలు**

కేంద్రంలో బీజేపీ సర్కార్ ఏర్పాటుకు కీలకంగా మారిన బీహార్ సీఎం నితీశ్‌కుమార్, ఏపీ సీఎం చంద్రబాబులో ఒకరు మెలికపెట్టారు. బీహార్‌కు ప్రత్యేక హెూదా ఇవ్వాలని నితీశ్ సర్కారు తీర్మానించడం రాజకీయంగా చర్చకుదారితీసింది. కేంద్ర ప్రభుత్వం కొలువుదీరిన నెలరోజుల్లోనే నితీశ్ కుమార్ తమ డిమాండ్లను ముందుకు తీసుకురావడంతో రాజకీయాలు ఆసక్తిగా మారాయి. ఆయనలాగే ఏపీ సీఎం చంద్రబాబు కూడా ఆంధ్రప్రదేశ్‌కు స్పెషల్ ప్యాకేజీ డిమాండ్‌ను తెరపైకి తెచ్చే అవకాశాలున్నాయి. మోడీ సర్కార్‌కు బీహార్, ఏపీ ప్రభుత్వాల మద్దతు కచ్చితం కావడంతో వాళ్ల డిమాండ్లను తిరస్కరించలే పరిస్థితి లేదు. నిర్లక్ష్యం చేసే వారిద్దరు ఎన్డీయే కూటమి నుంచి బయటకొస్తే కేంద్ర సర్కార్‌కు శరాఘాతమే. గతంలో మాదిరి ఏక్‌నాథ్ షిండేలను సృష్టించే పద్ధతులను కూడా నితీశ్, చంద్రబాబు ఒప్పుకోకపోవచ్చు. అటువంటి మోడీ సర్కార్ చర్యలను సమర్థిస్తే రాబోయే రోజుల్లో తమ రాష్ట్రాల్లోనూ 'కూలగొట్టుడు' వ్యవహారాలను తామే ఆహ్వానించినట్టవుతుందని వారి ఆలోచనగా పార్టీవర్గాలు భావిస్తున్నాయి.

**రేవంత్ సర్కార్ 'పటిష్ట' వ్యూహం**

తెలంగాణ మ్యాజిక్ ఫిగర్ కంటే కేవలం రెండుమూడు సీట్లే అధికంగా గెలుపొందిన రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పటిష్ట వ్యూహంతోనే ముందుకెళ్తోంది. ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఒక్కొక్కరిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేలు రేవంత్ సర్కార్‌కు మద్దతుగా కాంగ్రెస్‌లో చేరగా.. అదేబాటలో త్వరలోనే మరికొందరు రానున్నట్టు ముమ్మర ప్రచారం సాగుతోంది. మరోవైపు ఒకేరోజు ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను చేర్చుకుని శాసనమండలిని విలీనం చేసేదిశగా కాంగ్రెస్ సర్కారు పావులు కదుపుతోంది. మండలిలో రోజురోజుకూ బలం పెంచుకునే విధంగా చేరికలకు కాంగ్రెస్ గేట్లు కూడా తెరిచింది. గత పదేళ్లు బీఆర్ఎస్ సర్కారులో కీలకంగా వ్యవహరించిన పలువురు నేతలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ బలోపేతానికి కలిసొస్తుండటం రానున్న ఐదేళ్లలో రేవంత్ సర్కార్‌కు ఢోకా లేనట్టేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

## బీఆర్ఎస్‌కు బిగ్ షాక్..

బండ్ల సాకేత్ రెడ్డితో కలిసి నిన్న శనివారం కాంగ్రెస్ చేరిన విషయం తెలిసిందే. ఇక, తాజాగా అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుతో పాటు ఎమ్మెల్సీ చల్ల వెంకట్రాంరెడ్డి కూడా త్వరలో కాంగ్రెస్ గూటికి చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరిద్దరూ సీఎం రేవంత్‌తో భేటీ అయినట్లు సమాచారం. మరో రెండు లేదా మూడు రోజుల్లో వీరిద్దరూ హస్తం తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలుస్తోంది.ఇదిలా ఉండగా.. గద్వాల బీఆర్ఎస్ పార్టీలో ఎవరూ మిగిలేలా కనిపించడం లేదు. ఎమ్మెల్యే వెంట అందరూ కాంగ్రెస్ పార్టీలోనే చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్?లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు కూడా కాంగ్రెస్?లో చేరనున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక, రానున్న రోజుల్లో ఎవరు ఏ పార్టీలో ఉంటారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

## భాజపాకు అనేక అంశాల్లో కేసీఆర్ మద్దతిచ్చారు

విమర్శించే అర్హత భారాస నేతలకు ఉందా? విలువలు, నిజాయతీ లేని పార్టీ భారాస. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ చాలా నియోజకవర్గాల్లో డిపాజిట్లు కోల్పోయింది" అని జూపల్లి కృష్ణారావు అన్నారు.

### టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి

## తెలంగాణ పేగుబంధాన్ని తెంచుకున్నాం..

చేశారు.మానకొండూరులో జరిగిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారాయన. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేసీఆర్‌తో మాట్లాడి తెలంగాణ అనే అంశంతో ముడివిడిపోకుండా పార్టీని సన్నద్ధం చేస్తామన్నారు. టీఆర్ఎస్ పవర్‌లో లేకపోవచ్చు కానీ.. పవర్ ఫుల్ పార్టీ అన్నారాయన.

# ఉత్తరాఖండ్ అతలాకుతలం



ప్రాంతాల్లోనూ భారీ వర్ష సూచనలున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని కోరింది. మరోవైపు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి శనివారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

**చార్‌ధామ్ యాత్ర నిలిపివేత**

దేహ్రాదూన్: దేవభూమిగా పేరొందిన ఉత్తరాఖండ్ ను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ప్రధాన నదులన్నీ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో భారత వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది.ఉత్తరాఖండ్‌లోని గర్వాల్ ప్రాంతంలో నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. దీంతో చార్‌ధామ్ యాత్రను వాయిదా వేసినట్లు గర్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే తెలిపారు. వర్షాల కారణంగా చమోలీ జిల్లాలోని బద్రీనాథ్ నేషనల్ హైవేపై పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఫలితంగా వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.కర్ణప్రయాగ, గౌచర్ మధ్యలోని బద్రీనాథ్ నేషనల్ హైవేపై శనివారం ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు బద్రీనాథ్ ఆలయాన్ని దర్శించుకుని బైక్‌పై తిరిగొస్తుండగా.. మార్గమధ్యంలో కొండచరియలు విరిగి పడ్డాయి. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. అదే రోజు రాంనగర్‌లోని ఓ వంతెన కూలిపోయింది. రెడ్ అలర్ట్ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి అన్ని కలెక్టర్లను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరిస్థితులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని ఆదేశించారు.

**జలపాతం చూసేందుకు వెళ్లి.. వరదలో చిక్కుకొని!**

ఓ జలపాతం చూసేందుకు వెళ్లిన టూరిస్టులకు ఊహించని పరిణామం ఎదురైంది. భారీ వర్షాల కారణంగా సమీపంలోని నది నీటి మట్టం ఒక్కసారిగా పెరిగింది. దీంతో దాదాపు 80 మంది వరదలోనే చిక్కుకుపోయారు.రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు వారిని రక్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ ఘటన గోవా (ఉనీజీ)లో చోటు చేసుకొంది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..గోవాలోని సత్తారి తాలూకాలోని పాలి జలపాతానికి ఆదివారం భారీ సంఖ్యలో పర్యాటకులు వెళ్లారు. జలపాతాన్ని చేరుకోవాలంటే ముందుగా ఓ నదిని దాటాల్సి ఉంటుంది. ఆదివారం కావడంతో భారీ సంఖ్యలో అక్కడి చేరుకున్నారు. అప్పటికే భారీ వర్షం రావడంతో నది నీటి మట్టం ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో 80 మంది అక్కడే చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న సహాయక బృందాలు రంగంలోకి దిగాయి.ఘటనాస్థలానికి చేరుకుని బాధితులను కాపాడేందుకు చర్యలను ముమ్మరం చేసాయి. ఇప్పటివరకు 50 మందిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. మరో 30 మంది అక్కడే చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. వారిని రక్షించేందుకు శ్రమిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అక్షత్ కౌశల్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి.

## మాతో టచ్‌లో 26 మంది ఎమ్మెల్యేలు..

**వాళ్లు బీజేపీలోకి వస్తే: బండి సంజయ్**



**కరీంనగర్(జనంసాక్షి):** తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రజా తీర్పుతో గెలిచిన కొందరు నేతలు పార్టీలు మారుతున్నారు. ఎవరూ ఏ పార్టీలో ఉన్నారో చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి.ఇలాంటి తరుణంలో కేంద్ర సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ మరో బాంబు పేల్చారు. తమతో 26 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని చెప్పుకొచ్చారు.కాగా, బండి సంజయ్ ఆదివారం మీడియాతో మాటాడుతూ.. కరీంనగర్ అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాం. రాహదారులపై ఈరోజు ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్ష చేస్తున్నాను. ప్రసాదం, రామాయణ్ సర్క్యూట్ స్కీమ్స్ ద్వారా వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. రాబోయే రోజుల్లో కరీంనగర్- హసన్‌పర్తి రైల్వే లైన్ ప్రణాళికకు రూపొందిచబోతున్నాం. దాని వల్ల కరీంనగర్ వాణిజ్యపరంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉంటాయి. కరీంనగర్‌కు ట్రిబుల్ ఐటీ వంటి విద్యాసంస్థల కోసం ప్రయత్నం చేస్తాను.ఇక, తెలంగాణలో రాజకీయాలకు వస్తే రాష్ట్రంలో 26 మంది ఎమ్మెల్యేలు మాకు టచ్‌లో ఉన్నారు. కానీ, వారంతా బీజేపీలోకి రావాలంటే కచ్చితంగా రాజీనామా చేయాల్సి ఉంటుంది. అందుకే వాళ్లు మా పార్టీలోకి రావడానికి తర్జనభర్జన పడుతున్నారు. బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్న వాళ్లను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు. బీఆర్ఎస్ ఏ తప్పు అయితే చేసిందో కాంగ్రెస్ కూడా అదే తప్పు చేస్తోంది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు' అంటూ కామెంట్స్ చేశారు.

# రెండు రాష్ట్రాలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి

కృషి చేశారు. వారందరికీ ధన్యవాదాలు. ఎన్టీఆర్ అనేక పరిపాలనా సంస్కరణలు తీసుకొచ్చారు. సంక్షేమానికి నాంది పలికిన నాయకుడు ఆయన. తెలంగాణలో అధికారంలో లేకున్నా కార్యకర్తలు పార్టీ వదల్లేదు. పార్టీ నుంచి నాయకులు తప్ప కార్యకర్తలు వెళ్లలేదు. తెలుగుజాతి ఉన్నంతవరకు తెదేపా జెండా రెపరెపలాడుతుంది. సంక్షోభాన్ని అవకాశంగా మలచుకుని మళ్లీ అధికారంలోకి వచ్చాం. నన్ను జైల్లో పెట్టినపుడు తెదేపా శ్రేణులు చూపించిన చొరవ మరువలేను. ప్రపంచంలోని చాలా దేశాల్లో నా అరెస్ట్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. ఆ సమయంలో గచ్చిబౌలిలో నిర్వహించిన సభను నేను మరిచిపోలేను. హైదరాబాద్‌లో నాకు మద్దతుగా నిర్వహించిన ఆందోళనలను టీవీలో చూసి గర్వపడ్డా.నాలెడ్జి ఎకానమీకి తెదేపా హయాంలో నాంది పలికాం. నా తర్వాత కాంగ్రెస్, భారాస అభివృద్ధిని కొనసాగించాయి. విభజన సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకున్నాను. దాన్ని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతించారు. ఆయనకు మరోసారి కృతజ్ఞతలు. తెలుగు రాష్ట్రాల మధ్య ఐకమత్యం ఉండాల్సిన అవసరముంది. తెలుగు భాష, జాతి ప్రయోజనాలను పరిరక్షించుకోవాలి. ఏపీ, తెలంగాణ అభివృద్ధే తెదేపా ధ్యేయం. ఇరు రాష్ట్రాల మధ్య వివాదం ఉంటే నష్టాలే ఎక్కువ. ఇచ్చిపుచ్చుకునే ధోరణితోనే సమస్యలు పరిష్కారమవుతాయి. తెలంగాణలో కాంగ్రెస్, ఏపీలో ఎన్డీయే ప్రభుత్వాలు ఉన్నాయి. సిద్ధాంతపరంగా ఆలోచనలు వేరుగా ఉన్నప్పటికీ తెలుగుజాతి ప్రయోజనాల కోసం కలిసి పనిచేస్తాం. 2019 తర్వాత ఏపీలో విధ్వంస ప్రభుత్వం వచ్చింది. విభజన కంటే వైకాపా పాలనతో జరిగిన నష్టమే ఎక్కువ.యువగళం, నిజం గెలవాలి కార్యక్రమాలు ప్రాచుర్యం పొందాయి. నిజం గెలవాలి కార్యక్రమాలు ప్రాచుర్యం పొందాయి. ఎన్నికల్లో ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి 70 రైళ్లలో ప్రజలు తరలివచ్చారు. రూ.లక్షలు ఖర్చు పెట్టుకుని ఎన్ఆర్ఐలు వచ్చారు. అందరూ ఓటు వేయడంతో ఏపీ ఎన్నికల్లో సునామీ వచ్చింది. గతంలో ఏపీలో ఉన్న భూతాన్ని చూసి కంపెనీలు రాలేదు. రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు కృషి చేస్తా" అని చంద్రబాబు తెలిపారు.

# స్వపక్షం నుంచే ఆందోళనలు

ఉండాలా? లేదా? అనే విషయంపై కొన్ని రోజుల్లో బైడెన్ తన నిర్ణయం వెల్లడిస్తారని శనివారం తెలిపారు. గ్రీన్ ఇటీవల బైడెన్ సహా ఇతర డెమోక్రాటిక్ పార్టీకి చెందిన గవర్నర్లతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన నుంచి ఈ తరహా ప్రకటన వెలువడడం ప్రాధాన్యం సంతరించుకుంది. అధ్యక్ష రేసు నుంచి వైదొలగాలని బైడెన్ భావిస్తే.. ఆ స్థానంలో కమలా హ్యారిస్‌ను ఆయన ప్రతిపాదించే అవకాశం ఉందని తెలిపారు. 'గెలవడం సాధ్యం కాదని అధ్యక్షుడు భావిస్తే ఆయన పోటీ నుంచి వైదొలగుతారు. ఆయన సన్నిహిత వర్గాలు సైతం పోటీ నుంచి దూరం కావాలని డిమాండ్ చేసినా అభ్యర్థిత్వంపై పునరాలోచిస్తారు. ఆ పదవికి తాను తగినవాడిని కాదని భావిస్తే ఆయన కచ్చితంగా పక్కకు జరుగుతారు. దీనిపై బైడెన్ త్వరలో తన నిర్ణయాన్ని వెల్లడిస్తారు" అని మీడియాతో మాట్లాడుతూ గ్రీన్ అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో కొన్ని క్లిష్ట సమయాలు ఉంటాయని గ్రీన్ అన్నారు. సొంతింట్లోనే పెద్దవాళ్లు అప్పుడప్పుడు వారి అభిప్రాయాలను వ్యక్తపర్చడంలో తడబడుతుంటారని తెలిపారు. అంతమాత్రాన వారి అనుభవం, తెలివితేటలు, కుటుంబంలో వారి పాత్రను విస్మరించలేమని తెలిపారు. అందుకే తాను ఇప్పటికీ బైడెన్‌కు మద్దతుగా ఉన్నానని పేర్కొన్నారు. పరోక్షంగా రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ట్రంప్‌తో జరిగిన సంవాదంలో బైడెన్ తడబడినంత మాత్రాన ఆయన సామర్థ్యాన్ని అనుమానించాల్సిన అవసరం లేదని వివరించారు.మరోవైపు వయసులో ట్రంప్ సైతం తక్కువేమీ కాదని గ్రీన్ గుర్తుచేశారు. బైడెన్ కంటే కేవలం మూడేళ్లు మాత్రమే చిన్నవారన్నారు. అధ్యక్షుడికి వయసుతో సంబంధం లేదని.. బాధ్యతలకు కట్టుబడి ఉండడం మాత్రమే ముఖ్యమని వ్యాఖ్యానించారు. అర్ధరాత్రి లేచి వివిధ దేశాల మధ్య అగ్గిరాజేసే ట్వీట్లు చేసే అధ్యక్షుడు మనకు అవసరం లేదని పరోక్షంగా ట్రంప్‌ను విమర్శించారు. బైడెన్‌తో అలాంటి సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు.బైడెన్ పోటీ నుంచి నిష్క్రమించాల్సి వస్తే ఆ స్థానంలో ఎవరు ఉండాలనే విషయంపై ఆయనకే వదిలేస్తే బాగుంటుం దని గ్రీన్ అభిప్రాయపడ్డారు. ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌ను ప్రతిపాదిస్తే మొత్తం డెమోక్రాటిక్ పార్టీ ఆనందిస్తుందని తాను భావిస్తున్నానన్నారు. ప్రస్తుతం ఆమె కంటే మెరుగైన అర్హులు ఎవరూ లేరని పేర్కొన్నారు.

# తీరు మారని చైనా

## భారత సరిహద్దుల్లో బంకర్ల నిర్మాణం!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్‌ను కవ్వించే ప్రయత్నాలు చేస్తోంది చైనా. ఇప్పటికే భారత సరిహద్దులను డ్రాగన్ దేశం అస్థిరపరిచే కుట్రను గత కొన్నేళ్లుగా అమలు చేస్తోంది. అయితే తాజాగా చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) తూర్పు లడఖ్‌లోని ప్యాగ్యాంగ్ సరస్సు చుట్టుపక్కల అండర్‌గ్రౌండ్ బంకర్లు నిర్మిస్తున్నట్లు ఉపగ్రహ చిత్రాల ద్వారా కనిపిస్తోందని రక్షణ రంగ నిపుణులు వెల్లడించారు.ఆయుధాలు, ఇంధనం, సైనిక వాహనాల కోసం చైనా ఆర్మీ బంకర్లు నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ప్యాగ్యాంగ్ సరస్సుకు ఉత్తర వైపు పర్వతాల మధ్య చైనా ఆర్మీ బేస్ సిర్జాప్ వద్ద బంకర్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ బంకర్ల నిర్మాణాలు వాస్తవాధీన రేఖకు కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ప్రస్తుతం ఈ బంకర్లు నిర్మిస్తు ప్రాంతంలో 2020 ప్రారంభమైన ప్రతిష్టంభనకు ముందు ఎటువంటి మానవ సంచారం లేదు.2021-22 మధ్య నిర్మించిన బంకర్లుగా కనిపిస్తున్నాయి. ఈ బేస్‌లో ఆయుధాలు, ఇంధనం, ఇతర సామాగ్రి భద్రపరచం కోసం నిర్మించిన బంకర్లుగా కనిపిస్తున్నాయి. యూఎస్‌కు చెందిన బ్లాక్‌స్కై సంస్థ అందించిన ఉపగ్రహ చిత్రాల ఈ విషయం తెలుస్తోంది. సాటిలైట్ మే 30న తీసినఫోటోలో ఒక పెద్ద బంకర్.. దానికి ఎనిమిది ఎన్‌ట్రెన్స్‌లు. మరో చిన్న బంకర్.. దానికి ఐదు ఎన్‌ట్రెన్స్ ఉ?న్నట్లు స్పష్టం తెలుస్తోంది.అదే విధంగా పక్కనే పలు పెద్ద బిల్డింగ్‌లు, సైనిక వాహనాలతో అనేక షెల్టర్లు ఉన్నాయి. సైనిక వాహనాలను గగనతల దాడుల నుంచి రక్షించుకోవడానికి చైనా ఆర్మీ షెల్టర్లు నిర్మించుకున్నట్లు రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




మరోవైపు.. ఇటీవల జరిగిన ఎస్‌సీవో సదస్సు సందర్భంగా ఆస్తానాలో భారత? విదేశాంగ మంత్రి జైశంకర్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భేటీ అయ్యారు. ఈ భేటీలో ద్వైపాక్షిక సంబంధాలపై లోతుగా చర్చించారు. సరిహద్దుల్లో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని ఇరు నేతలూ తీర్మానించారు. ఇందుకోసం సైనిక, దౌత్య మార్గాల్లో ప్రయత్నాలను వేగవంతం చేసేందుకు అంగీకారం తెలిపారు.

### రష్యాకు ధీటుగా ఉక్రెయిన్

## ప్రతిదాడులు..

కొన్ని ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నామన్నారు. అయితే, అక్కడ పేలుడు పదార్థాలు ఇంకా విస్ఫోటం చెందుతూనే ఉన్నాయని స్థానిక అధికారులు పేర్కొన్నారు.మరోవైపు ప్రధాని నరేంద్రమోదీ జులై 8, 9 తేదీల్లో రష్యాలో పర్యటించనున్నారు. అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆహ్వానం మేరకు 22వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటారు. సమకాలీన ప్రాంతీయ వ్యవహారాలు, అంతర్జాతీయ అంశాలు కూడా వీరు చర్చించే అవకాశం ఉంది. 2019 తర్వాత మోదీ రష్యాకు వెళ్లడం ఇదే తొలిసారి.



## ఎంపీ మహువాపై కేసు

**దిల్లీ(జనంసాక్షి):**

జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రేఖా శర్మపై 'ఎక్స్' వేదికగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై పోలీసులు కేసు నమోదు చేశారు.ఎన్సీడబ్ల్యూ ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 79 ప్రకారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఇటీవల హాథ్రస్‌లో జరిగిన తొక్కిసలాటలో 121 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అందులో గాయపడిన మహిళలను పరామర్శించేందుకు రేఖాశర్మ బాధితుల ఇళ్లకు వెళ్లారు. ఆ సమయంలో వర్షం పడటంతో పక్కనున్న వారు ఆమెకు గొడుగుపట్టారు.దీనికి సంబంధించిన వీడియోను మొయిత్రా గురువారం 'ఎక్స్'లో పోస్టు చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిని సుమోటోగా తీసుకొని ఆమెను అరెస్టు చేయాల్సిందిగా జాతీయ మహిళా కమిషన్ శుక్రవారం డిమాండ్ చేసింది. ఆ తర్వాత కూడా మొయిత్రా ఏమాత్రం తగ్గకుండా.. ఎన్సీడబ్ల్యూ పోస్టుకు దిల్లీ పోలీసులను ట్యాగ్ చేస్తూ.. ప్రస్తుతం పశ్చిమబెంగాల్‌లోని నడియా జిల్లాలో ఉన్నానని మూడు రోజుల్లోగా వచ్చి అరెస్టు చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా 'నా గొడుగు నేను పట్టుకోగలను' అంటూ రేఖాశర్మను ఉద్దేశించి అన్నారు. ఈ క్రమంలో పోలీసులు ఆమెపై కేసు నమోదు చేయడం గమనార్హం.పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగినందుకు డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలతో మహువా మొయిత్రా గత లోక్‌సభలో బహిష్కరణకు గురైన సంగతి తెలిసిందే. గత లోక్‌సభలో బహిష్కరణకు గురైన సంగతి తెలిసిందే.ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కృష్ణానగర్ (నడియా నార్త్) లోక్‌సభ నియోజకవర్గం నుంచి 50 వేల పైచిలుకు ఓట్లతో ఆధిక్యంతో ఆమె గెలుపొందారు.

## ఎన్టీఆర్ జిల్లాలో ఘోర ప్రమాదం

చెందారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జిల్లా కలెక్టర్ సృజన పరామర్శించారు. మరో ముగ్గురు కార్మికుల పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.అమరావతి: ఎన్టీఆర్ జిల్లాలోని అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమలో బాయిలర్ పేలిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు అండగా నిలవాలని ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్యంపై సీఎంఓ అధికారులతో మాట్లాడి తెలుసుకున్న చంద్రబాబు.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఘటనకు గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు కంపెనీ నుంచి పరిహారం అందేలా చూడడంతో పాటు ప్రభుత్వం నుంచి కూడా సాయం అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు.సిమెంట్ పరిశ్రమలో పేలుడు ఘటనపై కార్మికశాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ స్పందించారు. ప్రీ హీటర్ లోపంతోనే పేలుడు జరిగినట్లు తెలిసిందని చెప్పారు. దాన్ని జాగ్రత్తగా నిర్వహించడంలో సంస్థ విఫలమైందన్నారు. ఘటనపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

## ఆశ్రునైనాల మధ్య ఎస్ఐ శ్రీనివాస్ అంతిమయాత్ర

- ఎస్సై మృతదేహంతో జాతీయ రహదారిపై ధర్నా



**నల్లబెల్లి జులై 07 (జనం సాక్షి):** ఆశ్రునైనాల మధ్య ఎస్సై శ్రీనివాస్ అంతిమయాత్ర సొంత గ్రామమైన నారక్క పేటలో ఆదివారం జరిగింది. ఖమ్మం జిల్లా అశ్వరావుపేట మండలం ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీరాముల శ్రీనివాస్ సిఐ జితేందర్ రెడ్డి, కానిస్టేబుల్ల వేధింపులు కారణంగా జూన్ 30న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. హైదరాబాదులోని యశోద ఆసుపత్రిలో గత వారం రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్సై కుటుంబానికి న్యాయం చేయాలంటూ శ్రీనివాస్ మృతదేహంతో జాతీయ రహదారిపై దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు నాలుగు గంటల పాటు ధర్నా చేశారు. దీంతో రోడ్డుపై భారీగా వాహనాలు ఆగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ధర్నాలో పాల్గొని బాధిత కుటుంబానికి అండగా నిలిచాడు. శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని ఒకరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏసీపి కిరణ్ కుమార్ శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు ధర్నాను విరమింప చేయలేదు. చివరకు భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రాజీవ్ రంజన్ వచ్చి శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమింపజేశారు. శ్రీనివాస మృతితో సొంత గ్రామమైన నారక్క పేటలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. మృతుడు శ్రీనివాస్ కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కార్యక్రమంలో డిసిపి రవీందర్, డిఎస్ పిఎస్కే అబ్దుల్ రెహమాన్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

- ఆలోచన బాగా ఉన్న, ఆచరణ లేకపోతే ఫలితాలు రావు
- ఇంటింటికి సర్వే చేసి అందించిన మొక్కల స్థితిగతుల వివరాలను తెలుసుకోవాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క



**ములుగు ప్రతినిధి, జులై 07(జనంసాక్షి) :** వన మహోత్సవం కార్యక్రమం కింద జిల్లాలో నాటిన ప్రతి మొక్క సంరక్షణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని, మొక్కల పెంపకం, సంరక్షణలో నాణ్యత పెరగాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అనసూయ అన్నారు. ములుగు జిల్లాలోని జాకారం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ, డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి మొక్కలు నాటి వన మహోత్సవం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మంత్రి విద్యార్థులతో కలసి అల్పాహారం చేశారు. మంత్రి, జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేయడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యత, మొక్కల పెంపకం, పచ్చదనం ప్రాముఖ్యత విద్యార్థి దశ నుంచే పిల్లలకు తెలియాలనే ఉద్దేశ్యంతో పాఠశాల వద్ద వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని అధికారులు జవాబుదారీతనంతో పూర్తి చేయాలని మంత్రి సూచించారు. మొక్కల పెంపకం చాలా మంచి ఆలోచన అని, దీనివల్ల అనేక లాభాలు ఉంటాయని తెలిపారు. ఆలోచన బాగా ఉన్న ఆచరణ సరిగ్గా లేకపోతే ఆశించిన ఫలితాలు దక్కవని, పటిష్ట కార్యాచరణతో వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మొక్కలను నాటడంలో పెద్ద లక్ష్యాలను ఏర్పాటు చేసుకోకుండా, తక్కువ మొక్కలు నాటినప్పటికీ వాటిని వంద శాతం సంరక్షించాలని అన్నారు. ఇంటింటికి పంపిణీ చేసే మొక్కలు, రోడ్డుపై నాటే మొక్కల లెక్కలు పక్కాగా ఉండాలని అన్నారు. జాతీయ రహదారి, తొంగలు, వాగులు ఇరువైపులా అవసరమైన మేర మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ప్రభుత్వం నాటుతున్న మొక్కలు, ఇండ్లకు పంపిణీ చేస్తున్న మొక్కల ఆడిట్ నిర్వహించాలని అన్నారు. మొక్కల పంపిణీ పూర్తి చేసిన తర్వాత రెగ్యులర్ గా ఇంటింటికి సర్వే నిర్వహిస్తూ ఆ మొక్కల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని అన్నారు. జిల్లా కేంద్రం లో ప్రజలకు అవసరమైన పూల మొక్కలు, ఇతర మొక్కలు కుండీలలో పెంచే విధంగా అందించే అవకాశాలు పరిశీలించాలని మంత్రి అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోనే ములుగు జిల్లాలో 76 -77 అటవీ శాతం ఉందని దీని ద్వారానే ములుగు జిల్లాలో ఎక్కువ వర్షపాతం నమోదు అవుతుందని కురిసిన వర్షపు నీటిని నిల్వ చేయడం కోసం చెరువులు, కుంటలు, చెక్ డ్యాముల ద్వారా నిర్మాణం జరగాలని అటవీ ప్రాంతంలో కూడా చెక్ డాంల నిర్మాణాలు చేపట్టాలని దీని ద్వారా వర్షపు నీరు నిల్వ ఉండటం ద్వారా అటవీ ప్రాంతంలో ఉండే అటవీ జంతువులకు అటవీ వృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ములుగు ప్రాంతాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం ఫైల్ గవర్నర్ వద్ద పెండింగ్ ఉందని, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ఫైల్ ను ముందుకు తీసుకువెళ్లడం జరిగిందని, త్వరలోనే మల్లంపల్లి మండల ఏర్పాటు, ఏటూరు నాగరం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తాం అని తెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకొని సివిల్ సర్వీసెస్ ఇంజనీరింగ్ సాఫ్ట్వేర్ వైద్యులు ఇలా వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని మంత్రి పేర్కొన్నారు. వసతి గృహాల్లోని విద్యార్థులకు మెరుగైన విద్య, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు.

## నేడు గ్రేటర్‌లో వనమహోత్సవం ప్రారంభం

**హైదరాబాద్ జూలై 7(జనంసాక్షి):** జిహెచ్ఎంసి వ్యాప్తంగా నేటి నుండి రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవ ప్రారంభించ నుంది. నగరంలో మొత్తం 30 లక్షలు మొక్కలు నాటలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించారు నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు జీహెచ్ఎంసీలో అంతకంటే ఎక్కువగా సిద్ధం చేసారు. ఉచితంగా మొక్కల ఇవ్వడమే కాకుండా ఇంటింటికీ మొక్కలను సరఫరా చేస్తారు. గతంలో నగరంలో నాటిన మొక్కలతో అంతర్జాతీయ స్థాయిలో ట్రీ సిటీ అవార్డు వచ్చింది. అదే స్ఫూర్తితో పార్కుల్లోగాని, మీడియం, రోడ్డు కిరువైపుల మొక్కలు నాటేందుకు కార్యాచరణ చేపట్టారు. నేటి ఉదయం 10 గంటలకు ఉప్పల్ సర్కిల్ 2 హబ్సిగూడ సర్కిల్ 8 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రామంతపూర్‌లో రాష్ట్ర బిసి, రవాణా శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ కార్పొరేటర్ తదితరులు పాల్గొంటారని అడిషనల్ కమిషనర్ యుబిడీ సునంద తెలిపారు.

## రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

- పూర్తిగా పాడైన వరంగల్ ఖమ్మం 563 రోడ్డు



**దంతాలపల్లి, జూలై 07(జనం సాక్షి) :** జాతీయ రహదారిపై ప్రయాణం అంటే ఎవరైనా హ్యాపీగా వెళ్లొచ్చని అనుకుంటారు. మండల పరిధిలోని వరంగల్ ఖమ్మం 563 రాష్ట్ర రహదారి అంటే మాత్రం అందరూ భయపడుతున్నారు. అక్కడక్కడ ఉన్న గుంతలపై ప్రయాణం చేయడానికి భయపడుతున్నారు, ప్రమాదకరంగా మారిన చోట ఇంజనీరింగ్ అధికారులు కనీసం డాంబర్ తో ప్యాచ్ వర్క్ చెయ్యకపోవడంతో పలుమార్లు యాక్సిడెంట్లు జరిగి పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్న అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న తీరుపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని బొడ్లాడా స్టేజి నుంచి ఎంపీడీవో కార్యాలయం సమీపంలో, పోలీస్ స్టేషన్ ముందు, తహసిల్దార్ కార్యాలయం సమీపంలో రాత్రి పగలు అనే తేడా లేకుండా రోడ్డుపై నిలుస్తున్న వాహనాలు, ఇలా నర్సింహులపేట మండలం సరిహద్దు వరకు సుమారు 9 కిలోమీటర్లు వరకు జాతీయ రహదారి, ఆయా రోడ్లపై జనవరి 2024 నుంచి ఇప్పటివరకు రోడ్డు ప్రమాదంలో యాక్సిడెంట్లకి గురై 08 మంది మృతి చెందగా, ఆరు కేసులు నమోదయ్యాయి. ఇలా పలుమార్లు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణమే రోడ్డు మరమాతలు చేపట్టి ప్రమాదలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?



పలుమార్లు వరంగల్, ఖమ్మం 563 రాష్ట్ర రహదారిపై ప్రమాదాల జరుగుతున్న ఆర్ అండ్ బి అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు మూర్త శ్రీనివాస్ అన్నారు. ఈ ప్రమాదలు జరుగుతున్నట్లు జనం సాక్షి దినపత్రికలో పలు వార్తలు వచ్చిన విషయాన్ని రోడ్డు రవాణా శాఖ అధికారులు పట్టించుకున్నట్లయితే శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు, జరిగేవి కావానీ, అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని, ఇప్పటికైనా అధికారులు అక్కడక్కడ రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి.

**కాంగ్రెస్ పార్టీ నాయకులు మూర్త శ్రీనివాస్**

## టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హసన్ ఆత్మహత్యాయత్నం



**ఖమ్మం, జూలై 7 (జనంసాక్షి) :** తెలంగాణ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హసన్ ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించాడు. ఆదివారం ఖమ్మంలోని ఆయన నివాసంలో ఎక్కువ మోతాదులో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడడం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సంచలనంగా మారింది. కుటుంబ సభ్యులు అఫ్జల్ ను ఖమ్మంలోని ఒక ప్రైవేటు హాస్పిటల్ కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఉద్యోగ సంఘంలో మంచి గుర్తింపు పొందిన నాయకుడు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడంతో జిల్లావ్యాప్తంగా ఉన్న నాన్ గెజిటెడ్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే అశ్వరావుపేట ఎస్సైఆత్మహత్య చేసుకుని మరణించగా.., ఒక రోజైనా గడవకముందే ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనకు పాల్పడడం పట్ల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ నేపథ్యంలో టీఎన్జీవోస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా బాధ్యులు, పలువురు ఉద్యోగులు, నాయకులు అఫ్జల్ ను పరామర్శించేందుకు ఆసుపత్రికి చేరుకున్నారు. ఆయన స్పృహలో లేకపోవడంతో కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఇటీవల ఆయన జైలుకెళ్ళడం, కొందరు నాయకుల వేధింపులు ఎక్కువకావడంతో మనస్తాపానికి గురై ఈ ఘటనకు పాల్పడ్డట్లు తెలుస్తోంది.

## బిఎమ్మెఎస్‌లో చేరికలు



**మందమర్రి, జూలై 7 (జనంసాక్షి) :** సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ లో భారీ చేరికలు ఆహ్వానం పలికిన యాదగిరి సత్తయ్య అధ్యక్షులు ఆదివారం ఉదయం 11 గంటలకు సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ మందమర్రి ఏరియా సర్వసభ్య (జనరల్ బాడీ) సమావేశం సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ మందమర్రి యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా యాదగిరి సత్తయ్య అధ్యక్షులు, నూతన కమిటీని ప్రకటించిన అనంతరం మాట్లాడుతు సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కరించడంలో ముందంజలో ఉండాలని, నూతన బొగ్గు గనుల సాధింపునకు వేలం పాటలో సింగరేణి యాజమాన్యం పాల్గొనాలని, సింగరేణి కార్మికునికి సొంతింటి కల నెరవేర్చుటకు చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేసినారు, సింగరేణి కార్మికుల ఆదాయ పన్ను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సింగరేణి యాజమాన్యం రియంబర్స్ మెంట్ చెల్లించాలని, సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యం కొరకు కార్పొరేట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ప్రతి రీజన్లో ఒకటి ఏర్పాటు చేయుటకు కృషి చేయాలని, సింగరేణి కార్మికుల పిల్లల మెరుగైన విద్య కోసం సింగరేణి వ్యాప్తంగా కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటుకు మరియు సీబీఎస్సీ సిలబస్ లో బోధన ఏర్పాట్లు కోసం కృషి చేస్తామని తెలిపినారు,ఏండ్ల తలబడి ఎదురుచూస్తున్న మారుపేర్ల మార్పిడి డిప్యూటీ సెంటర్ లేబర్ కమిషనర్ వద్ద జరిగిన మెమోరండం అప్ అండర్ స్టాండింగ్ మారుపేర్ల మార్పిడి అమలు చేయుటకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినారు, ఇండియా మాదిరిగా హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేసినారు, ఢిల్లీలో జరిగిన అపెక్స్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం సింగరేణిలో మిగులు క్వార్టర్స్ ను నామినల్ రెంటల్ ద్వారా కాంట్రాక్ట్ కార్మికులకు అలాట్ మెంట్ చేయాలని విజ్ఞప్తి చేసినారు ఈనెల 14వ తేదీన శ్రీరాంపూర్ లో జరుగు 28వ ద్వై వార్షిక మహాసభలను జయప్రదం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేసారు.

## విద్యావ్యవస్థను పట్టించుకోండి

- సీఎంకు హరీష్‌రావు లేఖ

**హైదరాబాద్, జూలై 7 (జనంసాక్షి) :** రాష్ట్రంలో గాడితప్పుతున్న ప్రభుత్వ విద్యావ్యవస్థ పట్టించుకోండని సీఎం రేవంత్‌రెడ్డికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ రాశారు. విద్యాశాఖకు కూడా నిర్వర్తిస్తున్న సీఎం రాజకీయ అంశాలకు మాత్రమే అధిక ప్రాధాన్యమిస్తున్నారని, ఆ శాఖపై దృష్టి సారించడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలన టీచర్లకు, విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలలకు శాపంగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 'మన ఊరు- మన బడి' అనే మహోన్నత కార్యక్రమాన్ని ప్రారంభిస్తే, మీరు దాన్ని కొనసాగించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, కొన్ని పాఠశాలలో విద్యార్థులకు ముక్కిన బియ్యంతో భోజనం పెడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల పౌష్టికాహారం కోసం అందించే కోడి గుడ్ల బిల్లులు సైతం చెల్లించని పరిస్థితి ఏర్పడిందని, రెండు జతల స్కూల్ యూనిఫామ్ ఇవ్వకుండా ఒక్క జత బట్టలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో పాఠశాలల్లో దోమలు, ఈగలు ముసురుతున్నాయని, ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయకపోవడంతో సిలబస్ ప్రకారం, పాఠ్యాంశాలు పూర్తి కావడం ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు.

## 15 రోజుల్లో కరీంనగర్-జగిత్యాల రహదారి విస్తరణ పనులకు టెండర్లు

- మోదీ 100 రోజుల యాక్షన్ ప్లాన్ లో కరీంనగర్ - జగిత్యాల రోడ్డు
- 40 శాతం పూర్తయిన భూసేకరణ
- వచ్చే ఏడాది జూలై నాటికి పనులు పూర్తి
- నిర్ణీత గడువులోగా విస్తరణ పనులను పూర్తి చేయాలని ఆదేశం
- పనుల పురోగతిపై ఎన్ హెచ్ ఏఐ అధికారులతో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సమీక్ష



**కరీంనగర్ బ్యూరో, జూలై 7 (జనంసాక్షి) :** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారి విస్తరణ పనులపై కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రధానంగా కరీంనగర్-జగిత్యాల, కరీంనగర్ - వరంగల్ (ఎన్ హెచ్ 563) జాతీయ రహదారి విస్తరణ పనులపై ఫోకస్ పెట్టారు. ఈరోజు కరీంనగర్‌లోని తన కార్యాలయంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సమావేశమయ్యారు. కరీంనగర్ నుండి వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులు ఎంత వరకు వచ్చాయి? ఎదురవుతున్న ఇబ్బందులేమిటి? ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారు? అట్లాగే కరీంనగర్ నుండి జగిత్యాల వరకు జాతీయ రహదారుల విస్తరణ పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతోంది? భూసేకరణ ఎంత వరకు వచ్చింది? టెండర్ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభిస్తారు? పనులెప్పుడు మొదలుపెడతారు? ఈ విషయంలో ఎదురువుతున్న ఇబ్బందులేమిటి? అనే అంశాలపై అధికారులతో చర్చించారు. కరీంనగర్ - జగిత్యాల జాతీయ రహదారి(ఎన్‌హెచ్ 563) విస్తరణ పనులకు సంబంధించి 15 రోజుల్లోపు టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుందని బదులిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రూపొందించిన వంద రోజుల ప్రణాళికలో కరీంనగర్ - జగిత్యాల రహదరి విస్తరణ పనుల అంశం ఉండటంతో సెప్టెంబర్‌లోగా టెండర్ ప్రక్రియను పూర్తి చేసుకుని పనులను ప్రారంభించే అవకాశాలున్నాయని తెలిపారు. ఈ రహదారికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ 40 శాతం మేరకు పూర్తయ్యిందని, త్వరలోనే భూసేకరణ ప్రక్రియను సైతం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రహదారి విస్తరణలో భాగంగా మూడు ప్రాంతాల్లో బైపాస్ రోడ్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు రూ.2,227 కోట్ల అంచనా వ్యయంతో 58 కి.మీల పొడవున చేపట్టే విస్తరణ పనుల్లో భాగంగా 6 మేజర్, 18 మైనర్ బ్రిడ్జిలతోపాటు195 కల్వర్టులను నిర్మించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా భూసేకరణలో ఎదురువుతున్న ఇబ్బందులను అధికారులు ప్రస్తావించగా.. సంబంధిత జిల్లా కలెక్టర్, ఇతర శాఖల అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని మంత్రి పేర్కొన్నారు.

అంతకుముందు కరీంనగర్ నుండి వరంగల్ వరకు జాతీయ రహదారి విస్తరణ పనుల పురోగతిపై మంత్రి బండి సంజయ్ ఆరా తీయగా "ఇప్పటి వరకు 37 శాతం పూర్తయ్యాయి. 2025 జులై నాటికి విస్తరణ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయి."అని పేర్కొన్నారు. కొన్నిచోట్ల సర్వీస్, స్ట్రక్చరల్ రోడ్ల ఏర్పాటుపై ప్రజల నుండి వినతులు అందుతున్నాయని అధికారులు పేర్కొనడంతో... ప్రజలకు, రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బండి సంజయ్ తోపాటు ఎన్ హెచ్ ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ మాధవి, అధికారులు క్రిష్ణారెడ్డి, నిర్మాణ సంస్థ ప్రతినిధులు రమేశ్ త్రిపాఠి, కమలేశ్ పాల్గొన్నారు.

### బీజేపీలోకి రావాలంటే... రాజీనామా చేయాల్సిందే

- ఈడీ కేసులున్న నేతలు బీజేపీలోకి రారు
- మీడియాతో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ఇతర పార్టీల తరపున గెలిచిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు బీజేపీలోకి రావాలంటే తప్పనిసరిగా ఆ పదవులకు రాజీనామా చేయాల్సిందేనని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఈడీ, సీబీఐ కేసులున్న నేతలను బీజేపీలోకి తీసుకునే అవకాశాల్లేవని చెప్పారు. కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ మీడియాతో ఇష్టాగోష్టిగా ముచ్చటించారు. ఈడీ, సీబీఐ సంస్థల విచారణకు, బీజేపీకి సంబంధమే లేదు. నరేంద్రమోదీ ప్రభుత్వం అవినీతి పరులను ఉపేక్షించే ప్రసక్తే లేదని, ఈడీ కేసులున్న వాళ్లు, ఈడీ, సీబీఐ విచారణ ఎదుర్కొంటున్న నేతలు బీజేపీ లోకి వచ్చే అవకాశాలు లేవని తెలిపారు. ఇతర పార్టీల నుండి గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో మాదిరిగా రాజీనామా చేయకుండా బీజేపీలోకి వచ్చే అవకాశమే లేదని, బీజేపీలోకి రావాలంటే రాజీనామా చేసి రావాల్సిందేనని అన్నారు. ఎంపీ కేశవరావుతో రాజీనామా చేయించిన కాంగ్రెస్ నేతలు... ఆ పార్టీలో చేరిన ఇతర పార్టీల ఎమ్మెల్యేలతో ఎందుకు రాజీనామా చేయించలేదని ప్రశ్నించారు. స్టేట్ ప్రెసిడెంట్ మార్పు, నూతన అధ్యక్షుడి ఎంపిక అంశం పార్టీ జాతీయ నాయకత్వం చూసుకుంటుందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు.

# ఊపా కేసుల ఎత్తివేతపై ప్రభుత్వం స్పందించాలి

దేశంలో ఒక వైపు స్వేచ్ఛ, సమానత్వాలతో కాకుండా విద్వేశ రాజకీయాలతో పాలన కొనసాగుతున్నాయి. మరొకవైపు ప్రజాస్వామ్యంలో 'ప్రతిపక్షం' ద్వారా పౌర ప్రజాస్వామిక పాలనను రక్షించుకోవాలని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధి స్పందిస్తూ మణిపూర్ నుండి న్యాయయాత్ర ప్రారంభించారు. ఆ యాత్రపై ఎంతటి నిర్బంధం అమలవుతుందో మనందరం చూస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ప్రజలందరిని అయోధ్య రాముడి మాయలో పడేసి మరొకసారి అధికారం చేజిక్కించుకోవాలనే ప్రయత్నం అని మనకర్థమవుతూ వుంది. రాష్ట్రంలోనైతే గత దశాబ్ద కాలంగా బిఆర్ఎస్, బిజెపిల నిర్బంధ కాలంలో పదుల సంఖ్యలో బుద్ధిజీవుల మీద ప్రజాస్వామిక వాదుల మీద, ప్రొఫెసర్ల మీద, న్యాయవాదుల మీద 'సారం'లో ప్రజల పక్షాన నిలబడి న్యాయం కోసం హక్కుల కోసం ప్రశ్నించేవారందరిపై పదుల సంఖ్యలో ఊపా కేసులు నమోదైన స్థితి తెలంగాణరాష్ట్రంలో ఉంది. అందులో భాగంగానే 2022 ఆగస్టులో నమోదైన తాడ్వాయి ఊపా కేసులో 152 మందిని నిందితులుగా పేర్కొన్న విషయం మీ అందరి దృష్టిలో ఉంది. అందులో ప్రొ. హరగోపాల్, ప్రొ. లక్ష్మణ్ గడ్డం, ప్రొ. పద్మజాషా, ప్రొ. గుంటి రవిలతో పాటు 152 మంది ఉన్నారు. ఈ కేసు పట్ల రెండు తెలుగు రాష్ట్రాల ప్రజానీకంతో పాటు అప్పుడు ప్రతిపక్ష పార్టీగా ఉన్న మీ కాంగ్రెస్ పార్టీ కూడా బలంగా స్పందించింది. చివరికి ఆ స్పందనకు భయపడి ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఐదుగురు మేధావులపై కేసు ఎత్తివేస్తున్నట్లుగా ప్రకటన చేసింది. బిఆర్ఎస్ ప్రభుత్వం పోయి ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారు. కానీ ఆ ఊపా కేసులపై ఇప్పటి వరకు మీ స్పందన ప్రకటించడం లేదు. చరిత్రలోకి వెళ్ళినట్లయితే 1985లో టాడా, 2002లో పోటాలతో ప్రజాస్వామ్యం ఎంత కుచించుకుపోయిందో ప్రజా ఉద్యమాలు ఎంత నిర్బంధానికి గురయ్యాయో ఎన్ని లక్షల మంది జైలుపాలయ్యారో మనందరం అర్థం చేసుకొని ఉద్యమిస్తేనే అవి రద్దుకాబడ్డాయి. అందులో భాగంగానే ఊపా చట్టాన్ని రద్దు చేయాలని అఖిల భారత స్థాయిలో ప్రజల నుండి డిమాండ్ వస్తుంది. తెలంగాణలో ఉన్న ప్రొ. హరగోపాల్, మాడభూషి శ్రీధర్, కోదండరామ్, జస్టిస్ సుదర్శన్ రెడ్డి లాంటి మేధావులు ఇప్పటికే ఊపా చట్టాన్ని రద్దు చేయాలని, ఊపా కేసులను ఎత్తివేయాలని బహిరంగంగా ప్రకటిస్తున్నారు. గత ప్రభుత్వం రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్టించింది కాని, ప్రజలకు అందుబాటులోకి రావల్సిన ప్రజాస్వామిక విలువలను నిలబెట్టడంలో పూర్తిగా విఫలం అయ్యింది. అందుమూలంగా ఆ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయింది.

దేశపరిస్థితిలోకి వెళితే ఈసారి మోడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే భవిష్యత్తులో ఎన్నికలు ఉండవని సత్యపాల్ మాలిక్, ఆనంద్ టెల్‌టుంబ్డే లాంటి వాళ్ళు మనకు చెబుతూనే ఉన్నారు. గతంలో ప్రొ. హరగోపాల్ రాహుల్ గాంధీని కలిసినప్పుడు భవిష్యత్తులో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మనందరం ఖచ్చితంగా జైల్లోనే కలుసుకుంటామని తనతో అన్నాడని హరగోపాల్ చాలాసార్లు ఉదహరిస్తూనే ఉన్నారు. కాబట్టి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలన్నా, రాజ్యాంగ విలువలను కాపాడాలన్నా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కలతో పాటు ఆదివాసి సమాజం నుండి వచ్చిన సీతక్క లాంటి మంత్రి, నాయకులుగా ప్రజల పక్షాలన నిలబడి ప్రజాస్వామిక పరిపాలన సాధించాలని, నమోదైన ఊపా కేసులన్నింటిని ఎత్తివేయాలని, పౌరహక్కుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

**ఎన్. నారాయణ రావు**
**పౌరహక్కుల సంఘం**

## పువ్వుగా నేనెందుకు పుట్టాలి..?

ఓ ప్రియా..!
ఓ నా ప్రియా..!
నీవే నా ప్రాణం...
నీవే నా రాణివి...
నీవే నా దేవతవి...
నీకు తోడునీడైఉంట...
నా మాట నమ్మమంట...
నీతోనే నా జీవితమంట..
చివరకంట చితివరకంట...
నేనొక తుమ్మెదంట...నీవు...
నాకోసం పుట్టిన పువ్వువంట..
చలాకీగున్నావ్......చామంతిలా
మత్తెక్కిస్తున్నావ్....మల్లెపువ్వులా
భలేగున్నావ్..........బంతిపువ్వులా
గుభాళిస్తున్నావ్.....గులాబీ పువ్వులా
ముద్దొస్తున్నావ్.......ముద్ద మందారంలా
అంటూ నీ "పువ్వుపురాణం" వింటూ
గాలిపటాన్నై...గాలిలో తేలిపోయా...
విహంగాన్నై....వినువీధుల్లో విహరించా...
ఉయ్యాలలూగా....ఊహల్లో ఊరేగా.....
మనకు పెళ్ళి జరిగిపోయినట్టు...
మనం హనీమూన్ ట్రిప్ లో ఉన్నట్టు
స్వర్గసీమలో మునిగి తేలుతున్నట్టు...
తియ్యని కమ్మని కలలెన్నో కన్నా...
కదిలే కాలమా కాసేపు ఆగవమ్మా
జరిగే వేడుక కళ్ళారా చూడమ్మా
ఎన్నో నోములే గతమందు నోచిఉంటా
నీకే భార్యనై ప్రతి జన్మనందు ఉంటా
నడిచే దైవమా...నీ పాదధూళులే...
పసుపు కుంకుమలు నాకు...అంటూ
కమ్మని ప్రేమపాటలెన్నో పాడుకున్నా...
కానీ ఆ తుంటరి తుమ్మెద
మరో పువ్వు మీద వాలగానే...
ఒక్కసారి ఉలిక్కిపడ్డా...నిన్న
పక్కమీద పక్కుమని నవ్విన నాకు
కడుపు రగిలే కన్నీటి నిజం తెలిసింది
ఒక పువ్వు...
గుడిని చేరుతుందని...
ఒక పువ్వు...
జవరాలి జడను చేరుతుందని...
ఒక పువ్వు ...
ఒక రోజు జన్మించి...
ఒక రోజు వికసించి...
ఒక రోజు పరిమళించి...
ఒక రోజు కాముని విష
కౌగిలిలో నలిగిపోయి వాడిపోయి
వీధిలోకి విసిరి వేయబడుతుందని...
అందుకే ఓ పరమాత్మా..!
వద్దు వద్దు..! నాకీ ఈ పువ్వు జన్మ..!!

**పోలయ్య కూకట్లపల్లి**
**అత్తాపూర్ హైదరాబాద్**

# మై 'హూనా'! అంటున్న రాహుల్

మై హూనా! నేనున్నాను అంటూ ఆపన్నులకు నమ్మకం కల్పిస్తున్నాడు ఆయన!ప్రజల్లో నిరంతరం కలిసి మెలసి ఉండే , ప్రజల కోసం ఏమి చేయడానికి అయినా సిద్ధం అయిపోయే నాయకుల్లో ఆత్మవిశ్వాసం ఎక్కువ ఉంటుంది. పార్లమెంట్ లో ప్రతిపక్ష నేతగా ఈ సారి ఎంటర్ అయిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రస్తుతం దేశంలో పీపుల్ నాయకుడు గా, ప్రతి ఒక్కరి కి దుఃఖం లో కంట నీరు తుడిచి నేను ఉన్నాననే విశ్వాసం కల్పిస్తూ ముందుకు పోతున్నారు. నిజానికి రాహుల్ గాంధీ రాజకీయాల్లో కి వచ్చిన నాటి నుంచి ఎన్నో విమర్శలు, ఒడిదుడుకులు, కష్టాలు, అవమానాలు ఎదురుకున్నారు. భారత్ జోడో, భారత్ జోడో న్యాయ్ యాత్ర లో తో రాహుల్ దేశంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలను, వారి కష్టాలను చాలా దగ్గరగా చూసారు. విద్యార్థులు, యువత, కార్మికులు, రైతులు, రైతు కూలీలు, ఉపాధి హామీ కూలీలు, పౌరహక్కుల నేతలు, డ్రైవర్ లు, క్లీనర్ లు, బస్సులో, ట్రైన్ లలో ప్రయాణించే సామాన్యుల తో ప్రయాణించి మాట్లాడి, నాట్లు వేసి, వారితో కూర్చుని భోజనం చేసి, ఇంటికి భోజనానికి పిలిచి వారి తో మాట్లాడారు.



**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223





మణిపూర్ ఆహకారాలను అక్కడికి వెళ్లి తెలుసు కున్నారు. కన్యాకుమారి నుంచి జమ్మూ, కాశ్మీర్ , మణిపూర్ నుంచి ముంబై దాకా ఆయన సుమారు పది వేల కిలోమీటర్ ల రాహుల్ యాత్ర ఆయనను డౌన్ టూ ఎర్త్ నాయకుడిని చేసింది. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ హత్రాస్ లో దొంగ భోలే బాబా కార్యక్రమం లో పాల్గొని మృత్యువు వాత పడిన వందలాది కుటుంబాలను, గాయపడిన వారి కుటుంబాలను వెళ్లి కలిశారు. అక్కున చేర్చుకుని ఓదార్చారు. వారందరికీ పరిహారం మెరుగుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల మధ్యలోకి కష్ట సందర్భంగా రాహుల్, ఆయన సోదరి ప్రియాంకా గాంధీ వెళ్లడం గత పది ఏండ్లలో దేశం చాలా సార్లు చూసింది. గత 2020 లో హత్రాస్ లో ఒక దళిత యువతి ని చెరచి చంపినప్పుడు, ఆమె శవాన్ని కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా ప్రభుత్వం కాల్చేసినపుడు కూడ రాహుల్, ప్రియాంకలు హత్రాస్ వెళ్లారు. పోలీస్ లు రాహుల్ ను నెట్టి వేస్తే కింద కూడ పడ్డాడు. నిర్బంధాన్ని ఎదురుకున్నారు.

### ఆయన సీరియస్ నేత కాదు!

నిజానికి రాహుల్ చాలా సీరియస్ నేత, అందుకే నేల మీద ఉండి యోచిస్తున్నాడు. రాహుల్ ను రాజకీయాల్లో నాన్ సీరియస్ నేతగా ప్రచారం చేశారు. ఆయన ను జాతీయ గోది మీడియా కూడ అలాగే ప్రొజెక్ట్ చేసింది, అయినా రాహుల్ బాధపడలేదు, ఆయన పనికి, ఆయన యాత్రలకు ఎన్నో అడ్డంకులు కల్పించినా ఆగలేదు. ప్రతిపక్ష నేతగా ఇటీవల భవన నిర్మాణ కార్మికులను కలిసి వారితో కలిసి పార వేసి కష్టాలు తెలుసుకున్నారు. రైల్వే లో లోకో పైలెట్ లతో కలిసి వారి కష్టాలు తెలుసుకున్నారు. 18,000 లోకో పైలెట్ ల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. స్టాఫ్ లేక ఒక్కొక్కరు డబుల్ డ్యూటీలు చేయాల్సిన పరిస్థితి, అలసిపోతున్న పరిస్థితి ని తెలుసుకుని చర్చించారు. ఇలా రాహుల్ పార్లమెంట్ ఎన్నికలకు ముందు, తర్వాత ప్రతిపక్ష నేత హోదాలో ను ప్రజల మధ్య నేత గానే కనిపిస్తున్నారు. గుజరాత్ లో కాంగ్రెస్ కార్యాలయం మీద కార్యకర్తల మీద దాడిని అక్కడికి వెళ్లి, భారీ సభలో మాట్లాడుతూ ఖండించారు.

### గుజరాత్‌లో రాహుల్ ఛాలెంజ్!

భయపడకు అంటూ కార్యకర్తల కు నేను ఉన్నానని భరోసా ఇచ్చారు. గుజరాత్ లో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిస్తామని అన్నారు. పార్లమెంట్ లోనూ విషయం ప్రస్తావన కు తెచ్చి బీజేపీ ఈసారి గుజరాత్ లో ఓడనున్నది అని, ఇండియా కూటమి ఓడిస్తుంది అని, ఓడించి తీరుతామని అన్నారు. రాహుల్ గాంధీ కండ్లలో నమ్మకం, తనపై తనకు విశ్వాసం తొణికిసలాడుతున్నది. అదే మరి, ప్రజల మధ్యలో ఉండే వారికి లభించే సపోర్ట్ అలా ఉంటుంది. ఎక్కడికి బడితే అక్కడికి నేనున్నానని ప్రజల్లో నిత్యం కనిపించే నేతలు వెళ్లి పోతుంటారు. తప్పు చేయని వాడికి జనంలోకి వెళ్ళడానికి భయం దేనికి? ఉన్నత పదవుల్లో ఉన్న భయస్తులే మణిపూర్ కు, హత్రాస్ కు వెళ్లకుండా ట్విట్టర్ లకు పరిమితం అవుతుంటారు. ( ఎవరికి వర్తిస్తే వారికే)దేశ్ కా నేత రాహుల్ అంటున్నారు, ఆపన్నులు, కాంగ్రెస్ లో మిగిలిన నేతలు కూడ మారాలి! పార్టీ లో మార్పు రావాలి! నేత అనే వాడు జనం2020 లోనే ఉండాలి, జనంలో ఉన్నవాడికే పదవులు, పార్టీ టిక్కెట్లు ఇవ్వాలి!

# 'గాడ్ ఫాదర్'లోని వెలుగునీడలు

"గాడ్ ఫాదర్",ఇంగ్లీష్ నవలా సాహిత్యం లో ఎంత పెను సంచలనం సృష్టించిందో ,అంతకు మించి హాలివుడ్ సినిమాగా బాక్స్ ఆఫీస్ రికార్డుల్ని తిరగరాసింది.అంతే కాదు ,ఆ సినిమా ఇచ్చిన ప్రేరణతో వివిధ భాషల్లో ఎన్ని సినిమాలు తీశారో ఇంకా తీస్తున్నారో లెక్కలేదు.పాపులర్ నవల గా మొదలయి అమెరికన్ సాహిత్య చరిత్ర లో ఒక ప్రత్యేకతరగతికి చెందిన క్లాసిక్ గా ముద్రవేసుకుంది. ఎవరినైన ఆ నవల గురించి చెప్పమంటే అది ఒక మాఫియా ఇతివృత్తమని,న్యూయార్క్ లో అయిదు శక్తివంతమైన కుటుంబాల మధ్య జరిగిన పోరాటమని చెబుతారు.అది నిజమే. అయితే దానికి మించిన నేపథ్యం గాడ్ ఫాదర్ నవల యొక్క సొంతం.కనుకనే ఒక ప్రత్యేకతని సంతరించుకుంది.




బాగా తరచి చూస్తే ఈ 448 పేజీల నవల 1945-55 సంవత్సరాల మధ్య జరిగిన కొన్ని చారిత్రక మలుపుల్ని ఒడుపుగా చిత్రించింది. అప్పటి మానవజీవితాన్ని మన ముందు ఉంచుతుంది. సిసిలీ నుంచి వలస వచ్చిన శరణార్థుల వెతల్ని, పెనుగులాటని కళ్ళకి కడుతుంది. మనిషి లోని సకల స్వభావాల్ని అత్యంత సహజ ధోరణి లో చిత్రించింది. నమ్మకద్రోహం,కుట్రలు,వ్యాపార విస్తరణ లో కుత్తుకలు కత్తిరించే పోటీ,మొనోపలిని సాధించే క్రమం లో ఎత్తుగడలు ఇలాంటివి అన్నీ ఒకవైపు...స్నేహం విలువ, కుటుంబం విలువ, నమ్మిన వారిని ఆదుకునే తత్వం ఇలాంటివి అన్నీ మరో వైపు దీనిలో మనకి కనిపిస్తాయి. ఎంత సహజంగా అంటే మన చుట్టూరానే అవన్నీ జరుగుతున్నాయా అన్నట్లు చదువరి నిమగ్నమవుతాడు.

ఇంతకీ ఈ నవల రాసిన వారు ఎవరు..? ఆయన పేరు మేరియో ప్యూజో. ఈయన కుటుంబం కూడా ఇటలీ లో భాగమైన సిసిలీ నుంచి అమెరికా కి వలస వచ్చి హెల్స్ కిచెన్ అనే ప్రాంతం లో తలదాచుకున్నదే.ఆ ఏరియా అంతా చిన్న సైజు ఇటలీ లాగే ఉంటుంది.వలస వచ్చిన పేద శరణార్థులతో..! మేరియో ప్యూజో ఈ గాడ్ ఫాదర్ రాయడానికి ముందు రెండు చక్కని నవలలు రాశాడు.అవి ది ఫార్చునేట్ ఫిలిగ్రిమ్, ది డార్క్ అరెనా. మొదటి నవల లో రైలు రోడ్ నిర్మాణం లో, వలస వచ్చి పనిచేసే కూలీల జీవితాల్ని చిత్రించాడు.ఇది పరోక్షం గా తన తండ్రి జీవితాన్ని,తమ కుటుంబాన్ని ప్రతిబింబించే రచన. దీనికి మంచి పేరైతే వచ్చిందిగాని ఆర్థికంగా ఆదుకోలేకపోయింది. అలాగే రెండవ నవలకు కూడా జరిగింది. పాశ్చాత్య దేశాల్లో సంగతి తెలిసిందే గదా...ఒక్క నవల గనక సరిగ్గా జనాల్లోకి వెళ్ళి హిట్ అయితే రచయిత హాయిగా రాయల్టీ తో బతికేయవచ్చు.

తన తల్లి చెప్పిన కొన్ని సంఘటనలు,కొన్ని విన్న సంఘటనలు, ఫ్రాంక్ క్యాస్టెల్లో, కార్లో గాంబినో అనే గ్యాంగ్ స్టర్ లతో మాటాడిన అనుభవాలు అన్నీ కలిపి సిసిలీ నేపథ్యం తో ఒక చిన్న కథ రాసి ఒక పబ్లిషర్ మిత్రునికి చూపించగా,దీన్ని ఇంకా విస్తరించి రాస్తే బాగుంటుందని ఆయన సలహా ఇచ్చాడు.దాని ఫలితం గానే గాడ్ ఫాదర్ అనే గొప్ప జనాదరణ పొందిన నవల ఆవిర్భవించింది. 1969 లో మొదటిసారిగా ప్రచురితమైన ఈ నవల,రెండేళ్ళలో 90 లక్షల కాపీలు అమ్ముడైంది. ఇప్పటిదాకా చూసుకుంటే 3 కోట్ల కాపీలు అమ్ముడై ఒక రికార్డ్ సృష్టించింది. ఫిక్షన్ విషయం లో టాప్ టెన్ లో ఒక పుస్తకంగా నిలిచింది.

సరే...మరి ఈ నవల లోని విషయాన్ని క్లుప్తంగా చెప్పుకుందాము. నవల ప్రారంభం కావడమే ఓ కోర్ట్ సీన్ తో ప్రారంభమవుతుంది. బొనాసెరా అనే వ్యాపారస్తుని కుమార్తె ని కొంతమంది పలుకుబడి గల కుటుంబాలకి చెందిన కుర్రాళ్ళు కొట్టి గాయపరుస్తారు. కోర్ట్ కూడా శిక్ష విధించదు. ఈయన, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాదు. అప్పుడు గుర్తుకు వస్తుంది తన ఒకనాటి మిత్రుడు విటో కార్లోన్ పేరు. తను మాత్రమే ఇలాంటి వాటికి న్యాయం చేయగలడు అని భావిస్తాడు. ఇదే విధంగా ఓ పెద్ద నిర్మాతతో గొడవ పెట్టుకుని దెబ్బతిన్న జానీ ఫాంటేన్ అనే సినిమా నటుడు, అలాగే తన కాబోయే అల్లుడు కి పౌరసత్వం ఇప్పించాలని నాజోరిన్ వివిధ సమస్యలతో విటో కార్లోన్ అనబడే గాడ్ ఫాదర్ ని కలవడానికి న్యూయార్క్ లోని ఆయన ఇంటికి వస్తారు. ఆ సమయంలో గాడ్ ఫాదర్ కుమార్తె కొన్నీ పెళ్ళి జరుగుతూంటుంది. సరిగ్గా ఈ పెళ్ళి జరిగే సీన్ తోనే ఆ సినిమా దర్శకుడు ఫాన్సిస్ కొప్పోలా సినిమా వెర్షన్ ని మొదలుపెడతాడు.

ఈ వ్యక్తి ఎవరో చాలా శక్తిశాలి అని మనకి అనిపిస్తుంది. ఇంకా చదవాలని ఆతృత కలుగుతుంది. ఒక చిత్రకారుడు ఎంతో జాగ్రత్తగా తనకి బహు ఇష్టమైన చిత్రాన్ని చిత్రించినట్లుగా ప్రతి పేజీ సాగుతుంది. అతని గతం ఏమిటి..? ఎందుకని సిసిలీ నుంచి తన చిన్నతనం లో పారిపోయి ఈ అమెరికా దేశానికి వచ్చాడు..? ఎందుకని రైలు రోడ్ నిర్మాణం లో కూలీ గా పని చేశాడు..? ఎందుకని ఓడ లో తనకి కలిసిన అబ్బాండాండో కుటుంబానికి చెందిన కిరాణా దుఖాణంలో పనిచేశాడు? అనుకోకుండా ఫానుస్సీ అనే రౌడీ ఇతడిని బెదిరించడం ఏమిటి..? అతడిని చంపడం తో విటో కార్లోన్‌కి ఎలా సమాజం లో గౌరవం తో కూడిన భయం పెరిగింది..? ఆ అవకాశాన్ని చిల్లర గొడవలకి కాకుండా ,దూరదృష్టి తో తనదైన వ్యాపార సామ్రాజ్యాన్ని తన మిత్రులతో,బంధువులతో ఎలా విస్తరించాడు..? ఇలా అనేక సంగతులు మనల్ని ముప్పిరిగొని ఊపిరిసలపకుండా చదివేట్టు చేస్తాయి.

ఇక వ్యాపారాల్లో అతని ప్రత్యర్థులు టాటాగ్లియా ఇంకా భార్గిని కుటుంబాల వారు. మిగతావాళ్ళు ఉన్నా, వీళ్ళే ప్రధానంగా గాడ్ ఫాదర్ కుటుంబాన్ని నష్టపరచాలని చూస్తుంటారు. డ్రగ్స్ వ్యాపారం లో తనకి సహకరించడానికి ఒప్పుకోని గాడ్ ఫాదర్‌ని సొలొజ్జో హత్య చేయడానికి ప్రయత్నిస్తాడు. కొన్ని రోజులు మంచం మీద పడుకోవలసిన స్థితి ఏర్పడుతుంది. మరి అలాంటి సందర్భం లో ఆయన కొడుకులు సొన్నీ, ఫ్రెడో, మిచెల్‌లు ఏ విధం గా ప్రతిస్పందించారు. మిచెల్ ఎందుకు ప్రవాసం వెళ్ళిపోవాల్సి వస్తుంది? మంచం మీది నుంచి లేచిన తరువాత ఏ విధంగా సంప్రదింపులు జరిపి విటో కార్లోన్ శాంతిని నెలకొల్పుతాడు? మళ్ళీ ఏ విధంగా మిచెల్ తిరిగివచ్చి తండ్రికి తగిన కుమారునిగా నిరూపించుకుని మిగతా కుటుంబాల పై ఆధిపత్యం సంపాదించుతాడు, లాస్ వెగాస్ వైపు తమ వ్యాపారాన్ని ఎందుకు మళ్ళించుతాడు. ఇవన్నీ కలిపితే ఈ గాడ్ ఫాదర్ కథగా చెప్పవచ్చు. ఇంకా అనేక పాత్రలుంటాయి. ఏదీ అప్రధానం అనిపించదు.

ఈ నవల లోని అనేక డైలాగ్స్ పలుకుబళ్ళు గా మిగిలిపోయాయి. ఎందుకని ఈ నవల ఇంతగా జనాల్లోకి వెళ్ళిందీ అనుకుంటే,డాన్ గా ఉన్న విటో కార్లోన్ లో ప్రతి ఒక్కరు తమకి తెలిసిన ఎవరో ఒకరిని చూస్తారు. అదీ ఆ పాత్ర ప్రత్యేకత. ఇష్టం వచ్చినట్లుగా నచ్చని ప్రతి ఒక్కరిని నరుక్కుంటూ వెళ్ళడు. ప్రతిమనిషిని సరైన మంచి మాటలతో ఒప్పించు. వారికి కావలసింది ఇవ్వు,నీకు కావలసింది తీసుకో. ఇది ఒక నీతి దీనినుంచి తీసుకోవలసింది. అడ్డంగా వెళ్ళి ఎవరికీ ప్రయోజనం కలగని రీతి లో ప్రవర్తించినప్పుడే డాన్ తన ఇతర శక్తుల్ని ఉపయోగిస్తాడు. మొనాపలీ ని ఏ బిజినెస్ లో అయినా సాధించినపుడే సిండికేట్ లో అందరికీ లాభాలు వస్తాయని,ఎవరు ఇష్టం వచ్చినట్లు వాళ్ళు చేస్తే బిజినెస్ కుక్కలు చింపిన విస్తరి అవుతుందని ఆ రోజుల్లోనే ఈ నవల్లో ఓ పాత్ర ద్వారా చెప్పిస్తాడు రచయిత.

దీన్ని సినిమా గా తీసినపుడు అకాడెమీ అవార్డ్ లు,గోల్డెన్ గ్లోబ్ అవార్డులు,ఓ గ్రామీ అవార్డ్ ఇలాంటివి రావడం మాత్రమే కాదు నిర్మాతలకి కనకవర్షం కురిసిందని చెప్పాలి. ఈ సినిమా కి దర్శకునిగా ఫ్రాన్సిస్ కొప్పొలా అనే ఇటలీ మూలాలు ఉన్న వ్యక్తిని ఎంచుకోవడం ఒక విశేషం. ఎందుకంటే నవల ఇతివృత్తం మొత్తం అమెరికా లోనే చాలా వరకు జరిగినా ప్రధాన పాత్రలన్నీ ఇటలీ లో ఓ ప్రాంతమైన సిసిలీ నుంచి వచ్చినవారై ఉంటారు. వాళ్ళ ఆచారాల్ని ,అలవాట్లని అంత తొందరగా వదులుకోవడానికి ఇష్టబడరు. ఉదాహరణకి పెళ్ళి విషయం లో గాడ్ ఫాదర్ సంప్రదాయవాది గా చెప్పాలి. గాయకుడు జానీ తన భార్య ని వదిలిపెట్టి,వేరే సినిమా నటి తో ఉన్నప్పుడు చీవాట్లు పెడతాడు. కూతురు పెళ్ళి జరిగిన రోజునే ఆసుపత్రి లో డెత్ బెడ్ మీద ఉన్న తన స్నేహితుడు అబ్బాండాండోని చూడటానికి వెళతాడు. వాళ్ళు తబ్బిబ్బు అవుతారు. ఎక్కడా సొంత పబ్లిసిటీ లేకుండా తన కార్యకలాపాలు క్రమపద్ధతి లో సాగిస్తుంటాడు. ఇలా ఎన్నో చెప్పుకోవచ్చు,ప్రతి పాత్ర గురించి..! Consigliere, Caporegime, Cosa Nostra, Omerta ఇలాంటి ఎన్నో ఇటాలియన్ పదాలు మేరియో ప్యూజో పుణ్యమాని ఇంగ్లీష్ చదువరులకు పరిచయం అయ్యాయి. మార్క్ సీల్ అనే రచయిత ఈ నవల గురించి ఇలా అన్నాడు The God Father wasn't just a film about gangsters and their families, but a metaphor for capitalism in America. It's a work of art that was a blockbuster."



**మూర్తి కెవివిఎస్**
**7893541003**

# సస్పెన్షన్లు సరే.. శిక్షలు పడతాయా!?




రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత ఏసీబీ దాడులు పెరిగిపోయాయి. ఆరు నెలల్లో 70 మందికి పైగా లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డారు. మరికొందరిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు నమోదు చేశారు. ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో దాడులు చేస్తున్నారు. సాక్ష్యాధారాల కోసం వీడియోలు రికార్డు చేస్తున్నారు. అరెస్టులతో సరిపెట్టకుండా వారి ఆస్తులు, బినామీల వివరాలు ఆరా తీస్తున్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బులు, బంగారం, భూములు, స్థిర చరాస్తులను లెక్కగడుతున్నారు. ఏసీబీ కేసు నమోదు కాగానే సంబంధిత శాఖలు వారిని సస్పెండ్ చేస్తున్నాయి. అయితే ఏసీబీ కేసుల చరిత్రను పరిశీలిస్తే... అవినీతి నిరోధక శాఖకు పట్టుబడిన వారిలో కొందరికి మాత్రమే శిక్షలు పడుతుండగా.. మరికొందరు ఎలాంటి చర్యలు లేకుండా మళ్లీ ఉద్యోగంలో చేరుతున్నట్లు తెలుస్తున్నది. మరికొందరిపై విచారణకు అసలు ప్రభుత్వం అనుమతి కూడా ఇవ్వడం లేదు. దీంతో లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డ వారిపై కచ్చితంగా చర్యలు తీసుకునేలా ప్రభుత్వం, ఏసీబీ వ్యవహరించాలనే డిమాండ్ వినిపిస్తున్నది.

సాధారణంగా ఏసీబీ అధికారులు రెండు రకాల కేసులు నమోదు చేస్తారు. ఇందులో మొదటిది.. లంచం అడుగుతున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. సంబంధిత ఉద్యోగులను లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం. దీన్ని ట్రాప్ కేసు అని పిలుస్తారు. రెండోది ఆదాయానికి మించిన ఆస్తుల కేసు. అవినీతి చేసి ఆస్తులు సంపాదించినట్టు కంప్లయింట్ వస్తే మొదట వివరాలు సేకరించి.. ఆ తర్వాత వారి ఇండ్లు, బంధువులు, బినామీల ఇండ్లపై ఒకేసారి దాడులు చేశారు. డబ్బు, పత్రాలు, బంగారం అన్నీ స్వాధీనం చేసుకుంటారు. ఆ తర్వాత వారి జీతం, ఇతర అధికారిక ఆదాయాలూ అన్నీ లెక్కవేసి, అంతకంటే ఎక్కువ ఉంటే అది ఎలా వచ్చిందో విచారణ జరుపుతారు. సరైన కారణాలు చెప్పకుంటే ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని కేసు పెడతారు.

రెండేండ్ల క్రితం వరకు ఏసీబీ ట్రాప్ కేసుల సంఖ్య క్రమంగా తగ్గుతున్నట్లు తెలుస్తున్నది. 2016లో ఏసీబీ 89 ట్రాప్ కేసులు నమోదు చేస్తే.. 2017లో 65 ట్రాప్ లు నమోదు చేసింది. 2018లో 152, ఇంకా 2019లో 168 ట్రాప్ కేసులు పెట్టింది. ఆ తర్వాత ట్రాప్ కేసుల సంఖ్య బాగా తగ్గింది. 2020లో 65, ఇంకా 2021లో 68 ట్రాప్ కేసులు మాత్రమే నమోదయ్యాయి. మరోవైపు పూర్తిస్థాయి వివరాలు అందించడానికి ఏసీబీ అధికారులు నిరాకరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

లంచం తీసుకుంటూ లేదా ఆదాయానికి మించి ఆస్తుల వ్యవహారంలో ఏసీబీకి పట్టుబడుతున్న వారిలో చాలా మందికి శిక్షలు పడడం లేదనే చర్చ జరుగుతున్నది. సగం మందిపైనే నేర నిరూపణ జరుగుతున్నట్లు గణాంకాల ద్వారా స్పష్టమవుతున్నది. అప్పటికప్పుడు శాఖాపరంగా సస్పెన్షన్ కు గురైనా.. ఆ తర్వాత ఏడాదికో, రెండేళ్లకో ఎలాగోలా విధుల్లో చేరుతున్నట్లు తెలుస్తున్నది. ఆంధ్రప్రదేశ్ లో ప్రతి వంద మందిలో 52 మందిపై కేసులు రుజువు అవుతుండగా.. తెలంగాణలో వందలో 63 మంది కేసులు రుజువు అవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే ట్రాప్ కేసుల్లో 65 శాతం శిక్షలు పడుతుంటే.. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో 12 శాతం కూడా శిక్షలు పడనట్లు తెలుస్తున్నది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి సుమారు రెండు వేలకు పైగా ఏసీబీ కేసులు పెండింగ్ లో ఇంకా పెండింగులోనే ఉండడం గమనార్హం. ఏసీబీ కేసుల్లో చిన్నస్థాయి ఉద్యోగులకే శిక్షలు పడుతున్నాయని, వారిపైనే చర్యలు తీసుకుంటున్నారనే అభిప్రాయాలున్నాయి. ప్రభుత్వ అధికారులపై ప్రాసిక్యూషన్ జరపాలంటే సర్కారు అనుమతి కావాలన్న నిబంధన కొందరికి వరంగా మారుతున్నదని, ఏసీబీకి పట్టుబడినవారు తమ పలుకుబడిని ఉపయోగించి, రాజకీయ నేతల ద్వారా ఒత్తిళ్లు చేయించి ఉన్నతాధికారులు ప్రాసిక్యూషన్కు అనుమతివ్వకుండా చూసుకుంటున్నారనే చర్చ సైతం ఉన్నది. దీనివల్ల కేసులు ఏండ్ల తరబడి పెండింగ్లో పడిపోతున్నాయి. కొన్ని కేసులైతే కోర్టు విచారణకు వెళ్లకుండానే మూసివేస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాల్లో ఒక్క రెవెన్యూ శాఖలోనే 50కి పైగా ఏసీబీ కేసులను మూసివేశారనే చర్చ ఉన్నది.

నిబంధనల ప్రకారం ఏసీబీ నివేదికపై ట్రాప్ కేసులో పట్టుబడ్డ వారిపై మూడు నెలల్లో, ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఆరు నెలల్లో ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ చాలా సందర్భాల్లో నెలల తరబడి విచారణ సాగుతుండడంతో చాలా మంది తప్పించుకుంటున్నారనే చర్చ ఉన్నది. ఏడాదికి పైగా విచారణ కొనసాగితే కేసు వీగిపోయే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. సాక్ష్యాలు తారుమారు కావడం, సాక్ష్యులు ఎటో వెళ్లిపోవడం, బాధితులు, నిందితుల మధ్య ఒప్పందాలు కుదరడం, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి విచారణను ప్రభావితం చేయగలగడం.. ఇలా అనేక కారణాలతో కేసులు నీరుగారిపోతాయని పేర్కొంటున్నారు. మరోవైపు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడి ఏసీబీ కేసులున్నా.. అవి తేలకుండానే కొందరు మళ్లీ విధుల్లో చేరుతున్నట్లు తెలుస్తున్నది. కోర్టుల్లో కేసులు నడుస్తున్నా.. సర్వీసు నిబంధనల వంకతో ఏసీబీ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరిపోతుండడం విమర్శలకు తావిస్తున్నది.

ఏసీబీ దాడులను పరిశీలిస్తే.. కొన్ని శాఖల్లో అవినీతి పేరుకుపోయినట్లు స్పష్టంగా తెలుస్తున్నది. అవినీతి కేసుల్లో ఎక్కువగా రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది పట్టుబడుతుండగా మున్సిపల్ శాఖ రెండో స్థానంలో ఉంది. పోలీస్, పంచాయతీరాజ్ ఉద్యోగులూ ఏసీబీకి చిక్కుతున్నారు. అంతేకాకుండా దేవాదాయ, కమర్షియల్ ట్యాక్స్, వ్యవసాయ శాఖ అధికారులు కూడా అధిక సంఖ్యలోనే ఏసీబీకి పట్టుబడుతున్నారు. 2017లో ఏసీబీ 65 కేసులు పెట్టగా అందులో 17 రెవెన్యూ శాఖకు చెందినవే. 2018లో 147 ఏసీబీ కేసులు నమోదైతే 34 కేసుల్లో పట్టుబడ్డవారు రెవెన్యూ ఉద్యోగులే కావడం గమనార్హం. ప్రతి ఏటా రెవెన్యూ ఉద్యోగుల సంఖ్యనే ఎక్కువగా ఉంటుండడం విశేషం. 2019లో 173 కేసులు నమోదైతే ఇందులో 54 మంది రెవెన్యూ శాఖకు చెందిన వారు ఉండగా, 25 మంది మున్సిపల్, 18 మంది పోలీస్ డిపార్ట్ మెంట్ కు చెందిన ఉద్యోగులు ఉన్నారు.

తెలంగాణ అవినీతి నిరోధక శాఖ హెల్ప్ లైన్ నంబర్ 1064 సేవలు ప్రస్తుతం 24 గంటలు అందుబాటులో ఉంటున్నాయి. లంచం కోసం అధికారులు వేధిస్తే.. ఈ నంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు ఏటేటా తమ ఆస్తిపాస్తులను రిటర్న్ రూపంలో చూపించాల్సి ఉండగా.. అది జరగడం లేదు. దీన్ని కచ్చితంగా పాటించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అవినీతికి పాల్పడే అధికారులను శాశ్వతంగా ఉద్యోగం నుండి తీసివేసే చట్టం తీసుకురావాలనే డిమాండ్ సైతం ఉన్నది.



**- ఫిరోజ్‌ఖాన్**
సీనియర్ జర్నలిస్ట్
9640466464

# గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా..!

## ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, జూలై 07 (జనంసాక్షి) :**
శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధి నల్లగండ్ల హుడాకాలనీ వాసులు పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులను గూర్చి వివరిస్తూ ఆదివారం ఎమ్మెల్యే ఆరెకపూడిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని, ఇందులో భాగంగా గచ్చిబౌలి డివిజన్ ను మోడల్ డివిజన్ గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నల్లగండ్ల హుడా కాలనీ వాసులు మాట్లాడుతూ హుడా కాలనీ నల్లగండ్ల ప్రాంతంలో గత కొంతకాలంగా అనేక సమస్యలు పెండింగ్లో ఉన్నాయని, హాలో అభివృద్ధి పనులను సైతం చేపట్టాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని కలిసి తమ కాలనీలో మౌలిక వసతులు కలిపించడానికి అడిగిన వెంటనే అంగీకరించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నామని తెలిపారు. కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన సిసి రోడ్డు ను వేయాలని, అవసరమున్న చోట డ్రైనేజి వ్యవస్థను మెరుగుపర్చాలని, మంచినీటి వ్యవస్థను మెరుగుపర్చాలని, 100 ఫీట్ రోడ్డు లోసెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలనిసైతం ఎమ్మెల్యే గాంధీని వినతి పత్రం ద్వారా కోరడం జరిగిం దన్నారు. త్వరలోనే హుడా కాలనీ నల్లగండ్లలో పర్యటిస్తానని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని, అన్ని రకాల మౌలిక వసతులు కలిపించామని, అసంపూర్తిగా మిగిలిన ఇతర పనులు, మంచినీటి సరఫరాలో అంతరాయం లేకుండా మెరుగైన సరఫరా ఉండేలా జలమండలి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారికి సూచించడం జరిగిందన్నారు. ఏచిన్న సమస్య తలెత్తినా తనదృష్టికి తీసుకువస్తే తప్పకుండా దానిని పరిష్కరిస్తానన, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే భరోసాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ, కాలనీ వాసులు శ్రీకాంత్, కిషోర్, రాజేశ్వర్ రావు, శ్రీరామ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో నేషనల్ మార్ట్ 8వ స్టోర్ ప్రారంభం

**ఖైరతాబాద్, జూలై 07 (జనం సాక్షి) :**
వినియోగ దారులకు మెరుగైన సేవలు అందించడానికి ఇండి యా కా హైపర్ మార్ట్ వారి 'నేషనల్ మార్ట్' కొత్త 8వ స్టోర్‌ను మేడ్చల్‌లో ఆదివారం ప్రారంభించి నట్లు నేషనల్ మార్ట్ వ్యవస్థాపకుడు యశ్ అగర్వాల్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ నాణ్యత, సరసమై న ధరలతో కూడిన నేషనల్ మార్ట్ ను నగర వాసు లు వినియోగించు కోవాలన్నారు. పురుషులు, మ హిళలు, పిల్లల కోసం సరసమైన ధరలో విస్తృత శ్రేణి దుస్తులను నిత్యావసర సరుకులు, గృహోవ సరాలతో పాటు వివిధ రకాల ఉత్పత్తులను ఒకే చోట అందించడమే కాకుండా డిస్కౌంట్లు ఇస్తామ న్న నిబద్ధతతో ప్రతి ఒక్కరికీ ఖర్చును తగ్గించేదిగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు.





## ప్రేమ జంట పరార్

**ప్రేమ మైకంలో యువజంట..తల్లిదండ్రులకు మనోవేదన**

**అబ్బాయి తల్లిదండ్రులు కరన్ కోట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు**

**తాండూరు జులై 7(జనంసాక్షి)**
నవ మాసాలు మోసి కనిపెంచిన కన్న తల్లిదండ్రులకు ఓ ప్రేమ జంట కడుపుకోత మిగిలింది. ఓ జంట ప్రేమించి పారిపోయిన ఘటనతో ఇరువర్గాల కుటుంబాల మధ్య తగాదాలు తారాస్థాయికి చేరి పోలీస్ స్టేషనుల వరకు వెళ్లిన ఘటన తాండూర్ మండలం బెల్కటూర్ గ్రామంలో చోటుచేసుకుంది. బెల్కటూర్ గ్రామానికి చెందిన నగేష్ గత కొన్ని రోజుల నుంచి హైదరాబాదులోని ఓ పెట్రోల్ పంపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన అమ్మాయి కుటుంబ సభ్యులు హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. హాస్టల్లో ఉంటూ చదువుతున్న అమ్మాయి అదే గ్రామానికి చెందిన నగేష్‌తో ప్రేమించి గత వారం రోజుల క్రితం ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి ఇద్దరు పారిపోయారు.అయితే ప్రేమికుల ఆచూకీ తెలపాలంటూ అమ్మాయి తల్లిదండ్రులు అబ్బాయి తల్లిదండ్రులకు వేధింపులకు పాల్పడుతూ దాడులకు పాల్పడుతున్నారంటూ అబ్బాయి తల్లిదండ్రులు గౌతపూర్ కరన్ కోట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నగేష్ తల్లిదండ్రులు ఆవేదన చెందుతూ ఎక్కడున్నా రావాలని అమ్మాయి తల్లిదండ్రులు వేధిస్తున్నారని మీడియా ముందు వపోయారు.



## సొంతగూటికి చేరిన డీ.కే.రాములు

**కొడంగల్ జులై 08(జనం సాక్షి):**
అసెంబ్లీ ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్‌లో చెరిన డీ.కే.రాములు ఆదివారం రోజు హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ట్రస్టుభవన్‌లో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సిములు ఆధ్వర్యంలో తిరిగి తెలుగుదేశం పార్టీ కండువా కప్పి డీ.కే.రాములును చేర్చుకున్నారు. ఈ సందర్భంగా డీ.కే.రాములు టిడిపిలో చేరిన అనంతరం మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం కోసం అందరము కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి కొడంగల్ నాయకులు బొంపల్లి అచ్యుత రెడ్డి, సామల వెంకట ప్రసాద్, ఆవుల అమృతా రెడ్డి ,తలారి శేఖర్, కటిక మోహన్ జీ, అంజి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉంటా..!

## శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ వాలిదాసు జగదీశ్వర్ గౌడ్



**శేరిలింగంపల్లి, జూలై 07 (జనంసాక్షి) :**
తాను పుట్టి పెరిగిన నియోజకవర్గంగా, ఒక కాంగ్రెస్ ప్రతినిధిగా తనను ఆదరిస్తున్న శేరిలింగంపల్లి ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండడానికి కృషి చేస్తానని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ వాలి రాసి జగదీశ్వర్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ మేరకు గచ్చిబౌలి డివిజన్ నవోదయ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి స్థానిక పార్కులు మరియు మౌళికవసతుల అభివృద్ధిపై ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధిని సాధించాలంటే కాంగ్రెస్ పార్టీ విధివిధానాలు ఎంతో అవసరమని, ఆ పార్టీనుండి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి నియోజకవర్గం పరిధిలోని వివిధ సమస్యలను తీసుకువెళ్లి వాటిని పరిష్కరించడం ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నేడు ఒక ప్రజా నాయకుడిగా ప్రజా సంక్షేమంకోసం చేపట్టే పలు కార్యక్రమాలు రాబోయే తరాలకు మేలు చేకూర్చే విధంగా ఉండాలని వాలిదాసు ఆశాభావం వ్యక్తం చేశారు. తన దృష్టికివచ్చే ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రజలకు మంచి జరిగేలా చూస్తాననిధీమాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మానేపల్లి సాంబశివరావు, సురేష్, భారత్, జయద, వినయ్ కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపార వాటాను విస్తరించిన ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్

**ఖైరతాబాద్, జూలై 07 (జనం సాక్షి) :**
ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సెక్యూర్డ్ లోన్ పోర్ట్‌ఫో లియోను 31.5 శాతానికి విస్తరించిందని ఆ సంస్థ ప్రతినిధులు ఆదివారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.వారు మాట్లాడుతూ గత ఏడాది కంటే 440 బేసిస్ పాయింట్ల పెరుగు దల, మూడేళ్లలో 40 శాతం లక్ష్యంగా పెట్టుకుం దన్నారు. మొత్తం రుణ పోర్ట్‌ఫోలియో 19 శాతం పెరిగి 30,091 కోట్లకు చేరుకుందన్నారు. ఈ వృద్ధి ఉన్నప్పటికీ, దాని స్థూల ఎన్‌పీఏ నిష్పత్తి స్వల్పంగా 2.3 శాతంకి పెరిగిందన్నారు. డిపాజిట్లు 22 శాతం పెరిగి 32,500 కోట్లకు చేరుకున్నట్లు పేర్కొ న్నారు. ఉజ్జీవన్ ఎస్‌ఎంబి దాని స్థూల రుణాలలో సుమారు 27 శాతం ఒక సంవత్సరం క్రితం సెక్యూ ర్ చేయబడ్డాయని చెప్పారు. బ్యాంకు స్థూల నిరర్థ క ఆస్తుల నిష్పత్తి జూన్ చివరి నాటికి 2.3 శాతంగా ఉందని, దీనికి మూడు నెలల ముందు 2.1 శాతం, ఏడాది క్రితం 2.4 శాతం ఉందన్నారు. ఫిబ్ర వరి 2017లో మైక్రోఫైనాన్స్ రుణదాత నుండి బ్యాంక్‌గా మార్చబడిన ఉజ్జీవన్, వచ్చే మూడేళ్లలో సెక్యూర్డ్ పోర్ట్‌ఫోలియో వాటాను 40 శాతానికి పెంచాలని యోచిస్తోందన్నారు. దాని మొత్తం డిపాజి ట్లు అదే కాలంలో 22 శాతం వృద్ధి చెంది రూ. 32,500 కోట్లకు చేరాయని, మొత్తం డిపాజిట్లకు కరెంట్, సేవింగ్స్ ఖాతాల వాటా 100 బేసిస్ పా యింట్లు 25.6 శాతానికి మెరుగు పడిందని తెలి పారు.



## వర్గీకరణ జరిగేవరకు పోరాటం ఆగదు

**ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మైసగల్ల బుచ్చేంద్ర**



**హత్నూర జూలై 07 (జనం సాక్షి)**
ఎస్సీ వర్గీకరణ జరిగేవరకు పోరాటం ఆగదని జిల్లా అధ్యక్షుడు మైసగల్ల బుచ్చేంద్ర అన్నారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని మంగాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆత్మగౌరవ జెండావిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో గత 30 యేళ్ళుగా ఎస్సీ వర్గీకరణ పోరాటం కొనసాగుతుందన్నారు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ సుదీర్ఘకాలం పాటు సాగిన పోరాటానికి ప్రతిఫలంగా వర్గీకరణ అమలు ప్రక్రియ చివరి దశకు చేరుకుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు కొండని వెంకటేష్, సీనియర్ నాయకులు దేవులపల్లి నవీన్ కుమార్, డప్పు సత్యం, కొండని శ్రీకాంత్, రమేష్, యాదగిరి, శంకర్, శ్రీనివాస్, వినయ్, సందీప్ తదితరులున్నారు.

# కురుమలు అన్ని రంగాల్లో రాణించాలి



## జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్

**కంగ్టి జులై 7 (జనంసాక్షి)**
కురుమలు అన్ని రంగాల్లో రాణించాలని జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్ అన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు ఎంపీగా విజయం సాధించిన సురేష్ కుమార్ షెట్కర్ కురుమ సంఘం నాయకులు గొంగళితో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కురుమలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. కురుమల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కురుమ యువత అధ్యక్షులు లోండే నర్సింలు మాట్లాడుతూ కురుమలు రాజకీయంగా ఎదుగలంటే స్థానిక సంస్థల్లో పోటీ చేయడానికి అవకాశమిస్తూ జెడ్పిటిసి, ఎంపీపీ స్థానాలలో కురుమలకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లోండే నర్సింలు, కురుమ సంఘం ఉప అధ్యక్షులు మల్గొండ, ఖేడ్ మండల అధ్యక్షుడు జైపాల్, మనూర్ మండల అధ్యక్షుడు మల్లేష్, నాగిల్ గిద్ద మండల అధ్యక్షుడు శ్రావణ్, మాజీ సర్పంచ్, నగేష్, నర్సన్న, విఠల్, యువత అధ్యక్షులు అంజీ, తుకారాం, లక్ష్మణ్, సంతోష్, సంగ్రామ్, సిద్దప్ప, సుభాష్ ,సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## డబుల్ బెడ్రూం కాలనీలోని సమస్యలు పరిష్కరించండి

**అధికారులకు కాలనీవాసుల వినతి**

**వనపర్తి, జూలై 07 (జనంసాక్షి):**
వనపర్తి మున్సిపల్ పరిధిలో గల చిట్యాల రోడ్ డబుల్ బెడ్ రూముల కాలనీలో గల సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు సంబంధిత అధికారులను కోరారు. ఆదివారం 2 బీహెచ్ కే కాలనీలోని 6వ బ్లాకు వద్ద సమావేశాన్ని నిర్వహించారు.
ఈ సమావేశంలో గతంలో జరిగిన పనులపై సమీక్ష నిర్వహించారు. ఇప్పుడున్న సమస్యల గురించి చర్చించారు. కాలనీలో సిసి రోడ్లు వేయాలని, వీదిలైట్లు వేయాలని, అంగన్వాడి సెంటర్ ను ఏర్పాటు చేయాలని, రేషన్ షాప్ తాత్కాలికంగా ఏర్పాటు చేయాలని, బస్తీ దవఖాన పెట్టాలని, మున్సిపల్ కార్యాలయం నుండి చెత్త ట్రాక్టర్ ప్రతిరోజు రావాలని, ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని, వాటర్ ట్యాంక్ ఉన్న స్థలంలో ఉన్న గుంతను పూడ్చాలని, భగీరథ మంచినీటి సౌకర్యం కల్పించాలని సమావేశంలో తీర్మానం చేశారు. 648 ఇండ్లు ఉన్న కాలనీలో ప్రస్తుతం 200 కుటుంబాలకు మాత్రమే మిషన్ భగీరథ తాగునీటి సౌకర్యం ఉన్నదని, మిగతా వారు లోకల్ బోరు నీటిని తాగుతుండడంతో పలు రోగాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నీటిని వదలడానికి మున్సిపల్ సిబ్బంది లేకపోవడంతో ట్యాంకులు నిండి ,నీరు వృధాగా పోతున్నదని, అందువల్ల ఆ నీటితో గుంతలు ఏర్పడి దోమలు ప్రబలుతున్నాయని ,కుక్కలు పందులు పొర్లుతున్నాయని అన్నారు .వీధిలైట్లు లేనందున తాగుబోతులు వనపర్తి టౌన్ నుంచి మద్యం తెచ్చుకొని తాగి అల్లర్లు సృష్టిస్తున్నారని అన్నారు. కొన్ని అసంపూర్తి డబుల్ బెడ్ రూముల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, పోలీసు గస్తీ నిర్వహించాలని కోరారు. కాలనీ సమీపంలో ఓ పాడుబడిన బావి ఉందని, అందులో మురుగు నీరు నిల్వఅవుతున్నదని, దాని పక్క నుంచే మిషన్ భగీరథ పైపులు ఉన్నాయని, అవి పగిలితే మురుగు నీరు చేరి ప్రజలు అతిసార వ్యాధికి గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. కాబట్టి మున్సిపల్ అధికారులు స్పందించి బావిని పూడ్చాలని కోరారు ఈ సమావేశంలో కాలనీ వాసులు గన్నోజు రవికుమార్, మండ్ల రాజు, సాయిలీల, నిరంజన్, శరత్, వినోద్ కుమార్, శ్రీనివాసులు, ఖాజా, సిద్దయ్య శెట్టి ,చందూ సాగర్, రాజు సాగర్, డాక్టర్ ఖలీల్,కరెంటు ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**పలు వాహనాల డ్రైవర్లు అరెస్ట్**



**శేరిలింగంపల్లి జులై 07 (జనంసాక్షి) :**
సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆదివారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో భారీగా డ్రైవర్లు పట్టుబడడంపట్ల పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసు అధికారులు వెల్లడించిన వివరాలు ప్రకారం... ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించడం జరిగిందని, ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాల నడుపుతున్న డ్రైవర్లు భారీగా పట్టుబట్టడం జరిగిందని తెలిపారు. మొత్తం 168 మంది డ్రైవర్ మోతాదుకు మించి మద్యాన్ని సేవించి పట్టుబడగా ఇందులో 134 మంది ద్విచక్ర వాహనాల డ్రైవర్లు, 14 మంది ఆటో రిక్షా డ్రైవర్లు కాగా 19 మంది కార్లను నడుపుతున్న డ్రైవర్లు మరియు ఒకరు హెవీ వెహికల్ ను నడిపిస్తున్న డ్రైవరు ఉన్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఇందులో 26 మంది బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ తో పట్టుబడడం జరిగిందని, దీనిని కనిష్టంగా 200 ఎంజి/100 ఎమ్మెల్ నుండి గరిష్టంగా 500 ఎంజి/100 ఎమ్మెల్ గా పరిగణించడం జరుగుతుందన్నారు. పట్టుబడిన వారందరినీ హైకోర్టు లో ప్రవేశపెట్టి ఎవరైనా రోడ్డు ప్రమాదాలకు కారణమైనా..., హిట్ అండ్ రన్ చేసినట్లు తెలిసినా అరెస్టు చేసి జైలుకు పంపించడం జరుగుతుందని, గరిష్టంగా పదేళ్ల జైలుశిక్ష పడే అవకాశంకూడా ఉంటుందని పోలీస్ అధికారులు తెలిపారు.

# నేరాల అదుపులో పోలీసులకు ప్రజల సహకారం ఎంతో అవసరం



## ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**కుత్బుల్లాపూర్ జూలై 7 (జనం సాక్షి)**
నేరాలను అదుపు చేయడంలో పోలీసులకు స్థానిక ప్రజలసహకారం అవసరమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకనంద గౌడ్ అన్నారు. ఆదివారం చింతల్ డివిజన్ పరిధిలోని రంగానగర్ లో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు ఎంతో తోడ్పాటు అందిస్తుంది అన్నారు. కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు తమ వంతు కర్తవ్యాన్ని నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ విజయ శేఖర్ గౌడ్, ఎస్సై లు సతీష్ రెడ్డి, నాయుడు, డి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మహమ్మద్ రఫీ, మక్సూద్ అలీ, కర్నెకంటి మల్లేష్, డేగా కృష్ణమూర్తి, శ్రీశైలం, బండారు వరప్రసాద్, జున్ను లక్ష్మణరావు, కాటా సతీష్, రాంప్రసాద్, సత్యనారాయణ, సురేందర్, రామకృష్ణ, ఎల్లప్ప, ఆనంద్, సరోజ, మహేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధికి సంక్షేమ సంఘాలు తోడ్పాటు అందించాలి

**కుత్బుల్లాపూర్ జూలై 7 ( జనం సాక్షి)**
కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు కీలక పాత్ర పోషించాలని కుత్బుల్లాపూర్ బిజెపి నాయకులు చెరుకుపల్లి భరత సింహారెడ్డి అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వెంకన్న హిల్స్ ఫేస్ టు లో జరిగిన సంక్షేమ సంఘం ఎన్నికలలో అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన జయరాం చారి, శ్రావణ్‌లు భరత్ సింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ నికి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ సంఘాలు కాలనీలో అభివృద్ధిలో తమ వంతు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. మౌలిక సమస్యలను స్థానిక కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్ నాయుడు, రాజేందర్, పరంకుశం నాయుడు, సుభాష్, తిరుపతి రెడ్డి, దుర్గారావు, సత్యనారాయణ, రవీందర్ రెడ్డి, మేఘన, కీర్తి చంద్ర, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ప్రహ్లాద్, రమేష్, పిచ్చయ్య, యాదగిరి, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పాలిట శాపంగా మారిన ఎపిటోరియా కంపెనీ

- **యధేచ్ఛగా పంట పొలాల్లోకి రసాయన వ్యర్థాలు**
- **సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**



**హత్నూర జూలై 07 (జనంసాక్షి)**
పంట పొలాల్లోకి విచ్చలవిడిగా కాలుష్యాన్ని వెదజల్లుతూ రైతుల పాలిట శాపంగా మారిన ఎపిటోరియా కంపెనీపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. మండలంలోని బోర్పట్ల గ్రామ శివారులో గల ఎపిటోరియా కంపెనీకి సమీపంలో ఉన్న పంట పొలాలను ఆదివారం ఆయన సందర్శించారు.కంపనీ వదులుతున్న వ్యర్థాలతో బోర్పట్ల గ్రామ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. పంట పొలాల్లోకి రసాయన జలాలు వదులుతుండటంతో పంటలు దెబ్బతిని ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికే భూగర్భ జలాలు విషతుల్యమై బోరు బావుల్లో నుండి కాలుష్య నీరు వెలువడుతుందని ఆయన పేర్కొన్నారు. వారి వెంట రైతు సంఘం జిల్లా నాయకులు నర్సింహా రెడ్డి, రామాంజనేయులు తదితరులున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
08 జూలై 2024

# పేదలకు మెరుగైన వైద్యం..!

## రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ



**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**
పేదలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ అన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 1003 పడకల జనరల్ ఆసుపత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. మెడికల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థ ఇంజనీరింగ్ అధికారి నిర్మాణ వివరాలు మ్యాప్ ద్వారా మంత్రికి వివరించారు. నిర్మాణ వివరాలు తెలుసుకుని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సంవత్సరం చివరిలోగా ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. కొత్తగా నిర్మాణం చేస్తున్న జనరల్ ఆసుపత్రి 1003 బెడ్‌లు, ఎంసిహెచ్‌లో 220 బెడ్‌లు కలిపి 1225 బెడ్ లకు గాను అధనగా డాక్టర్ లు, సిబ్బంది, టెక్నీషియన్‌లు, ఫార్మసిస్ట్ లు ఇతర సిబ్బంది అదనంగా 600 పై చిలుకు అవసరం వుంటుందని, ప్రభుత్వం అదనపు సిబ్బంది నియామకంకు అన్ని చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని గద్వాల, నారాయణ పేట, నాగర్ కర్నూల్‌లలో మెడికల్ కాలేజీల్లో అన్ని వసతులు కల్పన కు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పిహెచ్‌సి, సబ్ సెంటర్, ఏరియా ఆసుపత్రులు, బోధన ఆసుపత్రులలో అన్ని సౌకర్యాలు కల్పించ నున్నట్లు తెలిపారు. అన్ని ఆసుపత్రుల్లో సిబ్బందితోపాటు, వైద్య పరికరాలు, మందులు ఇతర అన్ని అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సామాన్యులు సర్కార్ దవాఖానా నాది అనే విధంగా రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కృషి చేస్తోందన్నారు. ఈ నెల 9న ముఖ్యమంత్రి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అభివృద్ధి పై ప్రజా ప్రతినిధులు, జిల్లా యంత్రాంగంతో చర్చించి సాగు నీటి ప్రాజెక్ట్‌లు, విద్య, వైద్య రంగం, పర్యాటక రంగ అభివృద్ధికి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్న అంశాలపై సమీక్ష చేయనున్నట్లు తెలిపారు. రాబోయే సంవత్సరాల్లో సామాజిక, ఆర్థిక అభివృద్ధి కి తీసుకోవలసిన చర్యలపై జిల్లాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస రెడ్డి, దేవరకద్ర శాసన సభ్యులు జి.మధు సుధన్ రెడ్డి , జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, జిల్లా ఎస్పీ డి.జానకి, అదనపు కలెక్టర్ లు శివేంద్ర ప్రతాప్, ఎస్.మోహన్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ లతోపాటు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు . కార్యక్రమానికి ముందుగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జిల్లా కేంద్రానికి రావడంతో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పూల బొకే అందజేసి స్వాగతించారు.

## ఉనికికై నిరంజన్ రెడ్డిపై అక్కసు కక్కుతున్న ఎమ్మెల్యే

- పెండింగ్ బిల్లులకై కమీషన్ల వసూలు
- 8నెలల్లో చేసిన అభివృద్ధి సున్నా



**వనపర్తి, జూలై 07 (జనంసాక్షి):**
కాంగ్రెస్ పార్టీలో ఉనికిని కోల్పోతున్న స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రి నిరంజన్ రెడిపై అక్కసు కక్కుతున్నారని బీఆర్ఎస్ జిల్లా మీడియా సెల్ కన్వీనర్ నందిమల్ల అశోక్ మున్సిపల్ కౌన్సిలర్ నాగన్న యాదవ్ యువత సూర్య వంశం గిరి విమర్శిం చారు ఆదివారం స్థానిక బీఆర్ ఎస్ పట్టణ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాహులు గాంధీ ఇచ్చిన హామీలు,పార్టీ ఫిరాయింపుల పట్ల ఆయన వైఖ రిని నిరంజన్ రెడ్డి ప్రశ్నిస్తే వాటికి జవాబు చెప్పకుండా ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ ఎమ్మెల్యే తన కుసంస్కారాన్ని నిరూపించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మంత్రిగా వేలాది కోట్ల రూపాయల పనులే కాకుండా అన్ని రంగాల్లో వనపర్తి జిల్లా కేంద్రాన్ని అగ్రభాగాన ఉంచిన వాస్తవాలను వక్రీకరించి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆధార రహిత ఆరోపణలు చేసి ప్రజల దృష్టి మరల్చి గెలిచారని అన్నారు. అభివృద్ధి కోసం నయాపైసా మం జూరీ తీసుకురాకుండా ప్రజలను మరోసారి మోసం చేయడానికి చేస్తున్న కు యుక్తులను ప్రజలు గమనిస్తు న్నారని అన్నారు ఇటీవల నియోజకవర్గంలో పెండింగ్ పనుల బిల్లులు 25కోట్లు విడుదల చేయించి 8 శాతం కమిషన్ తీసుకొని, 6 శా తం మంత్రులకు కప్పం కట్టి 2శాతం కమిషన్ ఎక్కడికి పోయిందో ట్టారని మిగతా వెల్లడించాలని డిమాండ్ చేశారు.ఆ విషయం కూడా రాజీవ్ చౌరస్తాలో చర్చిద్దా మని సవాల్ విసిరారు. నియోజకవర్గంలో పట్టు సాధి స్తూ అనుభవంతో పెండింగ్ పనుల కోసం కృషి చేస్తున్న మీ సీనియర్ నాయకుణ్ణి తట్టుకోలేక ఒత్తిడికి గురై ఇతరులపై నిందలు వేస్తు న్నారని అన్నారు. ఎమ్మెల్యేగా మీ ప్రమేయం లేకుండా ప్రారంభోత్సవాలు, శంకుస్థా పనలు జరుగుతుంటే మీరేమో డిల్లీలో హైదరాబాద్‌లో పైరవీలు చేసుకుంటూ తిరగడాని ప్రజలు గమనిస్తున్నా రన్నారు. ఈ సమావే శంలో చిట్యాల రాము, ఎం.శ్రీను, తోట శ్రీను, కృష్ణయ్య,రాజు పాల్గొన్నారు.

## గ్రంధాలయానికి పుస్తకాలు వితరణ చేసిన అడిషనల్ కలెక్టర్



**హుస్నాబాద్, జూలై 07 (జనంసాక్షి)**
హుస్నాబాద్ గ్రంధాలయానికి పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జి.వి శ్యామ్ ప్రసాద్ లాల్ పుస్తకాలను అందించారు. లైబ్రరీలో వివిధ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు తమకు వివిధ పరీక్షలకు కావల్సిన మరిన్ని పుస్తకాలు లైబ్రరీలో అందుబాటులో ఉంటే చదువుకుని ప్రిపేర్ అయ్యే అవకాశం కల్గుతుందని, పుస్తకాలు ఏర్పాటు చేయాలని కోరడంతో వెంటనే స్పందించి మీకు కావల్సిన పుస్తకాల లిస్టు పంపమని తేల్పి ఆ పుస్తకాలను ఆదివారం హుస్నాబాద్ గ్రంధాలయానికి పంపించడం జరిగింది. హుస్నాబాద్ ప్రాంత విద్యార్థుల వీటిని ఉపయోగించుకును మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని వారు పంపిన సందేశంలో కోరారు. ఈ పుస్తకాలను లైబ్రరీ ఇంచార్జ్ బాలయ్య, లావణ్యలకు జి.వి.శ్యాంప్రసాద్ లాల్ పక్షాన వారి ఎస్ఎస్‌సి 83-84 బ్యాచ్ మిత్రులు కొండూరి శ్రీనివాస్, కొత్తపల్లి అశోక్, వి.వెంకట రమణారెడ్డి, కన్నోజు శ్రీనివాస్, జగన్, రాజ బ్రహ్మచారి, కరణ్‌లు అందజేసారు. పుస్తకాలను కోరగానే తను పుట్టిన ప్రాంతాన్ని మరవకుండా వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందించినందుకు లైబ్రరీలో చదువుకుంటున్న విద్యార్థులు రవి, చంద్రశేఖర్, రాజు, వంశీ, నీలిమ, స్వర్ణలత, హరిబాబు, రవీందర్, రమేశ్‌లు కృతజ్ఞతలు తెలియజేశారు.

## పేట జిల్లా స్వాతికి డాక్టరేట్

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**
పట్టణంలోని మార్కెట్ ఏరియాకు చెందిన న్యాయవాది మద్దూరు బస్వరాజు కుమార్తె మద్దూరు స్వాతి డాక్టరేట్ సాధించారు. హైదారాబాద్ ఉస్మానియా యునివర్సిటీకి చెందిన స్వాతి ప్రొఫెసర్ శివరాజ్ వద్ద రసాయన శాస్త్రంలో పరిశోధన చేసిన ప్రావీణ్యత సాధించారు. ఈ మేరకు హైదారాబాద్‌లో డాక్టరేట్ పట్టాను శనివారం అందుకున్నారు.



## నా హయాంలో
# మణీ మకుటం మెడికల్ కాలేజీ

- 5 ఏళ్ల పాలన సంతృప్తినిచ్చింది
- సహకరించిన అందరికీ కృతజ్ఞతలు
- ఎంపిపి అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి




**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**
నారాయణపేట ఎంపిపిగా చేసిన పాలనలో మండలంలోని అప్పక్ పల్లి మెడికల్ కాలేజీ ఏర్పాటు కావడం నాహాయాంలో మణీ మకుటమని నారాయణపేట ఎంపిపి అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.పదవి కాలం ముగిసిన సందర్భంగా ఆయన జనం సాక్షి జిల్లా బ్యూరో లింగంతో మాట్లాడుతూ సాధించిన అభివృద్ధిని, అనుభవాలను పంచుకున్నారు.తన పాలన అంతా బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే సాగిందని అన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చానని అన్నారు.



### 133/11కేవి విద్యుత్ సబ్ స్టేషన్

ప్రధానంగా మండలంలో నేను ఎంపిపి కాక ముందు రైతులు కరెంటు కోతలు,లోల్టేజి సమస్యతో సతమతమయ్యే వారని అన్నారు.రైతుల సమస్యలు తెలుసుకుని ఒక రైతుగా వారి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానిక ఎమ్మెల్యే ఎస్ ఆర్ రెడ్డి తో మంత్రులతో విన్నవించి ముందుగా ఆప్పక్ పల్లిలో 33/11 కే.వి సబ్ స్టేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు.అది కాస్త ఊరటనిచ్చింది కానీ మండలం మొత్తం సమస్య పరిష్కరించాలని 133/11కే.వి విద్యుత్ కేంద్రాన్ని అందరినీ ఒప్పించి ఏర్పాటు చేసి కరెంట్ సమస్యను పూర్తిగా నివారించామని అన్నారు.

### మెడికల్ కాలేజీ ఏర్పాటు

ప్రధానంగా ప్రధాన రహదారి పక్కనే ఉన్నా అప్పక్ పల్లి పరిసర గ్రామాల వెనుకబడి ఉన్నాయని వాటిని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించి అభివృద్ధి చెందాలంటే ఒక జిల్లా స్థాయి కార్యాలయం కానీ విద్యాలయం కానీ ఏర్పాటు కావాలని ఆలోచించాను. అందులో భాగంగా ఆప్పక్ పల్లిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు కు స్థలాన్ని పరిశీలించి అపగించడంతో రాష్ట్ర ప్రభుత్వం సిఎం కేసీఆర్, మంత్రితో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డితో కలిసి మెడికల్ కాలేజీనీ ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతున్నదని అన్నారు.తన హయాంలో సాధించిన గొప్ప విజయం మెడికల్ కాలేజీ అని సంతోషం వ్యక్తం చేశారు.

### రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు

మండలంలో దూరంగా ఉన్న బందగొండ, కోటకొండ, తీర్మలపూర్,బొమ్మన్ పాడ్,అమిరెడ్డిపల్లి, బోయిన్ పల్లి, లక్ష్మి పూర్ తదితర గ్రామాలు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాలంటే ఇబ్బందులు పడేవారు.అంతేకాకుండా వ్యయ ప్రయాసలకు గురయ్యేవారు. ఆయా గ్రామాల ప్రజల సౌకర్యం కోసం అందరికీ అందుబాటులో ఉండేలా అప్పక్ పల్లిలో రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశామని, సొంత భవనం నిర్మించడం జరిగిందని వివరించారు.

### డబుల్ రోడ్డు సౌకర్యం

ప్రజలు త్వరగా మహబూబ్ నగర్‌కు చేరుకావాలంటే అద్వాన్నమైన సింగల్ రోడ్డుపై వెళ్ళాలంటే ప్రయాణికులు ఆపసోపాలు పడుతున్నారు. ఇబ్బందులు తీర్చాలని అప్పక్ పల్లి నుంచి కోయిల్ కొండ వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయించడం జరిగిందని పనులు ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. అలాగే కొత్తగా ఏర్పడిన పంచాయితీలకు, కొన్ని పాత పంచాయితీలకు అన్ని సౌకర్యాలతో పంచాయితీ భవనాలు నిర్మించడం జరిగిందన్నారు. ప్రధానంగా ప్రజలకు అత్యవసరమైన తాగు నీటి సౌకర్యం ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా నల్లా కనెక్షన్ ఇచ్చామన్నారు. ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యం పనులు వేగవంతం చేశామన్నారు. మిగతా అన్ని పథకాలు ప్రజలకు ప్రభుత్వ పరంగా అందేలా చర్యలు



తీసుకోకున్నామని తెలిపారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



## న్యాల్ కల్‌లో తాగు నీటి తంటాలు

**న్యాల్ కల్ జులై 07 (జనం సాక్షి):**
అర కోరగా వస్తున్న మిషన్ భగీరథ నీటి సరఫరాతో నిత్యం నానా పాట్లు పడాల్సి వస్తుందని న్యాల్ కల్‌లోని మాణిక్ నగర్, ఎస్సీ, బీసీ కాలనీ వాసులు వాపోతున్నారు. వారానికి ఒకటి లేదా రెండు మార్లు మాత్రమే వస్తున్న మిషన్ భగీరథ నీటి సరఫరాతో త్రాగు నీటికి, ఇతర అవసరాల కోసం అవస్థలు పడాల్సి వస్తుందని కాలనీ వాసులు వాపోతున్నారు. మరో మార్గం లేక 15 లీటర్ల మేర గల ఒక డబ్బాకు రూ:15/20 వెచ్చించి కొనుగోలు చేసుకుని అవసరాలను తీర్చు కోవాల్సి వస్తుందన్నారు. వేసవి కాలంతో పాటు వర్షాకా లంలో సైతం త్రాగునీటి సమస్య వెంటాడు తోందన్నారు. మిషన్ భగీరథ, గ్రా మపంచాయతీ అధికారులు చొరవ తీసుకొని గ్రామంలోని ఆయా కాలనీలో త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



## బీఆర్ఎస్‌లోనే కొనసాగుతాం

- తొలి సిఎం కేసిఆర్ అడుగుజాడలో నడుస్తాం
- బీఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్పిటిసి బాసు శ్యామల హన్మంతునాయుడు

**గద్వాల నడిగడ్డ, జులై 7 (జనం సాక్షి)**
ఎవరు ఏ పార్టీ లేకపోయినా మేము మాత్రం టీఆర్ఎస్ పార్టీతోనే ఉంటామని టిఆర్ఎస్ నాయకులు మాజీ జెడ్పిటిసి బాసు శ్యామల హనుమంతు నాయుడు అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో బాసు శ్యామల హనుమంతు నాయుడు మాట్లాడుతూ కేసీఆర్ అడుగుజాడల్లో మా కుటుంబం ఉద్యమ కాలం నుండి నేటి వరకు కొనసాగిస్తు వస్తున్నాం, కొన్ని అనివార్యకారణాల వల్ల మా కుటుంబనికి ఎమ్మెల్యే టికెట్ రాలేదని చెప్పుకొచ్చారు. త్వరలోనే బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తామని, కేసీఆర్ కేటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ కొనసాగించమని ఫోన్ కాల్ రావడంతోనే మీడియా సమావేశం ఏర్పాటు చేశామని హన్మంత్ నాయుడు అన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగ పెట్టుబడులను పెంచాలి

- కేంద్ర ప్రభుత్వం రైతు పంటలకు మద్దతు ధర కల్పించాలి
- రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్



**సంగారెడ్డి ప్రతినిధి, జులై 7 (జనంసాక్షి)**
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి పెట్టుబడులు పెంచాలని, రైతుల ఆదాయాన్ని పెంచడానికి నిర్దిష్ట చర్యలను తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కేంద్రం లోని కేవల్ కిషన్ భవన్ లో జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శోభన్ మాట్లాడుతూ కనీస మద్దతు ధరలకు చట్టబద్ధ హామీని ఇస్తూ సమగ్ర ఉత్పత్తి ఖర్చు సి2కు కనీసం 50 శాతం కలిపి మద్దతు ధరకు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరలు అమలయ్యే వ్యవస్థను ఇతర పంటలకు విస్తరించాలని, అన్ని రాష్ట్రాల్లో మద్దతు ధరలకు సేకరించి, దేశంలో వ్యవసాయోత్పత్తుల మార్కెట్‌లను పెంచాలని అన్నారు. విత్తనాలు, ఎరువులు, సస్యరక్షణ మందులు, డీజిల్, నీరు, విద్యుత్ ధరలను బాగా తగ్గించి నియంత్రించాలని అన్నారు. కార్పొరేట్ కంపెనీల లాభీలను నియంత్రిస్తూ ప్రభుత్వ రాయితీలను పెంచలని అన్నారు. వ్యవసాయరంగ పెట్టుబడులను పెంచాలని కోరారు. సాగునీటి సౌకర్యం మీద కేంద్రీకరించాలని అన్నారు. గ్రామీణ మౌలిక మార్కెట్ సౌకర్యాలు, అన్ని నీటి వనరుల సమగ్ర నీటి యాజమాన్యంమీద కేంద్రీకరించాలని అన్నారు. వ్యవసాయ రంగానికి సమయాను కూలంగా అవసరమైన మేర ఆర్థిక సంస్థల ద్వారా రుణాలను అందించాలని అన్నారు. వ్యవసాయంలో రుణాలను కార్పొరేట్ ప్రయోజనాల కోసం మళ్ళించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ రంగంలో చిన్న సన్నకారు రైతులకు నేరుగా రుణాలకు అందించాలని తెలిపారు. సహకార రుణ పరపతి వ్యవస్థను పునరుద్దరించాలన్నారు. ఈ సంస్థలను ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. ఎరువులలో పోషక విలువ ఆధారిత రాయితీ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. భూ సంస్కరణల పరిమితికి మించి ఉన్న భూములను రాష్ట్ర ప్రభుత్వాలు సేకరించి, భూమిలేని వారికి పంచాలని కోరారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు జి. జయరాజు మాట్లాడుతూ ... సాగు చేస్తున్న రైతులందరికీ రైతు భరోసా అందించాలని అన్నారు. అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు భరోసా ఇవ్వాలని కోరారు. సింగూరు కుడి కాలువ ద్వారా రైతులకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, రామాంజనేయులు, సహాయ కార్యదర్శులు మాణిక్ రెడ్డి, భూషణ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

### మెదక్ సెషన్ జడ్జి లక్ష్మీ శారద

**వెల్దుర్తి జులై 7 (జనం సాక్షి)**
పుట్టిన ప్రతి ఆడబిడ్డ పేరు మీద ఒక్క మొక్క నాటలని మెదక్ సెషన్స్ జడ్జ్ లక్ష్మీ సుధ అన్నారు. మసాయి పెట్ మండల పరిధిలోనాడిమి గడ్డ తండాలోని దుర్గం తరుణ్ కృష్ణ నాయుడు వ్యవసాయపొలం వద్ద ఏర్పాటుచేసిన వన్ గర్ల్ వన్ ట్రీ వన్ నేషన్ గ్రీన్నే షన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పుట్టిన 250 ఆడ బిడ్డ పేరు మీదుగా మొక్కలు నాటడం జరిగిందని నాటిన మొక్కలు మహా వృక్షాలుగా పెరిగి గిరిజనులు కుఆదాయ వనరులుగా ఏర్పాటు చేసుకోవాలని వారికి సూచించారు. వాతావరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి అవి పెరిగే వరకు బాగా చూసుకోవాలని సూచించారు చెట్లు ప్రగతికి మెట్లు లాంటివని భవిష్యత్ తరాలలో పచ్చదనాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ విధిగా ఇప్పుడు చెట్లు నాటి వాటి ఆలనా పాలన చూసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జూనియర సెషన్ జడ్జి లక్ష్మీశారద గారు మరియు డాక్టర్రీ శిల్పి రెడ్డితోపాటు లాల్ చందు మహిపాల్, కేతావత్ ఘని, కేతావత్ కళ్యాణ్, సురేష్, కిరణ్, దుర్గం, కార్తీక్, రాజు, కొండపోచయ్య పాల్గొన్నారు

## మక్తల్ అభివృద్ధికై అహర్నిశలు కృషి

### మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్ జూలై 07 (జనంసాక్షి)**
మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నానని, ఈ ప్రాంత సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, నియోజకవర్గం కోసం రోజుకు 18 గంటలు కష్టపడుతున్నానని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ ప్రాంత వాసులు తన మీద ఎంతో నమ్మకంతో దాదాపు 18 వేల మెజారిటీతో గెలిపించారని అన్నారు. గత ముప్పై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, తన గురించి మక్తల్ ప్రజలతోపాటు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరియు ఇతర మంత్రులు, నాయకులు అందరికీ తెలుసని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మరియు ఇతర నాయకుల ఆశీస్సులతో తనకు పోటీ చేసే అవకాశం వచ్చిందని, ప్రజలు ఆశీర్వదించారని తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రివ్యూలో భాగంగా విద్య, వైద్యం, సాగు నీటి రంగంపై మక్తల్ ప్రాంతవాసులు ఎదుర్కొంటున్న సమస్యల్ని సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో ప్రస్తావించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గ అభివృద్ధి కొరకు దాదాపుగా 40 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం నుండి తీసుకొచ్చానని తెలిపారు. ఈ విధంగా మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను తాపత్రయ పడుతుంటే కొందరు తనపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. మక్తల్ ప్రాంత అభివృద్ధి కోసం తాను కట్టుబడి ఉన్నానని, అందరూ కలిసి వచ్చి విలువైన సూచనలు, సలహాలు అందించి ఈ ప్రాంతం కోసం కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేతలు లక్ష్మారెడ్డి, చంద్రకాంత్ గౌడ్, మండల అధ్యక్షుడు గణేశ్ కుమార్, కోళ్ళ వెంకటేష్, గడ్డంపల్లి హనుమంతు, సూరయ్య గౌడ్,వల్లంపల్లి లక్ష్మణ్, శ్రీనివాస్, ఆడెం శ్రీనివాస్, గడ్డంపల్లి రమేష్, కావలి రాజేందర్ పాల్గొన్నారు.






# తెలంగాణ సంక్షేమ పథకాలు
# మహిళా సాధికారత

ప్రస్తుత సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు ఆర్థిక విషయాల్లో పోటీ పడుతున్నారు. మహిళా సాధికారత పెరిగినప్పుడు దేశం కూడా అభివృద్ధి చెందుతుంది. దీంతో మహిళా సాధికారత పెంచడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి కోసం అనేక ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాయి. మహిళల ఆర్థికాభివృద్ధి, స్వీయాభివృద్ధి కోసం ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా తోడ్పాలు అందిస్తున్నాయి. అదే బాటలో ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం కూడా మహిళల అభివృద్ధి కోసం అనేక ప్రత్యేక పథకాలు ప్రవేశపెడుతుంది. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల కోసం ప్రత్యేకంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలేంటి? రానున్న రోజుల్లో మహిళ కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టనుంది?



**ఉచిత బస్సు ప్రయాణం**

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు తెలంగాణ సర్కార్ టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో



ప్రయాణించవచ్చు. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, సిటీ బస్సుల్లో మహిళలకు ఫ్రీగా జర్నీ చేయవచ్చు. డిసెంబర్ 9న ఈ పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

**రూ.500కే గ్యాస్ సిలిండర్**

ఇక మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించే కార్యక్రమాన్ని ఫిబ్రవరి 27 నుంచి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుంది. మహిళల పేరు మీద గ్యాస్ కనెక్షన్ ఉండి రేషన్ కార్డు కలిగి ఉన్నవారికి ఈ పథకం వర్తింపజేస్తున్నారు.

**మహిళలకు నెలకు రూ.2,500**

మహిళలకు ఆర్థిక తోడ్పాలు అందించేందుకు ప్రతీ నెలా రూ.2,500 సహాయం అందిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ఈ పథకంను రానున్న రోజుల్లో అమలు చేయనున్నారు. అలాగే ఒంటరి మహిళలకు రూ.4 వేల పెన్షన్ అందించే కార్యక్రమాన్ని కూడా అమల్లోకి తీసుకురానున్నారు.

**విద్యార్థినులకు స్కూటర్లు**

18 సంవత్సరాలు నిండి కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు అందిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. ఈ పథకం అమలుకు ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది.

**అంగన్వాడీ టీచర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల జీతాలు పెంపు**

అంగన్వాడీ టీచర్ల జీతం రూ.18 వేలకు పెంచడంతో జాబ్ సెక్యూరిటీ కల్పించడం కోసం వారిని EPF కవరేజీ పరిధిలోకి తీసుకువస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చింది. అలాగే ప్రభుత్వ స్కూళ్లల్లో మధ్యాహ్న భోజన కార్మికుల జీతం రూ.10 వేలకు పెంచుతామని మేనిఫెస్టోలో ప్రకటించింది. వీటిని కూడా అమలు చేస్తే మహిళలకు లబ్ధి చేకూరనుంది.

**ఆడపిల్లలకు ఇందిరమ్మ కానుక**

ఇందిరమ్మ కానుక పథకం ద్వారా పెళ్లి చేసుకునే హిందూ అమ్మాయిలకు రూ.లక్ష, మైనార్టీ అమ్మాయిలకు రూ.లక్షా 60 వేల సాయం అందించనున్నారు. దీంతో పాటు 10 గ్రాముల బంగారం కానుకగా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ పథకం అమలు చేస్తే యువతులకు సహాయం అందనుంది.

**డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు**

ఇక మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక నిధితో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు, మహిళల రక్షణ కోసం మహిళా పోలీసులను



గ్రామాలు, పట్టణాలకు విస్తరించడం, డ్వాక్రా గ్రూపులకు శాశ్వత బిల్డింగ్‌తో పాటు వారికి వడ్డీ లేని రుణాలు అందించడం, మహిళా కమిషన్‌ను బలోపేతం చేసి మహిళలకు రక్షణ కల్పించడం వంటి కార్యక్రమాలను చేపడతామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది.




## వివంట గ్రీన్ మెడోస్
## బ్రోచర్ ఆవిష్కరించిన శాసనసభ స్పీకర్




**శంకర్పల్లి జూలై 07 (జనంసాక్షి) :** ప్రభుత్వం నిబంధనలకు లోబడి వెంచర్లు విల్లాలు ఏర్పాటు చేస్తే ప్రభుత్వం స్వాగతిస్తు oదని తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. శంకర్పల్లి మండలం చందిప్ప గ్రామంలో వివంట గ్రీన్ మెడోస్ బ్రోచర్ ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేనా భీమ్ భరత్ లతో కలిసి ఆదివారం బ్రోచర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వెంచర్లు విల్లాలు నిర్మాణం చేపట్టాలని సూచించారు. నగరానికి అతి సమీపంలో శంకర్ పల్లి లో వివాంటా గ్రీన్ మెడోస్ నిఖిల కన్స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో వెంచర్లు నిర్మాణం చేపట్టడం సంతోషకరమని పేర్కొన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోనే కాదు వికారాబాద్‌లో కూడా ఏర్పాటు చేస్తామంటే ప్రభుత్వం తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని చెప్పుకొచ్చారు. వికారాబాద్ ప్రాంతం కూడా ఎంతో ఆహ్లాదకరమైందని టీబి ఆసుపత్రి కూడా సమీపంలోనే ఉందని నిజాం కాలం నాడు నిర్మించిన వసతి గృహంలో ప్రస్తుతం టీబీ ఆసుపత్రి కొనసాగుతుందని అక్కడి ప్రాంతంలో కూడా వెంచర్లు ఏర్పాటు చేస్తామంటే అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. హెచ్ఎండిఏ గ్రామపంచాయతీ రేరా నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ వికారాబాద్ వచ్చిన సందర్భంలో వికారాబాద్ ని ఎంతో అభివృద్ధి చేస్తామని ఎన్నో హామీలు ఇచ్చి ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ హయాంలో వికారాబాద్ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా పుంజుకుంటుందని ఇక్కడి ప్రాంతం వారు అక్కడ ఎకరా రెండు మూడు ఎకరాల చొప్పున అలా కొనుగోలు చేసి అభివృద్ధి కూడా చేసుకోవచ్చని సూచించారు. నిఖిలా కన్స్ట్రక్షన్ డెవలపర్స్ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ హెచ్ఎండిఏ, స్థానిక గ్రామపంచాయతీ, రేరా నిబంధనలకు లోబడి వివంట గ్రీన్ మెడోస్ కార్యక్రమాలు చేపడుతుందని సూచించారు. గృహాలు నిర్మించి విక్రయించడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలను కూడా చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ చింపుల సత్యనారాయణ రెడ్డి, పీసీసీ కార్యవర్గ కార్యదర్శి ఉదయ మోహన్ రెడ్డి, అధికార ప్రతినిధి శ్రీరంగం సత్యం, బిజెపి జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి,జిల్లా అధికార ప్రతినిధి తొండ రవి,శంకర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వయం ఉపాధితో రాణించాలి

**అల్ ఖైర్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ రావూఫ్**



**వికారాబాద్ రూరల్ జూలై 7 (జనం సాక్షి) :**
అల్ ఖైర్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళల కోసం ఉచితంగా టైలరింగ్ లెర్నింగ్ సెంటర్ ను ఇస్లామిక్ సెంటర్ లో ప్రారంభించారు. ఈ సందర్భంగా జనతా జ్యూలరి చైర్మన్ తసవ్వార్ అలీ మాట్లాడుతూ సమాజంలో మహిళలకు ఉపాధి అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా అత్యాధునిక కుట్టు మిషన్లు, శిక్షణా సౌకర్యాలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రం కటింగ్ మరియు టైలరింగ్ లో మహిళలకు ప్రాక్టికల్ నైపుణ్యాలను అందించడం ద్వారా వారికి సాధికారత కల్పించేందుకు స్వయం సమృద్ధి మరియు స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడంలో అల్ ఖైర్ సొసైటీ సహకరిస్తుందని అన్నారు టైలరింగ్ లో శిక్షణ మరియు మహిళలకు ఆర్థికంగా స్వతంత్రులుగా మార్చడానికి వారి అభివృద్ధికి దోహదపడేలా తమ వంతుగా కృషి చేస్తున్నామని ఈ కార్యక్రమం నైపుణ్యాభివృద్ధి అవసరాన్ని మాత్రమే కాకుండా సమాజంలో ఉపాధి అవకాశాలను సృష్టించడం ద్వారా స్వయం ఉపాధిని పెంపొందించ వచ్చు అని ప్రముఖులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జమతే ఇస్లామీ హింద్ వికారాబాద్ అధ్యక్షుడు మొహమ్మద్ ఫాయాజ్, టైలారింగ్ సెంటర్ నిర్వాహకురాలు షమీమ్ బేగం,జాకీ, జిల్లా అధ్యక్షుడు జనాభా అంజద్ హుస్ తదితరులు పాల్గొన్నారు.

## దీనబంధు కాలనీలో
## డ్రైనేజీ వేశారు.. రోడ్లు మరిచారు



**కూకట్ పల్లి జులై 07(జనంసాక్షి):** కూకట్ పల్లి సర్కిల్ కూకట్పల్లి డివిజన్ పరిధిలోని దీనబంధు కాలనీ రోడ్ నెంబర్ 21గత నవంబర్ నెలలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టిన అధికారులు ఇంతవరకు సిసి రోడ్లు వేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు . డ్రైనేజీ వేశారు రోడ్లను మార్చాలని ఆరోపిస్తున్నారు. కోట్లాది రూపాయలతో చేపట్టే అభివృద్ధి పనులు పూర్తి చేయకపోవడంతో డ్రైనేజీ మ్యాన్ హోల్స్ దెబ్బతిని తిరిగి సమస్య పునరావృతం అవుతుందన్నారు. ఆయా కాలనీలో నివాసితులు కనీసం వాహనాలను సైతం పార్కింగ్ చేసుకునేందుకు వీలు లేకుండా రోడ్లు తయారయ్యాయి. గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షాలతో ఆ మార్గం బురద మయంగా మారి కనీసం నడవలేని స్థితి నెలకొంటుంది. ప్రభుత్వం మారిన అధికారుల తీరులో మార్పు కనబడకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారుతుంది. స్థానిక ప్రజాప్రతిని సైతం సమస్యపై దృష్టి సారించిన సందర్భం కనబడడం లేదు .పనులు మొదలుపెట్టారు చేతులు దులుపుకున్నారు. ఇలా అనేక సమస్యలు బస్తీలను పట్టిపీడిస్తున్న పట్టించుకునే నాధులే కరవడంతో పాటుగా జిహెచ్ఎంసి నిధులు వృధా అవుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు మేలుకొని భూగర్భ డ్రైనేజీలు పూర్తయిన కాలనీ, బస్తీలలో పర్యటించి సిసి రోడ్ నిర్మాణ పనులను పూర్తి చేయించి అభివృద్ధికి శ్రీకారం చుట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.







కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ , లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ , లోక్‌సభలో మాజీ ప్రతిపక్షనేత, బీజేపీకి చెందిన దివంగత సుష్మాస్వరాజ్‌పై ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఆదివారం ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ ఏర్పాటులో వారి సహకారాన్ని మరచిపోండి . ఈ ముగ్గురు మహిళలు తెలంగాణ ప్రజల హృదయాల్లో ఎప్పటికీ ప్రత్యేక స్థానం కలిగి ఉంటారు.
ఏపీ పునర్వ్యవస్థీకరణ బిల్లును ఆమోదించి కొత్త రాష్ట్ర ఏర్పాటులో సాహసోపేతమైన, గొప్ప నిర్ణయం తీసుకున్నందుకు తెలంగాణ చరిత్రలో వారికి ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. గత నెల ఇక్కడ జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల దశాబ్ద వేడుకల వేదిక నుంచి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి రేవంత్ మాట్లాడుతూ, మహిళలందరికీ, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరపున వారికి ధన్యవాదాలు తెలియజేశారు

# తెలంగాణ మరవని
# మాతృమూర్తులు

**- సుందరగిరి కనకలక్ష్మీ**
**కుత్బుల్లాపూర్, హైదరాబాద్**

కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉండి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయగలిగి ఉండి కూడా పదేళ్ళ తెలంగాణ ప్రజలను కష్ట పెట్టింది. వాయిదా వేస్తూ వచ్చింది వాస్తవం. ఇందుకు ప్రధాన కారణం ఆంధ్ర ఎంపీలు, ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి. ఆంధ్ర లాబీలో అర్థబలంతో పాటు రాజకీయంగా అధికంగా ఎంపీలు కలిగి ఉండి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టగలిగే స్థాయి, సంఖ్యాబలం మొదలైనవి ప్రధాన కారణాలు. తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎంపీలు కనీసం ఒకసారి రాజీనామా చేసినా ఇంత నిర్బంధం, ఇన్ని బలిదానాలు, ఇంత ఆలస్యం కావడాలు ఉండేవికావు. 2006, 2009 లలో రావలసిన తెలంగాణ మరో అయిదేళ్ళ వాయిదా పడడానికి కాంగ్రెస్, టిఆర్ఎస్ కెసిఆర్ రాజకీయ చదరంగం ఆటలు ప్రధాన కారణం. అయినప్పటికీ తెలంగాణను సాకారం చేసిన కీర్తి సోనియా గాంధీకి, మన్మోహన్ సింగ్‌కు, స్పీకర్ మీరా కుమార్‌కు , బిజేపి నేత సుష్మా స్వరాజ్‌కు దక్కుతుంది. ముగ్గురు మహిళల పట్టుదల చివరి క్షణంలో వేసిన ఎత్తుగడలను మరచి పోకూడదు. ముగ్గురు మహిళల కృషిని సాహసాన్ని ఎంత పొగిడినా తక్కువే అని మరచి పోరాదు. కాంగ్రెస్ 2004 నుండి 2014 దాకా అనేక పార్టీల కలయిక స్వయంగా స్వశక్తిలేని మైనారిటీ ప్రభుత్వం. 148 కాంగ్రెస్ సీట్లలో ఎక్కువ సీట్లు ఎ పి సమైక్య రాష్ట్రానివే. ఆంధ్ర లాబీ రాజకీయంగా ఆర్థికంగా పారిశ్రామిక వేత్తలుగా కాంట్రాక్టర్లుగా అత్యంత బలీయమైన శక్తులు. వారితో పోలిస్తే తెలంగాణ ఎంపీలు ఎమ్మెల్యేలు బలహీనులు.

పార్లమెంటు ఆఖరి ఘడియలు అయిపోవస్తున్నాయి. అందరిలో టెన్షన్. తెల్లారితే పార్లమెంటు ఇక మళ్ళీ జరగదు. సినిమాల్లో క్లైమాక్స్ సీన్లు పెట్టే టెన్షన్ కన్నా ఎన్నో రెట్లు టెన్షన్! ఒక రోజు ముందు నుండి తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు చేయని ప్రయత్నం లేదు. తాము ఎంపీగా



ఉన్నప్పుడే తెలంగాణ తేవాలి. తరువాత ఎవరు గెలుస్తారో? ఏ ప్రభుత్వం వస్తుందో? టెన్షన్... భరించ లేని టెన్షన్. టెన్షన్‌తో తల పగిలి పోతున్నది. చిట్ట చివరి ప్రయత్నంగా తెలంగాణ ఎంపీలు ఉదయమే లేచారు. వెంటనే తయారయ్యారు. అందరు పరస్పరం ఫోన్లు చేసుకున్నారు. సోనియా గాంధీని కలిశారు. స్పీకర్ మీరా కుమార్‌ను కలిశారు. మరో వైపు లగడపాటి వంటి వారు వారి ప్రయత్నాలు చేస్తున్నారు . పార్లమెంటు సమావేశాలు ఆఖరి రోజు. తప్పితే మళ్లీ ఎలక్షన్ల తరువాతే!

ముగ్గురు మహిళలు హామీ ఇచ్చారు. మేము చూసుకుంటాం అని. కోట్లాది తెలంగాణ ప్రియులకు టెన్షన్. టీవీలకు అతుక్కు పోయారు. తెలంగాణ బిల్లు ఆమోదం పొందకుండా చర్చలు పొడిగించే ట్రిక్కులు చర్చలు సాగదీసే కుట్రలు కొనసాగుతున్నాయి. చివరి నిమిషంలో లగడపాటి పెప్పర్ స్ప్రేలు ప్రయోగించారు. చిట్ట చివరకు మీరా కుమార్ స్పీకర్ ఓటింగ్ ప్రకటించి ఆంధ్ర ప్రదేశ్ విభజన చట్టాన్ని లోక్‌సభ ఆమోదించింది అని ప్రకటించారు . ఆ మాట టీవీలో విన్న తెలంగాణ ప్రజలు , 1968 నుండి స్వరాష్ట్రాన్ని కలగంటున్న ఉద్యమ కారులు, సీనియర్ సిటిజన్ల గుండెలు పగిలి పోతాయో ఏమో అన్నంత సంతోషం. ఆనందంతో ఎందరికి గుండె పోటు వచ్చిందో లెక్క లేదు. ఆ రోజు రాత్రంతా ఆనంద హేల, కోలాహలం. ఆ సందర్భం ఆ ఆనందం వర్ణించలేనివి. ఆనాడు దేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు కూడా దేశ ప్రజలు ఇంత ఆనందంగా లేరు. ఒక వైపు దేశ విభజన, మరోవైపు వేలాది మంది వలసలు, హత్యలు, దోపిడి, దౌర్జన్యాలు, మాన భంగాలు, ప్రాణాలు అరచేత పట్టుకొని అటు ఇటు రైల్లలో పరుగులు శవాల గుట్టలు. అదొక బీభత్సమైన హత్యాకాండ. అది ఆనందం కలిగించని దురదృష్ట క్షణాలు. చరిత్రలో మాయని మచ్చలుగా నిలిచి పోయిన చీకటి రోజులు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ప్రకటన అందుకు భిన్నంగా మన కష్టాలన్నీ తీరాయని పట్టలేని ఆనంద సన్నివేశం. ఆ చివరి క్షణాల ఉత్కంఠ భరిత సన్నివేశాలకు సాహసంతో ముందుకు సాగిన ముగ్గురు మహిళా నాయకులు సోనియా గాంధీ, మీరాకుమార్, సుష్మా స్వరాజ్‌లు భారత దేశ చరిత్రలో తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచి పోయారు.

నాలుగు దశాబ్దాలు ఉద్యమాలను చేసిన , చూసిన ఉద్యమకారులు, సీనియర్ సిటిజన్లు ఆనందం పట్టలేక, కృతజ్ఞతను తెలపడం ఎలానో తెలియక, తెలంగాణ తల్లికి సోనియమ్మ ముఖాన్ని పోస్టు చేసి ఫ్లెక్సీ బ్యానర్లు కరపత్రాలు పంచుకున్నారు. రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసి 2014 జూన్ రెండవ తేదీని తెలంగాణ అపాయింటెడ్ డేగా ప్రకటించడం దాకా సాగిన ఉత్కంఠ వర్ణించలేనిది. మాటలకందని ఇన్ని ఘట్టాలకు త్రిమూర్తుల వంటి ముగ్గురు మహిళా నాయకులు తెలంగాణ ప్రజలకు చిరస్మరణీయులు. తెలంగాణ రాష్ట్ర సాధన చరిత్రలో వీరి కృషి, సాహసం, పట్టుదల అంతర్భాగం. వారి కృషిని సహకారాన్ని మర్చిపోవడం అంటే మనకు మనమే చరిత్రకు ద్రోహం చేసిన వారమవుతాము.

## ఉద్యోగానికి అని వెళ్ళి... యువతి అదృశ్యం

**మల్కాజిగిరి,జూలై 7 (జనంసాక్షి) :**
ఉద్యోగానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన యువతి తిరిగిరాని సంఘటన నేరెడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ జిల్లా పెద్ద పెండ్యాల గ్రామానికి చెందిన శ్రీలత (37) కుటుంబ సభ్యులతో కలిసి బ్రతుకుతెరువు కోసం డిఫెన్స్ కాలనీలోని ఓ ఇంటిలో వాచ్మెన్ గా పనిచేస్తున్నారు. శ్రీలత కూతురు శిల్ప (21) టైలరింగ్ పనిచేస్తూ ఉంటుంది. ఈనెల 6న నేరేడ్ మెట్ చౌరస్తాలోని ట్రావెల్స్ లో ఉద్యోగం మాట్లాడుకుంటానని ఇంట్లో చెప్పి టిఫిన్ బాక్స్ కట్టుకొని వెళ్లింది. సాయంత్రం వరకు కూతురు ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు స్నేహితుల దగ్గర వెతికిన ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## రంగారెడ్డి జిల్లా మహిళా కార్యదర్శి కావ్య కృష్ణగౌడ్ నియామకం

**చేవెళ్ల,జూలై 07 (జనంసాక్షి) :** చేవెళ్ల మండల పరిధిలో కందుల గ్రామం మాజీ ఉప సర్పంచ్ గౌండ్ల కావ్య కృష్ణ గౌడ్ రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా కార్యదర్శిగా నియమితులయ్యారు. అలాగే మండల పరిధిలోని దేవుని గ్రామానికి చెందిన పద్మా మాణిక్యం జిల్లా మహిళా మోర్చా కార్యవర్గ సభ్యులుగా నియమించారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ నగరంలో పార్టీ కార్యాలయంలో బిజెపి అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, జిల్లా అధ్యక్షులు బి రమాదేవి తదితరులు చేతుల ఇద్దరికీ నియామక పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ...మాపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మా నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతగా పనిచేస్తూ పార్టీని గ్రామాల్లో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని అన్నారు.

# నిష్పాక్షికంగా విచారణ.. బాధ్యులు ఎవరైనా కఠిన చర్యలు

## అంతా నా వాళ్లే.. రాజకీయాలకు స్థానం లేదు - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**చింతకాని, జులై 7 (జనంసాక్షి):** చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన చేపల సొసైటీ, ఇరిగేషన్ కు సంబంధించి.. తన భూమి, వేసినటువంటి మెరకను తొలగించారని రైతు ప్రభాకర్ మనస్థాపన చెంది ఆత్మహత్య చేసుకున్నట్టు మీడియా ద్వారా మిగతా వారిద్వారా తెలిసింది. రైతు తండ్రి తో మాట్లాడాను, వారి శ్రీమతితో పిల్లలతో మాట్లాడాను, జరిగిన సంఘటన చాలా బాధాకరం, ప్రాణం చాలా విలువైనది, మనం పుట్టింది బతకడానికి కానీ చావడానికి కాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన రైతు ప్రభాకర్ కుటుంబాన్ని ఆయన పరామర్శించిన అనంతరం స్థానికంగా మీడియాతో మాట్లాడారు. ఎంత పెద్ద సమస్య ఉన్న ఎక్కడో ఒకచోట పరిష్కారం మార్గం వెతుకొని బతకడానికి ప్రయత్నం చేయాలి తప్ప ఎవరు ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను అన్నారు. రైతును ఆత్మహత్యకు పురి గొల్పి.. దానికి దారి తీసిన పరిస్థితులు కల్పించిన వ్యక్తులు ఎవరైనా సరే, ఎంత పెద్ద వారైనా సరే.. నిష్పక్షపాతం గా విచారణ చేసి బాధ్యులైన వారి పైన చట్టపరంగా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించానని తెలిపారు. ఇక్కడ అందరూ మా వాళ్లే.. అందరూ నా వాళ్లే.. జరిగిన పొరపాటుకు ఎవరూ కారణమైన సరే.. ఎవరిని ఉపేక్షించేది లేదు, ఎవరిని వదిలిపెట్టేది లేదు అన్నారు. బాధిత కుటుంబానికి తప్పనిసరిగా న్యాయం జరిగేటట్టుగా .. ఆత్మహత్య కు ప్రేరేపించిన వారిపై చర్యలు తీసుకోవడమే కాకుండా... రైతు ప్రభాకర్ భూమికి సంబంధించిన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం అన్నారు. చేపల సొసైటీ, ఇరిగేషన్, రెవెన్యూ వారితో మాట్లాడి సమస్య ఏంటో తెలుసుకొని.. శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ను ఆదేశించాను అన్నారు. పిల్లలు చదువుకోవడానికి అవసరమైన సహాయ సహకారాలు పూర్తిగా ఏర్పాటు చేస్తానని, పిల్లలు బాగా చదువుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.. వారు చదువుకున్నంత కాలం చదివి స్తాను ఇందులో ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. ఇతరత్రా సమస్యలకు సంబంధించి కుటుంబ సభ్యులు రాసి ఇచ్చారు వాటిని పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటాం ఎలాంటి ఇబ్బంది లేదు అన్నారు. ఇక్కడ అందరూ మావాళ్లే.. ఇటువంటి కేసుల్లో అసలు పార్టీలకు సంబంధమే లేదు... స్థానం లేదు ఇది మానవత్వంతో అందరూ చూడాల్సిన సంఘటన.. ఏ పార్టీ వారైనా మనిషే.. మనిషి ప్రాణం విలువైనది అని పేర్కొన్నారు. ఈ సంఘటనలో ఎవరిని ఉపేక్షించేది లేదని తెలిపారు.

## మృతుడు ప్రభాకర్ కుటుంబానికి న్యాయం జరిగేలా చేస్తా: డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన రైతు భోజండ్ల ప్రభాకర్ సంబంధించి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత దురదృష్టకరం.తన భూమి చెరువు శిఖంలోని భూమిలో వేసిన మెరకను తొలగించారని మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు వీడియో ద్వారా తెలిసింది. ఈ విషయంపై ఇప్పుడే మృతుడి తండ్రిగారితోను, ఆయన భార్యతోను, ఇతర కుటింబ సభ్యులతోనూ మాట్లాడడం జరిగింది. జరిగిన సంఘటన చాలా బాధాకరం. ప్రాణం చాలా విలువైనది. మనం పుట్టింది బతకడానికే కానీ చావడానికి కాదు. ఎంత పెద్ద సమస్య ఉన్న ఎక్కడో ఒకచోట పరిష్కార మార్గం చూసుకొని బతికేందుకు ప్రయత్నం చేయాలి. ఎవరు కూడా ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రభాకర్ ను ఆత్మహత్యకు పురిగొల్పిన, దానికి దారి తీసేలా పరిస్థితులు కల్పించిన వ్యక్తులు ఎవరైనా సరే, ఎంత పెద్ద వారైనా సరే నిష్పక్షపాతంగా విచారణ జరిపించి చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇక్కడ ఉన్న వారంతా నా వారే. జరిగిన పొరపాటుకు కారణం ఎవరైనా సరే ఎవరిని ఉపేక్షించేది లేదు ఎవరిని వదిలి పెట్టేది లేదు. మృతుడు ప్రభాకర్ కుటుంబానికి న్యాయం జరిగేలా చేస్తాం. ఆ భూమికి సంబంధించి శాశ్వతమైన పరిష్కారం లభించేలా చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. పిల్లలు చదువుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పడం జరిగింది. పిల్లలు బాగా చదువుకొని గొప్పగా వృద్ధులకి రావాలని నేను ఆకాంక్షిస్తున్నాను. మరి కొన్ని సమస్యల గురించి ఆ కుటుంబ సభ్యులు నాకు ఒక పిటిషన్ ఇచ్చారు దానిని పూర్తిగా పరిశీలించి వారికి తగు న్యాయం చేస్తానని న్యాయం చేస్తామని చెప్పడం జరిగింది.

# స్వేచ్ఛనూ హరించే చట్టాలు




**పోలీసులకు న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేసే అధికారం దేశద్రోహం పేరిట ఇచ్చిన నిర్వచనం రాజ్యాంగ విరుద్ధం మూడు క్రిమినల్ చట్టాల అమలు - పర్యవసానాలు - ప్రమాదాలు సెమినర్లో ఐలూ రాష్ట్ర అధ్యక్షులు, స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ**

**ఖమ్మం ప్రతినిధి, (జనం సాక్షి):** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాలు అత్యంత దుర్మార్గమైనవని ఐలూ రాష్ట్ర అధ్యక్షులు, స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ తెలిపారు. ఈ చట్టాలన్నీ వ్యక్తిగత స్వేచ్ఛను సైతం హరించి వేస్తాయన్నారు. సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన సుందరయ్య భవనంలో అదివారం ఏర్పాటు చేసిన 'మూడు క్రిమినల్ చట్టాల అమలు- పర్యవసానాలు - ప్రమాదాలు సెమినర్ 'లో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తో కలిసి పాల్గొన్నారు. మూడు చట్టాలున్న శిక్షను పదేళ్లకు పొడిగించటం ఎంత వరకు సమంజసం అని కొల్లి సత్యనారాయణ ప్రశ్నించారు. ఐపీసీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ యాక్ట్ లను భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సంహిత, భారతీయ సాక్షి సంహితగా మార్చడంతో పాటు కఠినమైన శిక్షలు అమలు చేస్తున్నారన్నారు. ఈ చట్టాల మార్పు వెనుక క్రమేణా ఇతర దేశాల నుంచి తీసుకొచ్చిన చట్టాల్లో మార్పు పేరుతో మొత్తంగా రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర దాగుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను తొలగించి, ప్రతిపక్షాల వాక్ స్వాతంత్ర్యాన్ని హరించి వేస్తారన్నారు. దేశద్రోహం, రాజద్రోహం పేరుతో సెక్షన్ 152లో చేసిన మార్పుతో దేశ ఐక్యత, సమగ్రతను దెబ్బతీశారనే పేరుతో పదేళ్లపాటు శిక్షించే అధికారం ఇచ్చారన్నారు. ప్రాథమిక హక్కులకు సైతం ఇది భంగం కలిగిస్తుందన్నారు. మారణాయుధాలతో తిరగ కూడదనే చట్టాన్ని సైతం రద్దు చేశారని తెలిపారు. వ్యక్తిగత ప్రైవసీని హరించేలా చట్టం చేశారన్నారు. పోలీసులకు విస్తృత అధికారాలు ఇవ్వటం సరికాదన్నారు.

**ఏకపక్షంగా అమలు: నున్నా**

పార్లమెంట్ లో కానీ న్యాయవాదులతో కానీ ఎలాంటి చర్చ లేకుండానే కొత్త చట్టాలను అమల్లోకి తెచ్చారని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించే ఈ మూడు చట్టాలను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేసే అధికారం పోలీసులకు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. దేశద్రోహం పేరిట ఇచ్చిన నిర్వచనం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. దర్యాప్తు పేరుతో వ్యక్తిగత స్వేచ్ఛను హరించటం సరికాదన్నారు. ఈ సెమినార్ లో ఐలూ రాష్ట్ర కార్యదర్శి మందడపు శ్రీనివాసరావు, జిల్లా బార్ కౌన్సిల్ కార్యదర్శి చింతనిప్పు వెంకట్, ఐలూ జిల్లా కార్యదర్శి నల్లమల నవీన్ చైతన్య, రాష్ట్ర నాయకులు మీసాల వెంకటేశ్వర్లు, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, వై. విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ అవార్డుకు ఎంపికైన వీరభద్రాచారి



**ఖమ్మం, జూలై 7, (జనం సాక్షి) :** ఆయుర్వేదంలో విశిష్ట సేవలు అందించి నందు కు గాను ఖమ్మం జిల్లాకు చెందిన రామడుగు వీరభద్రాచారి కి ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్, న్యూఢిల్లీ వారిచే గుర్తింపు పొంది, గౌరవ డాక్టరేట్ అవార్డుకు ఎంపిక అయ్యారు. ఖమ్మంలోని వీడిఓస్ కాలనీకి చెందిన రామడుగు వీరభద్రా చారి పారంపర్య ఆయుర్వేద వైద్యునిగా నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు దాదాపు 430 మందికి సురక్షిత కాన్పుల వైద్య సేవలు అందించినందుకు గాను ఆయనకు ఈ అవార్డు దక్కింది. ఈనెల 20న ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్ వారిచే న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా, రఫీ మార్గ్ లో వీరభద్రాచారి కి అవార్డు ప్రధానం చేయనున్నారు. ఆయన చేసిన సేవలకు గాను గతంలో సంగం అకాడమీ వారిచే నేషనల్ యూనివర్సిటీ అవార్డు, ది టార్గెట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారిచ్చే రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రైడ్ అవార్డు 2024, విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ వారిచే విశ్వకర్మ లెజెండరీ అవార్డు, హాస్యం ఆర్టిస్ట్ యూనియన్ వారిచే గౌరవ డాక్టరేట్ అవార్డు లను పొందారు. రామభద్ర ఆయుర్వేద మూలిక యోగ పీఠం ఖమ్మం వారిచే ప్రతి 27 రోజులకు ఒకసారి పుష్యమి నక్షత్రం రోజున 16 సంవత్సరాల లోపు పిల్లలకు ఆయుర్వేద ఇమ్యూనికేషన్ స్వర్ణ బిందు ప్రాశన ఉచిత చుక్కల మందును అందిస్తూ వస్తున్నారు. గౌరవ డాక్టరేట్ అవార్డుకు ఎంపిక కావడం పట్ల వీరభద్రాచారిని పలువురు అభినందిస్తున్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

చిట్యాల జూలై 07(జనం సాక్షి): చిట్యాల మండల కేంద్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా నాయకులు ఎరసాని గోపాల్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం, వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ నకిరేకల్ నియోజకవర్గ ఇన్చార్జ్ మేడి శంకర్ పాల్గొని జెండా ఆవిష్కరించారు. అనంతరం మందకృష్ణ మాదిగ 60వ పుట్టినరోజు సందర్భంగా కేకు కట్ చేసి మాట్లాడుతూ 30 సం.ల ఎమ్మార్పీఎస్ ఉద్యమ కాలంలో మంద కృష్ణ పోరాట ఫలితంగా వృద్ధులకు, వితంతువులకు ఈ రోజు తెలంగాణలో 4వేలు , ఆంధ్రాలో 7వేల పెన్షన్ వస్తుందంటే అది మందకృష్ణ ఉద్యమ ఫలితమే అని అన్నారు. ఈరోజు మాదిగలు నేను మాదిగని సగర్వంగా చెప్పుకునే విధంగా మాదిగలలో ఒక ఆత్మస్థైర్యాన్ని నింపిన ఉద్యమమే ఎమ్మార్పీఎస్ ఉద్యమమన్నారు.ఈ కార్యక్రమంలో నోముల పురుషోత్తం,బస్సు శంకర్, గంగాపురం లింగస్వామి,కర్రె లింగస్వామి,పాల శ్రీను, పొలిమేర దశరథ తదితరులు పాల్గొన్నారు.

# కల్వర్ట్ నిర్మాణం చేసారు.. రక్షణ గోడలు మరిచారు

## ఇది అధికారుల నిర్లక్ష్యం కాదా - ప్రాణాలు పోయింతర్వాత నిర్మాణాలు చేపడతారా





**ఖమ్మం బ్యూరో,జులై 7 (జనంసాక్షి):** కల్వర్ట్ నిర్మాణం చేసారు రక్షణ గోడలు మరిచారు గత రెండు సంవత్సరంల క్రితం వెంకటేశ్వర నగర్ మరియు బొక్కలగడ్డ ప్రాంతాల మధ్యన మురుగు కాల్వ పై, కలవర్ట్ నిర్మాణం జరిగినది కాని కల్వర్ట్ రక్షణ గోడలు నిర్మాణం ఈరోజు వరకు జరగలేదు. ప్రాంత ప్రజలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తారు. చిన్న పిల్లలు, స్కూల్ విద్యార్థులు, కూర గాయల మార్కెట్లో పనిచేసే హమాలీలు అర్ధ రాత్రి సమయం లో ఈ కల్వర్ట్ నుండే నిత్యం రాకపోకలు కొనసాగిస్తారు... గత సంవత్సరం జులై మాసంలో వొచ్చిన మున్నేరు వరదలు సమయంలో ఈ రెండు ప్రాంతాల ప్రజలు ఈ రక్షణ గోడలు లేని కారణంగా భయబ్రాంతులకు గురికావడం జరిగినది.ఏ క్షణంలోనైనా ప్రజల ప్రాణాలను బలి ఈసుకోటానికి సిద్ధంగా ఉన్న ప్రాంతంలో రక్షణ గొడల నిర్మాణ జాప్యాన్ని స్తానికులు పలురకాలుగా విమర్శలు చేస్తున్నారు. సంబంధిత ధికారులు &ఎంటనే ఆ నిర్మాణాలు చేపట్టాలని,కొరుతున్నారు.ఈ విషయాన్ని అధికారులతొ పాటుగా,మాత్యుల వద్దకు తీసికొని వెళ్ళాలని స్తానికులు ప్రయత్నాలు చేస్తున్నారు.

# కమ్యూనిస్టులు లేకుండా దేశం లేదు

**బీజేపీకి 370 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేది..**

**ఇండియా కూటమితో రాజ్యాంగాన్ని రక్షించుకోగలిగాం..**

**సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం..**



**ఖమ్మం బ్యూరో, జూలై 7(జనంసాక్షి) :** కమ్యూనిస్టులు లేకుండా దేశం లేదు...కష్టాలు, కన్నీళ్లున్నంత కాలం ఎర్రజెండా ఎక్కడికీ పోదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో సింగిల్ పార్టీగా బీజేపీకి 370 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేదని తెలిపారు. కాంగ్రెస్‌తో సహా లౌకిక, ప్రజాస్వామ్యశక్తులతో ఏర్పడిన ఇండియా కూటమి బీజేపీని నిలువరించి రాజ్యాంగాన్ని రక్షించుకోగలిగిందన్నారు. ఖమ్మం అర్బన్ మండల పరిధిలోని ఎర్రబోయిన లింగయ్య స్మారక కొత్తగూడెం గ్రామశాఖ సీపీఐ(ఎం) కార్యాలయ భవన ప్రారంభోత్సవ సభలో తమ్మినేని ప్రసంగించారు. అంతకు ముందు గ్రామంలోని 13, 14 డివిజన్‌లలోనిర్వహించిన ర్యాలీలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. స్థానికంగా మూడు చోట్ల ఏర్పాటు చేసిన సీపీఐ(ఎం) జెండాలను ఆవిష్కరించారు. పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం నాయకులు ఎర్రబోయిన గోవింద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో తమ్మినేని ప్రసంగించారు. మతోన్మాద విధానాలను తిప్పికొట్టేందుకు కమ్యూనిస్టు ఉద్యమం ప్రజల్లోకి ఎంత చొచ్చుకుపోతే అంతమంచిదని తమ్మినేని అన్నారు. ఓట్లు, సీట్ల సంఖ్య ఎలా ఉన్నా కమ్యూనిస్టులు లేకుండా దేశం బతికి బట్టకట్టలేదన్నారు. భూమి పంచాలి...కూలీ పెంచాలి...ఎస్సీ, ఎస్టీలు, స్త్రీలకు హక్కులు కల్పించాలని పోరాడేది కమ్యూనిస్టులే అన్నారు. ఎర్రబోయిన లింగయ్య వంటి ఆదర్శ కమ్యూనిస్టు పేరు ఈ భవనానికి పెట్టడం గర్వకారణ మన్నార కాగ్, సీబీఐ, ఎలక్షన్ కమిషన్ వంటి రాజ్యాంగ సంస్థలను బీజేపీ బానిసలుగా మార్చుకుందన్నారు. మొన్నటి ఎన్నికల్లో బీజేపీకి ఆశించిన సీట్లు వచ్చి ఉంటే లౌకిక, ప్రజాస్వామ్య, కులమతాలకు అతీతంగా అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని మార్చేదని తెలిపారు. ఇండియా కూటమి దీనికి అడ్డుకట్ట వేసిందన్నారు. ఇదీ ప్రజాస్వామ్యశక్తుల విజయంగా అభివర్ణించారు. ప్రజల బతుకులు మారాలంటే విద్యా, వైద్యం, భూమి, ఉద్యోగ, ఉపాధి అందరికీ లభించాలన్నారు. కుల,మత తేడా లేకుండా అందరూ సమానంగా జీవించేలా చూడటమే కమ్యూనిస్టుల లక్ష్యమన్నారు. పేదల కష్టాలు, కన్నీళ్లు ఉన్నంత కాలం కమ్యూనిస్టులు ఉంటారన్నారు. లింగయ్య మనసంత శుద్ధంగా ఆఫీస్ ఉందని కితాబు ఇచ్చారు. పార్టీ ఆఫీస్‌ను ఉపయోగించుకొని ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని కాంక్షించారు. రైతాంగ ఉద్యమం ఎక్కడ బలంగా ఉందో అక్కడ బీజేపీ ఓటమి చెందిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. బీజేపీ పీడ వదలకపోతే దేశానికి భవిష్యత్తు లేదన్నారు. లింగయ్య స్ఫూర్తితో పార్టీని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఇదో పార్టీ కార్యాలయంలాగా కాకుండా ఊరంతా పండుగ వాతావరణం నెలకొందన్నారు. ఎర్రజెండాను కప్పుకుని పోయినవాళ్లే నిజమైన కమ్యూనిస్టులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, భూక్యా వీరభద్రం, కళ్యాణం వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాస్, ఎస్‌కే మీరాసాహెబ్, తుమ్మా విష్ణు, తుషాకుల లింగయ్య, ఎస్.నవీన్‌రెడ్డి, బత్తిని ఉపేందర్, బోడపట్ల సుదర్శన్, కొమ్ము శ్రీను, భూక్యా శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు పగడాల మల్లేశ్, కార్పొరేటర్లు చామకూరి వెంకన్న, కూరాకుల వలరాజు, వీవీ పాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, రైతుసంఘం నాయకులు ఉమ్మినేని కోటయ్య, కాంగ్రెస్ నాయకులు చేతుల నాగేశ్వరరావు, భమ్మిశెట్టి సత్యం, బీఆర్ఎస్ నాయకులు ఎం.కోటయ్య, పార్టీ గ్రామశాఖ కార్యదర్శి మొద్దినబోయిన మంగయ్య, మొర్రిమేకల అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు , మెస్, స్కాలర్షిప్స్ విడుదల చేయాలని

## ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి కి వినతి

ఖమ్మం అర్బన్,జులై7(జనంసాక్షి) ఖమ్మం కేంద్రంగా జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్నా డీమాండ్ ను పరిష్కరించాలని మరియు పెండింగ్ లో ఉన్న మెస్ చార్జీలు, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలనీ, న్యూ ఎడ్యుకేషన్ పాలసీ ని రద్దుచేయాలని కోరుతూ పార్లమెంట్ సమావేశలలో మాట్లాడాలని కోరుతూ ఈరోజు పి. డి. ఎస్. యూ -పి. వై. ఎల్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా పార్లమెంట్ సభ్యులు ఎంపీ రామాసహాయం రఘురాం రెడ్డి కి స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రం లో వినతిపత్రం ఇవ్వడం జరిగింది..ఈ సందర్భంగా పి. డి. ఎస్. యూ రాష్ట్ర కార్యదర్శి అజాద్ పి. వై. ఎల్ -పి. వై. ఎల్ పి. డి. ఎస్. యూ ఖమ్మం జిల్లా కార్యదర్శులు రాకేష్, వెంకటేష్ లు పాల్గోని మాట్లాడుతూ...జిల్లా కు యూనివర్సిటీ కేటాయించాలని వివిధ రూపాలలో విద్యార్థి, ప్రజా సంఘాలు ఆందోళన చేస్తున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అయినా జిల్లా కు యూనివర్సిటీ ఏర్పాటు కు స్పందించాలన్నారు. ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం విద్యారంగ బలోపేతం కోసం అన్ని రకాల సౌకర్యాలు, సదుపాయాలు మన జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ లేకపోవడం ఖమ్మం జిల్లా విద్యార్థులకు నష్ట దయకం అన్నారు. యుజిసి నిబంధన ప్రకారం యూనివర్సిటీ ఏర్పాటు కు 200 కాలేజీల కంటే తక్కువ ఉండాలి. కానీ కాకతీయ యూనివర్సిటీలో సుమారు 450 కి పైగా కళాశాలలు ఉన్నాయని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉండగా వీటిలో సుమారు 90 వేలకు పైగా విద్యార్థులు ఉన్న త విద్యను అభ్యసిస్తున్నారాని వారు అన్నారు. ఖమ్మం కేంద్రంగా జనరల్ యూనివర్సిటీ డిమాండ్ చాలా కాలంగా ఉన్నదని నాటి నుండి నేటి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ ముఖ్యమంత్రులు హామీ ఇచ్చి ఉన్నా జిల్లా కేంద్రం గా యూనివర్సిటీ కేటాయించాక పోవడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఖమ్మం కేంద్రం గా యూనివర్సిటీ నెలకొల్పడం కోసం అన్ని రకాల అవకాశాలు కూడా ఉన్నాయి అని విద్యార్థుల సంఖ్య విద్యాలయాల సంఖ్య కూడా సరిపడా ఉన్నదిని ఖమ్మం జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఉంటే అన్ని కళాశాలపై పర్యవేక్షణ, కార్య నిర్వహణ, అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దేందుకు ఉపయోగకరం. ఖమ్మం జిల్లా అభివృద్ధి పథంలో సాగేందుకు ఉపయోగపడుతుందన్నారు. గత 10ఏళ్ళ తెలంగాణ రాష్టంలో రొండు సార్లు అధికారంలో ఉన్న బి అర్ ఎస్ ప్రభుత్వం 8నెలలలు గా విద్యార్థుకు మెస్ చార్జీలు విడుదల చేయకపోవడంతో అర్ధకాలలితో విద్యార్థులు చదువు కునే పరిస్థితి రాష్టంలో ఏర్పడిందని కావున తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం మెస్ చార్జీలు విడుదల చేయాలన్నారు. 10 సవంత్సరాలు గా కెసిఆర్ ప్రభుత్వం స్కాలర్ షిప్స్ ఏడువందల కోట్లకు పైగా బాకాయిలు విడుదల చేయక పోవడం వాళ్ళ విద్యార్థుల జీవితాలకు నాణ్యమైన విద్య అందాని ద్రాక్ష ల మారడం తో పాటు వారి పై చదువు లకు శాపంగా మారిందని బి అర్ ఎస్ ప్రభుత్వం పై వారు మండిపడ్డారు. తక్షణమే పెండింగ్ లో ఉన్న మెస్ చార్జీలు, మరియు స్కాలర్ షిప్స్ విడుదల చేయాలనీ గత ప్రభుత్వం విద్యా వ్యవస్థ లో చేసిన ఇలాంటి తప్పిద్దాలు చేయకుండా ఉండటం తో పాటు జిల్లా విద్యారంగ అభివృద్ధి కోసం ఖమ్మం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేయాలని వారిని వారు కోరారు..ఈ కార్యక్రమం లో పి. డి. ఎస్. యూ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, పి. వై. ఎల్. గొడ్డెటి. అశోక్ పి. డి. ఎస్. యూ ఖమ్మం నాయకులు ప్రసాద్, శ్రీను, స్టాలిన్, వెంకటేష్, రాకేష్ భరత్,తదితరులు పాల్గొన్నారు...



# విపణి

## ప్యాకేజ్డ్ ఆహార వస్తువులపై సమాచారం పెద్ద అక్షరాల్లో..

### ఎఫ్ఎస్ఎస్ఏఐ మార్పులు!

దిల్లీ: ప్యాకేజ్డ్ ఆహార వస్తువులపై ముద్రించే పోషక సమాచారంలో మార్పులు చేయడానికి ఆహార నియంత్రణాధికార సంస్థ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) శనివారం ఆమోదం తెలిపింది. మొత్తం ఉప్పు, చక్కెర, శాచురేటెడ్ కొవ్వు తదితర అంశాలను పెద్ద అక్షరాల్లో, బోల్డ్ ఫాంట్‌లో ఉంచాలని ప్రతిపాదించింది. దీనికి సంబంధించిన ముసాయిదా నోటిఫికేషన్‌ను త్వరలోనే జారీ చేసి, వివిధ వర్గాల స్పందనను కోరనుంది. తాజా మార్పుల కోసం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (లేబెలింగ్ అండ్ డిస్‌ప్లే) రెగ్యులేషన్స్, 2020లో సవరణలు చేయడానికి 44వ సమావేశంలో ఆమోదం తెలిపినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ ఛైర్‌పర్సన్ అపూర్వ చంద్ర పేర్కొన్నారు. 'ఈ సవరణలతో వినియోగదారులు ఆయా ఉత్పత్తుల్లో పోషక విలువల గురించి మరింత మెరుగ్గా అర్థం చేసుకోవడం ద్వారా ఆరోగ్యకర నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుంద'ని పేర్కొన్నారు.

## బంధన్ బ్యాంక్ తాత్కాలిక ఎండీ, సీఈఓగా రతన్ కుమార్ కేశ్

కోల్‌కతా: బంధన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రతన్ కుమార్ కేశ్ తాత్కాలిక ఎండీ, సీఈఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. జులై 10 నుంచి ఈ నియామకం అమల్లోకి వస్తుంది. ప్రస్తుత ఎండీ, సీఈఓ, వ్యవస్థాపకుడు చంద్రశేఖర్ ఘోష్ జులై 9న పదవీ విరమణ చేయనుండడం ఇందుకు నేపథ్యం. కొత్త ఎండీ, సీఈఓ బాధ్యతలు చేపట్టే వరకు లేదా మూడు నెలల కాలం పాటు కేశ్ తాత్కాలిక ఎండీ, సీఈఓగా ఉంటారని స్టాక్ ఎక్స్ఛేంజీలకు బంధన్ బ్యాంక్ సమాచారమిచ్చింది. కేశ్ నియామకానికి వాటాదార్ల అనుమతి లభించాల్సి ఉంది.

## గూగుల్ మ్యాప్స్ నుంచి ఓలా నిష్క్రమణ సొంత మ్యాప్స్‌తో సిద్ధం

ఓలాలో క్యాబ్/ఆటో/బైక్ బుక్ చేసుకుంటే.. గమ్యస్థానాన్ని చేరే మార్గం, సమయం తదితరాలు మ్యాప్ రూపంలో మనకు కనిపిస్తుంటాయి.ఇందు కోసం గూగుల్ మ్యాప్స్‌ను ఓలా వినియోగించేది. అయితే తాజాగా సొంతంగా సిద్ధం చేసుకున్న ఓలా మ్యాప్స్‌కు మళ్లినట్లు కంపెనీ సీఈఓ భవీశ్ అగర్వాల్ స్పష్టం చేశారు. యాప్‌ను అప్‌డేట్ చేసుకుని తాజా సేవలను పొందొచ్చని వివరించారు. 'గత నెలలో మైక్రోసాఫ్ట్ అజూర్ నుంచి వైదొలగిన మేం..ఇపుడు గూగుల్ మ్యాప్స్ నుంచీ నిష్క్రమించాం. ఏటా రూ.100 కోట్లను ఇందుకు ఖర్చుపెట్టేవాళ్లం. ఇపుడు సొంత మ్యాప్స్ కారణంగా మా ఖర్చు సున్నాకు చేరింద'ని అగర్వాల్ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. స్ట్రీట్ వ్యూ, ఇండోర్ ఇమేజెస్, త్రీడీ మ్యాప్స్, డ్రోన్ మ్యాప్స్ తదితర ఫీచర్లను త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. ఇక ఓలా ఎలక్ట్రిక్ సొంతంగా సాలిడ్ స్టేట్ బ్యాటరీలనూ తయారు చేస్తోంది. వచ్చే ఏడాది నుంచి తన విద్యుత్ స్కూటర్లకు ఈ బ్యాటరీలనే వినియోగించే అవకాశం ఉంది.

## ఎఫ్ఎంసీజీ ఆదాయ వృద్ధి 7-9%

### ప్రస్తుత ఆర్థిక సంవత్సరంపై క్రిసిల్ అంచనా

కోల్‌కతా: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఎఫ్ఎంసీజీ రంగ ఆదాయ వృద్ధి 7-9 శాతం మధ్య నమోదు కావొచ్చని క్రిసిల్ రేటింగ్స్ నివేదిక అంచనా వేసింది.గ్రామీణ గిరాకీ పుంజుకోవడం, పట్టణ గిరాకీ స్థిరంగా కొనసాగుతుండటంతో విక్రయాల పరిమాణ వృద్ధి పెరిగి ఆదాయం అధికమవుతుందని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్ఎంసీజీ రంగ వృద్ధి 5-7 శాతం ఉండొచ్చని అంచనా వేసింది. ఆహార, పానీయాల (ఎఫ్ అండ్ బీ) విభాగంలో ముడి పదార్థాల ధరలు స్వల్పంగా పెరిగినందున, ఉత్పత్తులపై ఏక అంకె ధరల పెంపు ఉండొచ్చని నివేదిక తెలిపింది. వ్యక్తిగత సంరక్షణ, గృహ సంరక్షణ రంగాల్లో ముడి పదార్థాల ధరలు స్థిరంగా ఉన్నాయని వెల్లడించింది.'ఉత్పత్తుల విభాగం, సంస్థల వారీగా ఆదాయ వృద్ధిలో మార్పులు ఉండొచ్చు. ఎఫ్ అండ్ బీ విభాగం ఈ ఆర్థిక సంవత్సరంలో 8-9 శాతం వృద్ధి నమోదు చేయొచ్చు. గ్రామీణ గిరాకీ ఇందుకు దోహదం చేయనుంది. వ్యక్తిగత సంరక్షణ విభాగం 6-7 శాతం, గృహ సంరక్షణ విభాగం 8-9 శాతం మధ్య వృద్ధి నమోదు చేయొచ్చ'ని క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ రవీంద్ర వర్మ వెల్లడించారు. ఎఫ్ఎంసీజీ సంస్థలు ఇతర సంస్థలను కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నాయని, తద్వారా ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను విస్తరించాలనుకుంటున్నాయని నివేదిక తెలిపింది. రుతుపవనాలు, వ్యవసాయ ఆదాయాలపై ఆధారపడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో స్థిరమైన మెరుగుదల నమోదు కావడం ఈ రంగానికి కలిసి రావొచ్చని పేర్కొంది.

## భారత స్థిరాస్తిలోకి రూ.25,700 కోట్ల విదేశీ పెట్టుబడులు

దిల్లీ: ఈ ఏడాది జనవరి- జూన్ మధ్య భారత స్థిరాస్తి రంగంలో, విదేశీ పెట్టుబడిదారులు 3.1 బి.డాలర్ల (రూ.25,700 కోట్లు) పెట్టుబడులు పెట్టినట్లు స్థిరాస్తి కన్సల్టెంట్ జేఎల్ఎల్ ఇండియా వెల్లడించింది.మొత్తం సంస్థాగత పెట్టుబడుల్లో ఇవి 65 శాతానికి సమానం. జనవరి-జూన్‌లో స్థిరాస్తి రంగంలో మొత్తం సంస్థాగత పెట్టుబడులు 62% పెరిగి 4,760 మిలియన్ డాలర్లకు చేరాయి. ఏడాది క్రితం ఇదే సమయంలో ఇవి 2,939 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి.నీ జేఎల్ఎల్ ఇండియా ప్రకారం.. స్థిరాస్తిలో సంస్థాగత పెట్టుబడులు 4.8 బి.డాలర్లకు పెరిగాయి. అంతర్జాతీయ అనిశిత్చులు, ఎన్నికల సీజన్ ఉన్నప్పటికీ.. భారత్‌పై పెట్టుబడిదార్ల విశ్వాసాన్ని ఇది సూచిస్తోంది. నీ మొత్తం పెట్టుబడుల్లో.. గోదాముల విభాగంలో 34 శాతం పెట్టుబడులు వచ్చాయి. గృహాల వాటా 33 శాతం, కార్యాలయాల వాటా 27 శాతంగా ఉంది.నీ స్థిరాస్తి రంగంలో లావాదేవీల సంఖ్య దాదాపు రెట్టింపైంది. సగటు లావాదేవీ పరిమాణం 113 మిలియన్ డాలర్లుగా ఉంది.



# జీఎస్‌టీని 5 శాతం చేయండి

### ప్రభుత్వాన్ని కోరుతున్న పాలసీదారులుఅందరికీ బీమా అప్పుడే సాధ్యం - కొత్త బడ్జెట్‌పై ఆశలు

హైదరాబాద్: దేశంలో 2047 నాటికి అందరికీ బీమా అందించాలనే లక్ష్యాన్ని భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) విధించుకుంది.

జీవిత, ఆరోగ్య బీమా పాలసీలు ఇప్పుడు ఒక తప్పనిసరి అవసరంగా మారిపోయాయి. మరోవైపు వైద్య బీమా ప్రీమియం ఏటా 15 శాతం వరకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కొవిడ్ తర్వాత ఈ పాలసీలకు ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. కానీ, పెరిగిన ప్రీమియంతో చాలా మంది బీమాకు దూరం అవుతున్నారు. ఈ భారం నుంచి ఉపశమనం కలిగించాలంటే.. ఆరోగ్య బీమా పాలసీలపై వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)ను ప్రస్తుతం ఉన్న 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని పరిశ్రమ వర్గాలు, పాలసీదారులు కోరుతున్నారు.

రానున్న నాలుగేళ్ల కాలంలో సాధారణ బీమా రంగం 7.1 శాతం మేరకు వృద్ధి సాధించే అవకాశాలున్నాయని పలు నివేదికలు చెబుతున్నాయి. బీమా సంస్థల ప్రీమియం వసూళ్లు ఏటా 15 శాతం మేరకు పెరుగుతున్నాయి. ఇప్పటికీ బీమా రంగం విస్తృతి 5 శాతంలోపే ఉందని గణాంకాలు చెబుతున్నాయి. దీన్నిబట్టి, అందరికీ బీమా లక్ష్యం నెరవేరాలంటే ఈ రంగంలో విప్లవాత్మక మార్పులు తప్పవని జీఎస్‌టీతోనే దీన్ని ప్రారంభించాల్సిన అవసరం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

**5 శాతం వరకూ..**

ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్య బీమా అవసరం పెరిగిందన్న మాట వాస్తవం. కాబట్టి, ఈ పాలసీలపై ఉన్న జీఎస్‌టీని 18 శాతం నుంచి 5 శాతానికి పరిమితం చేయాలని సాధారణ బీమా ఏజెంట్ల సంఘం ప్రభుత్వానికి ప్రతిపాదనలను ఇచ్చింది. ఈ బడ్జెట్‌లో దీనిపై ఒక స్పష్టత ఇవ్వాలని కోరింది. ప్రీమియం రేట్లు పెరుగుతూ ఉండటంతో పాలసీల పునరుద్ధరణ తగ్గుతోందని ఈ సందర్భంగా పేర్కొంది. 'ఆరోగ్య బీమా పాలసీల పునరుద్ధరణ సగటున 65-75 శాతం మేరకే ఉంటోంది. దీనికి ప్రధాన కారణం, ప్రీమియం పెరగడం, జీఎస్‌టీ అధికంగా ఉండటమే' అని ఆర్థిక శాఖకు పంపిన బడ్జెట్ ప్రతిపాదనల్లో పేర్కొంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని, జీఎస్‌టీని తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతోంది.

**పరిమితి రూ.50,000**

వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియం పెరిగినందున ఆరోగ్య బీమా పాలసీల మినహాయింపు పరిమితిని రూ.50,000 వరకూ చేయాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. ప్రస్తుతం సెక్షన్ 80డీ కింద వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీలకు రూ.25,000 వరకే మినహాయింపు ఉంది. నలుగురున్న కుటుంబానికి రూ.10లక్షల ఫ్యామిలీ ఫ్లోటర్ తీసుకుంటే.. ప్రీమియం రూ.30,000 వరకూ ఉంటోంది. తల్లిదండ్రుల కోసం తీసుకున్న పాలసీలకూ ప్రీమియం భారీగానే చెల్లించాల్సి వస్తోంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని, బీమా ప్రీమియం మినహాయింపు పరిమితిని రూ.50,000కు పెంచాల్సిన అవసరం ఉందని పాలసీదారులు భావిస్తున్నారు. ఆరోగ్య బీమా వరకూ కొత్త పన్ను విధానంలోనూ మినహాయింపును అనుమతించాలని బీమా రంగ నిపుణులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| | |
|---|---|
| ₹67,650 (22 క్యారెట్లు) | ₹73,800 (24 క్యారెట్లు) |

చెన్నై

| | |
|---|---|
| ₹68,200 (22 క్యారెట్లు) | ₹74,400 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 99,300

# బుల్‌ను మించిన బంగారం

**నిఫ్టీ 50 కంటే పసిడిపై ఎక్కువ ప్రతిఫలంజనవరి-జూన్‌లో 14%**

**ఎన్ఎస్ఈ ప్రామాణిక సూచీ రాణించింది 11 శాతమే**

ప్రస్తుత సంవత్సరం తొలి అర్ధభాగంలో అటు స్టాక్ మార్కెట్, ఇటు బంగారం సానుకూలతలనే అందించాయి.

ఈ రెండింటిలో పెట్టుబడి పెట్టిన మదుపర్లకు మంచి లాభాలే వచ్చాయి. అయితే ఎన్ఎస్ఈ ప్రామాణిక సూచీ అయిన నిఫ్టీ 50కి మించి సంప్రదాయ పెట్టుబడి సాధనమైన పసిడి అధిక ప్రతిఫలాలను ఇవ్వడమే ఇక్కడ విశేషం. జనవరి-జూన్‌లో నిఫ్టీ-50 సూచీ 11% లాభపడితే.. బంగారం 14% ప్రతిఫలాలను మదుపర్లకు అందించింది.

**రెండూ భిన్న పెట్టుబడి సాధనాలు**

పసిడిని సురక్షిత పెట్టుబడి సాధనంగా భావిస్తుంటారు. మరోవైపు ఈక్విటీలు నష్టభయంతో కూడుకున్నవి. ఆర్థిక వ్యవస్థ రాణించడం, రాజకీయ స్థిరత్వం లాంటి అంశాలు స్టాక్ మార్కెట్‌కు సానుకూలం. అధిక ద్రవ్యోల్బణం, స్థూల ఆర్థిక పరిస్థితుల్లో అనిశ్చితి, తక్కువ వడ్డీ రేట్ల లాంటి పరిస్థితులు, బంగారం ధర పెరిగేందుకు తోడ్పడతాయి. ఈ ఏడాదిలో పసిడి ధరకు కలిసొచ్చిన అంశాలేమిటంటే..

అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కీలక రేట్లను అమెరికా తగ్గించొచ్చనే అంచనాలు.

కొన్ని దిగ్గజ దేశాల కేంద్రీయ బ్యాంకులు పసిడిని ) దూకుడుగా కొనుగోలు చేస్తుండం.(ఉదాహరణకు 2023 డిసెంబరు 29 నాటికి ఆర్‌బీఐ వద్ద 49.328 బిలియన్ డాలర్ల విలువైన పసిడి (%+శీశ్రీ౯%) నిల్వలు ఉండగా.. ఈ ఏడాది జూన్ 7 నాటికి ఇవి 56.982 బిలియన్ డాలర్ల స్థాయికి చేరాయి.)

చైనా 18 నెలలుగా భారీగా పసిడిని కొనుగోలు చేయడం.

అమెరికా, ఐరోపా దేశాల్లో ఆర్థిక అనిశ్చితులు.

ఈ జోరు ఎందాకా?

పసిడి జోరు మున్ముందూ కొనసాగే అవకాశం ఉందని చాలా మంది విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలం పొందేందుకు, పసిడి ఓ ఉత్తమ పెట్టుబడి మార్గంగా చెబుతున్నారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కేంద్రీయ బ్యాంకుల పసిడి కొనుగోళ్లు, స్థూల ఆర్థిక అనిశ్చితులు కొనసాగనుండటంబీ అమెరికా ఫెడ్ కీలక రేట్లను తగ్గించే అవకాశం ఉండటం, చైనాలో అధిక గిరాకీ పరిస్థితులు లాంటివి పసిడికి మున్ముందూ కలిసి వస్తాయని విశ్లేషిస్తున్నారు.

**ఇవి కీలకం**

'గత అయిదేళ్లలో దేశీయంగా పసిడి ధరలు రెట్టింపు అయ్యాయి. 2003 నుంచి చూస్తే, బంగారం ధర 980 శాతానికి పైగా పెరిగింది. లోహ రూపంలో కొనడానికైనా.. పెట్టుబడి అవసరాల కోసమైనా పసిడికి గిరాకీ స్థిరంగా కొనసాగుతోంద'ని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమొడిటీస్ విభాగ హెడ్ హరీశ్ వి చెబుతున్నారు. అంతర్జాతీయ విపణుల్లో పసిడికి కొన్ని ప్రతికూలతలూ ఎదురయ్యే అవకాశం ఉన్నందున, ఇకపై పసిడి ధర మరీ ఎక్కువగా పెరిగే అవకాశాలు తక్కువేనని అంటున్నారు. పరిమిత శ్రేణికి లోబడే ధరలు కదలాడొచ్చని అంచనా వేస్తున్నారు.

**త్వరలో 10 గ్రాములు రూ.78,000కు**

'భారత విపణిలో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర త్వరలోనే రూ.78,000ను తాకే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలో ఔన్సు (31.10 గ్రా.) పసిడి ధర 2,500 డాలర్ల దిశగా



అడుగులు వేయొచ్చ'ని ఏంజెల్ వన్ లిమిటెడ్‌లో కరెన్సీ, వ్యవసాయేతర కమొడిటీల పరిశోధన విభాగానికి చెందిన పార్థమేశ్ మాల్యా అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం 10 గ్రాముల పసిడి ధర రూ.74,000 దరిదాపుల్లో ఉంది.

**పెట్టుబడుల్లో 10-15% పెట్టడం మేలు**

మదుపర్లు తమ పెట్టుబడుల్లో 10-12 శాతాన్ని పసిడికి కేటాయించాలని హరీశ్ సూచిస్తున్నారు. ధర దిద్దుబాటు అయిన సమయంలో పసిడి కొనుగోలుకు మొగ్గు చూపడం మంచిదని సలహా ఇస్తున్నారు. పెట్టుబడుల్లో వైవిధ్యం ఉండాలంటే కనీసం 15 శాతమైనా పసిడిపై పెట్టాలని మాల్యా అంటున్నారు. పసిడి ధరలు పెరగడం వల్ల ఆభరణాలు తనఖా పెట్టుకుని, అధిక రుణం పొందే వీలు ఏర్పడటమే కాకుండా, ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యలభ్యత పెరిగేందుకు దోహదం చేస్తోందని యునిమోనీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈఓ, డైరెక్టర్ కృష్ణన్ చెబుతున్నారు.

# గృహ పథకానికి రూ.55,000 కోట్ల సబ్సిడీ!

### 2023-24 కంటే 50% అధికం



దిల్లీ: రాబోయే బడ్జెట్‌లో గ్రామీణ గృహ పథకానికి సబ్సిడీల కేటాయింపును 50 శాతం మేర పెంచి సుమారు రూ.55,000 కోట్లకు చేర్చే అవకాశం ఉందని ఈ పరిణామాన్ని దగ్గర నుంచి గమనిస్తున్న వర్గాలు తెలిపాయి. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో భాజపాకు ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడం ఇందుకు నేపథ్యమని పేర్కొన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ గృహ పథకానికి రూ.32,000 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం ఇచ్చింది. గ్రామాల్లో రహదారుల అభివృద్ధి, వ్యవసాయ రంగంపై ఆధారపడుతున్న లక్షలాది మంది యువతకు ఉద్యోగ కల్పన కార్యక్రమాలు చేపట్టడం సహా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపై అధికంగా వ్యయ కేటాయింపులు చేయాలన్నది ప్రభుత్వం ఉద్దేశం. ఇందులో భాగంగానే గ్రామీణ గృహ పథకానికి సబ్సిడీని పెంచే యోచనను ప్రభుత్వం చేస్తోందని ఆ వర్గాలు తెలిపాయి. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే గ్రామీణ గృహ పథకం ప్రారంభమైన 2016 తర్వాత ఇంత భారీ మొత్తంలో వార్షిక కేటాయింపులను పెంచడం ఇదే తొలిసారి అవుతుంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన(గ్రామీణ) గృహ పథకం కింద ప్రభుత్వం గత ఎనిమిదేళ్లలో పేద కుటుంబాలకు సుమారు 2.6 కోట్ల గృహాలను మంజూరు చేసింది. వచ్చే కొన్నేళ్లలో అదనంగా 2 కోట్ల గృహాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఒత్తిడిలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ: 'అధిక ద్రవ్యోల్బణం, రైతుల ఆదాయాల వృద్ధిలో స్తబ్దత కారణంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఒత్తిడిలో ఉందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంద'ని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అందువల్ల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెలలో ప్రకటించబోయే బడ్జెట్‌లో కేవలం గ్రామీణ గృహ పథకానికే కాకుండా ఇతర గ్రామీణ రంగ పథకాలకు కూడా గణనీయ స్థాయిలో కేటాయింపులను పెంచే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ కల్పన కార్యక్రమానికి ప్రభుత్వం రూ.86,000 కోట్ల మేర వ్యయ కేటాయింపులు చేయొచ్చని ఇంతకుమునుపు అంచనా వేయగా.. ఇప్పుడు దానికి మించే కేటాయిస్తుందని భావిస్తున్నట్లు పేర్కొన్నాయి. అయితే ఈ అదనపు వ్యయ కేటాయింపులకు పార్లమెంట్ అనుమతిని ప్రభుత్వం తీసుకోవాల్సి రావొచ్చు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ రహదారులపై వ్యయ కేటాయింపులను ఇంతకుమునుపు రూ.12,000 కోట్లుగా అంచనా వేయగా.. ఈ మొత్తాన్ని పెంచుతూ ప్రత్యేక ప్రతిపాదనను కూడా బడ్జెట్‌లో చేసే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి.

# 501 ఒప్పందాలు.. 21.4 బి.డాలర్లు

### కార్పొరేట్ల రికార్డు లావాదేవీలురెండో త్రైమాసికంపై గ్రాంట్ థార్న్‌టన్ నివేదిక



దిల్లీ: ప్రస్తుత ఏడాది రెండో త్రైమాసికం(ఏప్రిల్-జూన్)లో భారత కార్పొరేట్లు మొత్తం 501 ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

వీటి విలువ 21.4 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1.77 లక్షల కోట్లు)గా ఉందని గ్రాంట్ థార్న్‌టన్ భారత్ డీల్‌ట్రాకర్ పేర్కొంది. ఈ కన్సల్టెన్సీ సంస్థ నివేదిక ప్రకారం..

రెండేళ్లలోనే అత్యధిక త్రైమాసికం వారీ లావాదేవీలు ఈ ఏప్రిల్-జూన్‌లో నమోదయ్యాయి. భారీ విలీన-కొనుగోలు (ఎం అండ్ ఏ) లావాదేవీలు లేకపోవడంతో విలువ మాత్రం తగ్గింది.

ఎం అండ్ ఏ, పీఈ ఒప్పందాలు మొత్తం 467 నమోదయ్యాయి. వీటి విలువ 14.9 బిలియన్ డాలర్లుగా ఉంది. అంతక్రితం త్రైమాసికంతో పోలిస్తే ఈ ఒప్పందాల సంఖ్య 9 శాతం మేర పెరిగింది.

కానీ విలువ పరంగా 28 శాతం తగ్గింది. తొలి త్రైమాసికంలో రిలయన్స్-డిస్నీ మెగా విలీనం(8.5 బి. డాలర్లు) చోటు చేసుకోవడం ఇందుకు కారణం.

జూన్ త్రైమాసికంలో బిలియన్ డాలర్ల ఒప్పందం ఒకటే కనిపించింది. అయితే అధిక విలువ గల ఒప్పందాలు (100 మి.డాలర్లకు పైగా) మాత్రం 30 నమోదయ్యాయి.

అంతక్రితం త్రైమాసికంతో పోలిస్తే ఇవి 58 శాతం అధికం.

భారత కార్పొరేట్లు దేశీయంగా ఎక్కువ పెట్టుబడులు పెడుతుండడం.. స్థానిక పెట్టుబడుల వాతావరణంపై వారికున్న విశ్వాసాన్ని సూచిస్తోంది.

అంతర్జాతీయ అనిశ్చితులు, అస్థిరత కారణంగా బయటి దేశాలతో ఒప్పందాలు తగ్గినా.. ఫార్మా, తయారీ వంటి సంప్రదాయ రంగాల్లో ఒప్పందాలు పెరిగాయి.

మొత్తం విలువలో వీటి వాటానే సగం కావడం విశేషం.

రాబోయే ఆరు నెలల్లో ఒప్పందాలు పెరగవచ్చు. ఎన్నికల ఫలితాల వెలువడడంతో విధాన స్పష్టతపై అంచనా, త్వరలోనే పూర్తి స్థాయి బడ్జెట్ రానుండడం, రాజకీయ స్థిరత్వం కనిపిస్తుండడం.. తదితరాలు పెట్టుబడిదార్ల విశ్వాసాన్ని పెంచవచ్చు.

జనంసాక్షి

# జాతీయం అంతర్జాతీయం

## ప్రైమ్ డే సేల్‌లో శాంసంగ్, ఐకూ కొత్త ఫోన్లు.. మోటో ఫోల్డబుల్‌పై డిస్కౌంట్

ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ప్రైమ్ డే సేల్ తేదీలను ఇప్పటికే ప్రకటించింది.ప్రైమ్ మెంబర్ల కోసం ఎక్స్‌క్లూజివ్‌గా జులై 20, 21 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ సేల్‌లో ల్యాప్‌టాప్స్ వంటి ఎలక్ట్రానిక్ ఉత్పత్తులతో పాటు ఇతర ప్రొడక్టులపైనా డిస్కౌంట్లు లభించనున్నాయి. శాంసంగ్, ఐకూ, మోటోరోలా స్మార్ట్‌ఫోన్లపై ఆఫర్లు ఉండనున్నాయి. తాజాగా భారత్ మార్కెట్‌లో లాంచ్ చేసిన మోటోరోలా రేజర్ 50 అల్ట్రా పై ఈ సేల్‌లో పెద్ద ఎత్తున డిస్కౌంట్ పొందొచ్చు. 12 GB ర్యామ్ ం 512 GB స్టోరేజీ వేరియంట్‌ను రూ.99,999తో మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. సేల్ సమయంలో ఈ మడత ఫోన్‌పై రూ.10వేలు తగ్గింపు అందించనుంది. అంటే రూ.89,999కే కొనుగోలు చేయొచ్చన్నమాట. ఆసక్తి ఉన్న వాళ్లు జులై 10 నుంచే ప్రీ రిజర్వేషన్ చేసుకోవచ్చని అమెజాన్ తెలిపింది. త్వరలో లాంచ్‌కి సిద్ధంగా ఉన్న శాంసంగ్ గెలాక్సీ ఎం35, ఐకూ జెడ్9 లైట్ 5జీ, హానర్ 200 5జీ, హానర్ 200 ప్రో 5జీ, లావా బ్లేజ్ ఎక్స్ స్మార్ట్‌ఫోన్లు ప్రైమ్ సేల్‌లో అందుబాటులో రానున్నాయి. సుమారు 450కి పైగా బ్రాండ్లు వేలాది కొత్త ప్రొడక్టులను సేల్‌లో లాంచ్ చేయనున్నట్లు అమెజాన్ వెల్లడించింది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై 40శాతం వరకు తగ్గింపు పొందొచ్చని వెబ్‌సైట్‌లో పేర్కొంది. 24 నెలల పాటు నో కాస్ట్ ఈఎంఐ, ఎంచుకొన్న ఉత్పత్తులపై ఎక్స్ఛేంజ్ ఆఫర్ ఇవ్వనుంది. ఈ సేల్‌లో ఐసీఐసీఐ, ఎస్‌బీఐ డెబిట్/ క్రెడిట్ కార్డులపై 10 శాతం, అమెజాన్ పే క్రెడిట్ కార్డు వినియోగదారులకు 5 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. కొత్తగా ఈ కార్డు తీసుకునే వారికి ప్రైమ్ మెంబర్లకు వెల్‌కమ్ రివార్డుల కింద రూ.2,500 వరకు ప్రయోజనాలను అమెజాన్ అందించనుంది.

## జలపాతం చూసేందుకు వెళ్లి.. వరదలో చిక్కుకొని!

పనాజీ: ఓ జలపాతం చూసేందుకు వెళ్లిన టూరిస్టులకు ఊహించని పరిణామం ఎదురైంది. భారీ వర్షాల కారణంగా సమీపంలోని నది నీటి మట్టం ఒక్కసారిగా పెరిగింది. దీంతో దాదాపు 80 మంది వరదలోనే చిక్కుకుపోయారు.రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు వారిని రక్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ ఘటన గోవా లో చోటు చేసుకొంది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..గోవాలోని సత్తారి తాలూకాలోని పాలి జలపాతానికి ఆదివారం భారీ సంఖ్యలో పర్యాటకులు వెళ్లారు. జలపాతాన్ని చేరుకోవాలంటే ముందుగా ఓ నదిని దాటాల్సి ఉంటుంది. ఆదివారం కావడంతో భారీ సంఖ్యలో అక్కడి చేరుకున్నారు. అప్పటికే భారీ వర్షం రావడంతో నది నీటి మట్టం ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో 80 మంది అక్కడే చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న సహాయక బృందాలు రంగంలోకి దిగాయి.ఘటనాస్థలానికి చేరుకుని బాధితులను కాపాడేందుకు చర్యలను ముమ్మరం చేసాయి. ఇప్పటివరకు 50 మందిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. మరో 30 మంది అక్కడే చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. వారిని రక్షించేందుకు శ్రమిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అక్షత్ కౌశల్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
08.07.2024



### మున్సిపల్ చైర్మన్‌కి ఘన సన్మానం

**మంథని (జనంసాక్షి) :** నిత్యం ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఉదయం సాయంత్రం ఓపెన్ జిమ్ తో పాటు వాకింగ్ చేసే అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ చైర్మన్ రమ సురేష్ రెడ్డితో పాటు వైస్ చైర్మన్ ను సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ నేటి రోజుల్లో ఆరోగ్య సంరక్షణ కోసం వ్యాయామాలు తప్పనిసరి అయినవని తెలిపారు. ఓపెన్ జిమ్ అభివృద్ధికి పరిరక్షణకు ఎల్లవేళలా తమ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశారు. ఇప్పటికే చిల్డ్రన్ పార్క్ లో టాయిలెట్స్ వాకింగ్ ట్రాక్ కు సంబంధించి ప్రతిపాదనలు సైతం పంపడం జరిగిందని వీటిని పూర్తిచేసి ప్రారంభించి మార్నింగ్ వాకర్స్ కి అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ప్రతిరోజు మున్సిపల్ సిబ్బందితో జిమ్ చుట్టు పక్కల పారిశుద్ధ్యానికి సంబంధించినటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఇంకేమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో పరిష్కరిస్తామని తెలిపారు.వరంగల్ యూనిట్ లో భాగంగా ఉన్నటువంటి ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ను కరీంనగర్ యూనిట్ గా విస్తరించుకోవడం కోసం అందులో సభ్యులుగా చేరడానికి మంథని ఓపెన్ జిమ్ అండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులను ఆహ్వానించడం జరిగింది. అసోసియేషన్ నిలబడితే అనేక ఆరోగ్య సంరక్షణకు సంబం ధించిన కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చునని తెలిపారు.

### ఎస్ఆర్ఎస్ఎం-2024 ప్రారంభం..

**గోదావరిఖని, జనంసాక్షి :**సదరన్ రీజియన్ స్పోర్ట్స్ మీట్-2024ని ఎన్టీపీసీ రామగుండం అండ్ తెలంగాణలో కేదార్ రంజన్ పాండు, ప్రెసిడెంట్ చిన్మోయిదాస్, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ సంతోష్‌తివారీ,సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, ఎన్‌బీసీ మెంబర్ బాబర్ సలీం పాషా ప్రారంభించారు .సీనియర్ సభ్యులు, యూనియన్, అసోసియేషన్ల ప్రతినిధులు,ఇతర అధికారులు ప్రారంభించారు. ఈనెల 7 నుంచి 10 వరకు నాలుగు రోజులు టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.ఈ సందర్భంగా రామగుండం, తెలంగాణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు మాట్లాడుతూ 4 సంవత్సరాల తరువాత ఎస్ఆర్ఎస్ఎం-2024 నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆటగాళ్లందరూ ఓత్..టార్చ్ నడిపారు. మహిళా ఉద్యోగుల కోసం బ్యాడ్మింటన్ టోర్నమెంట్, పురుషుల కోసం క్రికెట్ నిర్వహించామన్నారు.దక్షిణ ప్రాంతంలోని 5 ప్రాజెక్టుల నుండి 100 మందికి పైగా క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రామగుండం బ్యాడ్మింటన్ (సింహాద్రిపై), క్రికెట్ (కుడ్గిపై) రెండింటిలోనూ మొదటి మ్యాచ్‌లో విజయం సాధించింది.

**బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా..**

### ఐఎన్‌టీయూసీ కోర్ కమిటీ సమావేశం..



**గోదావరిఖని, జనంసాక్షి :**ఎన్టీపీసీ లక్ష్మినంసింహ గార్డెన్స్‌లో ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ నాయకత్వం లో కేంద్ర ప్రభుత్వ బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగ ఐఎన్‌టీయూసీ కోర్ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు.రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా యూనియన్ పరంగా తీసుకొనే పలు విషయాలపై చర్చించారు. అలాగే మన బొగ్గు మన హక్కు నినాదంతో సింగరేణి వ్యాప్తంగా చేపట్టబోయే సింగరేణి పరిరక్షణ రణభేరి యాత్ర ప్రారంభం గురించి సింగరేణి వ్యాప్తంగా అన్ని బొగ్గు గనులలో జరుగుతున్న ప్రమాదాలు,వాటి నివారణ కోసం తీసుకోవలసిన (సేఫ్టీ) నిర్ణయాల గురించి,అలాగే సింగరేణి వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్ కార్మికుల కోసం ఐఎన్‌టీయూసీ సింగరేణి కాంట్రాక్ట్ యూనియన్ ప్రారంభించి వారి హక్కుల కృషి కోసం పోరాడాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది.అలాగే యూనియన్ బలోపేతం కోసం సంబంధించిన పలు విషయాలపై చర్చించారు.సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహారెడ్డి , సిద్దం శెట్టి రాజమౌళి , ధర్మపురి, జనరల్ సెక్రెటరీలు త్యాగరాజన్,అక్రం, సెంట్రల్ క్యాంపెనింగ్ ఇంఛార్జి వికాస్ కుమార్ యాదవ్, సెంట్రల్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నరేందర్, మహిళ అధ్యక్షరాలు శేషారత్నం, జిల్లా అధ్యక్షులు దాస్, ఫెడరేషన్ నాయకులు భీంరావ్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్లు అక్బర్‌అలి, కలవెన శ్యామ్, గరిగ స్వామి, పేరం రమేష్, సెంట్రల్ జాయింట్ జనరల్ సెక్రెటరీలు అరేపల్లి శ్రీనివాస్, ఆల్బర్ట్, మెహబూబ్, సత్యనారాయణ, సెంట్రల్ సెక్రెట రీ పోచయ్య, లక్షన్, మైనింగ్ స్టాఫ్ నాయకులు రఘుపతి రెడ్డి, సదానందం,సత్యనారాయణరెడ్డిపాల్గొన్నారు.

# శరవేగంగా కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారి పనులు

**15 రోజుల్లో విస్తరణ పనులకు టెండర్లు**

**40 శాతం పూర్తయిన భూసేకరణ**

- శరవేగంగా కొనసాగుతున్న కరీంనగర్ - వరంగల్ పనులు
- 37 శాతం పూర్తి... వచ్చే ఏడాది జూలై నాటికి పనులు పూర్తి.
- జాతీయ రహదారుల విస్తరణపై బండి సంజయ్ స్పెషల్ ఫోకస్.
- పనులపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో కేంద్ర మంత్రి సమీక్ష
- నిర్ణీత గడువులోగా విస్తరణ పనులను పూర్తి చేయాలని ఆదేశం



**కరీంనగర్ బ్యూరో, జులై 07 (జనంసాక్షి)** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారి విస్తరణ పనులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రధానంగా కరీంనగర్ - జగిత్యాల, కరీంనగర్ - వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులపై ఫోకస్ పెట్టారు. ఆదివారం రోజు కరీంనగర్ లోని తన కార్యాలయంలో ఎన్ హెచ్ ఏఐ అధికారులతో సమావేశమయ్యారు. కరీంనగర్ నుండి వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులు ఎంత వరకు వచ్చాయి? ఎదురవుతున్న ఇబ్బందులేమిటి? ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారు? అట్లాగే కరీంనగర్ నుండి జగిత్యాల వరకు జాతీయ రహదారుల విస్తరణ పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతోంది? భూసేకరణ ఎంత వరకు వచ్చింది? టెండర్ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభిస్తారు? పనులెప్పుడు మొదలుపెడతారు? ఈ విషయంలో ఎదురువుతున్న ఇబ్బందులేమిటి? అనే అంశాలపై అధికారులతో చర్చించారు. కరీంనగర్ - జగిత్యాల జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధించి 15 రోజుల్లోపు టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుందని బదులిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రూపొందించిన వంద రోజుల ప్రణాళికలో కరీంనగర్ - జగిత్యాల రహదరి విస్తరణ పనుల అంశం ఉండటంతో సెప్టెంబర్ లోగా టెండర్ ప్రక్రియను పూర్తి చేసుకుని పనులను ప్రారంభించే అవకాశాలున్నాయని తెలిపారు. ఈ రహదారికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ 40 శాతం మేరకు పూర్తయ్యిందని, త్వరలోనే భూసేకరణ ప్రక్రియను సైతం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రహదారి విస్తరణలో భాగంగా మూడు ప్రాంతాల్లో బైపాస్ రోడ్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు రూ.2,227 కోట్ల అంచనా వ్యయంతో 58 కి.మీల పొడవున చేపట్టే విస్తరణ పనుల్లో భాగంగా 6 మేజర్, 18 మైనర్ బ్రిడ్జిలతోపాటు195 కల్వర్టులను నిర్మించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా భూసేకరణలో ఎదురువుతున్న ఇబ్బందులను అధికారులు ప్రస్తావించగా సంబంధిత జిల్లా కలెక్టర్, ఇతర శాఖల అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని మంత్రి పేర్కొన్నారు.అంతకుముందు కరీంనగర్ నుండి వరంగల్ వరకు జాతీయ రహదారి విస్తరణ పనుల పురోగతిపై మంత్రి బండి సంజయ్ ఆరా తీయగా "ఇప్పటి వరకు 37 శాతం పూర్తయ్యాయి. 2025 జులై నాటికి విస్తరణ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కరీంనగర్ నుండి వరంగల్ వరకు 68.015 కి.మీల మేరకు జాతీయ రహదారి విస్తరణ పనులు 37 శాతం మేరకు పూర్తయ్యాయన్నారు. వచ్చే ఏడాది జులై నాటికి విస్తరణ పనులను పూర్తి చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయన్నారు. అందులో భాగంగా మానకొండూ రు, తాడికల్, హుజూరాబాద్, ఎల్కతుర్తి, హ సన్ పర్తి వద్ద బైపాస్ లను నిర్మించనున్నట్లు తెలిపారు. 29 మైనర్ జంక్షన్లను నిర్మించను న్నామన్నారు. గట్టుదుద్దెనపల్లి, చెంజర్ల లో భూ సేకరణ విషయంలో కొంత ఇబ్బంది ఏర్పడిందని పేర్కొన్నారు. వెంటనే కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో ఫోన్ లో మాట్లాడారు. కరీంనగర్ ఆర్డీవో ను పిలిపించి భూ సేకరణ సమస్యను పరిష్కరించాలని సూచించారు. అట్లాగే కొన్నిచోట్ల సర్వీస్, స్ట్రక్చరల్ రోడ్ల ఏర్పాటుపై ప్రజల నుండి వినతులు అందుతున్నాయని అధికారులు పేర్కొనడంతో ప్రజలకు, రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాజెక్టు డైరెక్టర్ మాధవి, అధికారులు క్రిష్ణారెడ్డి, నిర్మాణ సంస్థ ప్రతినిధులు రమేశ్ త్రిపాఠి, కమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు రుణపడి ఉంటాం

- రాజకీయాలలో,గెలుపోటములు సహజం
- ప్రజా సేవకులకు పదవీ విరమణ ఉండదు
- ఆత్మీయ వీడ్కోలు ఎంపీపీ, జెడ్పీటీసీలు



**మానకొండూరు ఆర్‌సి (జనంసాక్షి):** తమను గెలిపించి, ఐదు సంవత్సరాల పాటు, సేవ చేసే అవకాశం కల్పించిన ప్రజలకు రుణపడి ఉంటామని కరీంనగర్ జిల్లా పరిధిలోని భారత రాష్ట్ర సమితి పార్టీ జడ్పీటీసీలు, ఎంపీపీలు వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి, పునాది వేసిన పార్టీలో భాగస్వాములైనందుకు గర్వపడుతున్నామన్నారు. ప్రజా సేవకులకు, లీడర్లకు రిటైర్మెంట్ ఉండదని, శాయశక్తుల కృషిచేసి ప్రజా సమస్యలు, వెతలను తీర్చడానికి ఎల్లవేళలా ముందుంటామని తెల్చి చెప్పారు. ఆదివారం భారత రాష్ట్ర సమితి పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు ఆధ్వర్యంలో గులాబీ సైన్యం లో భాగస్వాములైన జడ్పిటిసి, ఎంపీపీల ఆత్మీయ వీడ్కోలు సమావేశం జరిగింది. మాజీ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్, కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యేలు వోడితెల సతీష్ కుమార్, రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, మాజీ జెడ్పి చైర్ పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ సునీల్ రావ్, పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, పార్టీ మండలాధ్యక్షులు, హాజరయ్యారు. ఎంపీపీలు , జడ్పీటీసీలను ఘనంగ సన్మానించారు. అంతకుముందు పార్టీ అధ్యక్షులు జీవీరామకృష్ణారావు అతిథులకు స్వాగతం పలికారు. పార్టీ బలోపేతానికి కృషి చేసి, కరీంనగర్ జిల్లాలో పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భారత రాష్ట్ర సమితి పార్టీకి మూల స్తంభాలుగా నిలిచి వెన్నుదన్నుగా వారి అనుభవాన్ని, రంగరించి రాజకీయ చతురత చూపిన ప్రజాప్రతినిధుల కృషిని కొనియాడారు. ఆత్మీయ వీడుకోలు సమావేశం పదవికి మాత్రమేనని, ప్రజా జీవితం నుండి కాదని తేల్చి చెప్పారు. అనంతరం సమావేశంలో పలువురు ఎంపీటీసీలు, జడ్పిటిసిలు వారి అనుభవాలను పంచుకున్నారు.అధికారంలో ఉన్న, లేకున్నా అంతిమ లక్ష్యం ప్రజాసేవయేనని స్పష్టం చేశారు. కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మాజీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, కుర్మాచలం అనీల్, మాజీ గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనీల్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గోపాల్ రావు, బీఆర్ఎస్ జిల్లా మండల నాయకులు సమావేశానికి హాజరయ్యారు.

## వెలిచాలను విమర్శించే స్థాయి సునీల్‌రావుకు లేదు

- సీనియర్ కాంగ్రెస్ నాయకులు గండి రాజేశ్వర్



**కరీంనగర్‌బ్యూరో(జనంసాక్షి) :** కాంగ్రెస్ నాయకులు రాజేందర్ రావు ను విమర్శించే స్థాయి మేయర్ సునీల్ రావు కు లేదని గండి రాజేశ్వర్ అన్నారు. ఆదివారం నాడు కరీంనగర్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తస్మాత్ జాగ్రత్త నీది అంతా నీచ రాజకీయం, అవకాశవాద రాజకీయలతో పదవులు పొందే నీకు మాజీ ఎమ్మెల్యేజగపతి రావు కొడుకు రాజేందర్ రావును విమర్శించే స్థాయి నీకెక్కడిదని ప్రశ్నించారు. నీ చరిత్ర ఎలాంటిదో అందరికీ తెలుసునని ఆయన హేద్దేవా చేశారు. వ్యక్తిగత విమర్శలు మానుకోమనిసూచిం చారు. వ్యక్తిగత చరిత్ర లేకున్నప్పటికీ నీకు రాజకీయ బిక్ష పెట్టింది జగపతిరావు కాదా అని ప్రశ్నించారు. నువ్వు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు ఆకారపు భాస్కర్ రెడ్డికి రావాల్సిన మార్కెట్ కమిటీ చేర్మెన్ పదవిని నువ్వు లాక్కొని అనుభవించలేదా అని అన్నారు. మంచి వ్యక్తి అయిన రాజేంద్ర రావును అనడం సరైంది కాదని అన్నారు. టీఆర్ఎస్ పార్టీలో విశ్వా సనీయత లేక పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పని కిరాని తెలివి తక్కువ మాటలు మాట్లాడవద్దని జాగ్రత్త అని హెచ్చరించారు. మొన్నటి వరకు మాజీ మంత్రి గంగుల కమలాకర్ , వినోద్ కుమార్‌లతో.. నేడు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు వత్తాసు పలుకుతూ పబ్బం గడుపు కొంటున్నావ్ ఇదేనా నీ చరిత్ర అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ లింగం పల్లి శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో కమలం వికసించాలి

**మాజీ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బీబీపాటిల్**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** మోది కి మద్దతుగా కమలం గుర్తుకు ఓటు వేసిన వారికి ధన్యవాదాలు తెలుపుతూ,ఇదే స్పూర్తిని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కొనసాగించాలని, నియోజకవర్గంలోని అన్ని స్థానాలు గెలవాలని, జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు బిబి పాటిల్ అన్నారు. తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు సంతృప్తినిచ్చాయని,నిస్వార్థంగా పని చేసి కామారెడ్డి లో 19 వేల మెజారిటీ తెచ్చిన కార్యకర్తలకు ధన్యవాదాలని,వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణలో అధికారం సాధించే దిశగా బీజేపీ అడుగులు వేయాలని, జహీరాబాద్ పార్లమెంట్ ప్రభారి పెద్దోళ్ల గంగారెడ్డి పిలుపునిచ్చారు.జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సమీక్షా సమావేశాలలో భాగంగా కామారెడ్డి జిల్లా కార్యాలయంలో కామారెడ్డి అసెంబ్లీ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీ బిబి పాటిల్ మాట్లాడుతూ మోది కి మద్దతుగా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి కృషితో కామారెడ్డిలో బీజేపీ కి అత్యధికంగా ఓట్లు వచ్చాయని కానీ మిగితా చోట్ల ప్రజల్ని ఆకట్టుకోలేక పోయామని అన్నారు. కామారెడ్డి నియోజకవర్గ కార్యకర్తలు ఇదే స్పూర్తి తో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలవాలనీ ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన పెద్దోళ్ల గంగారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు సంతృప్తినిచ్చాయని,జహీరాబాద్ పార్లమెంట్ కూడా గెలుపు అంచుల్లో ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో నిస్వార్థంగా పని చేసి19 వేల మెజారిటీ తెచ్చిన కార్యకర్తలకు, నాయకత్వం వహించిన స్థానిక ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణలో అధికారం సాధించే దిశగా బీజేపీ అడుగులు వేస్తుందని అందుకు కార్యకర్తలు ఇప్పటి నుండే సిద్ధం కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ కాసర్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఆకుల భరత్, కౌన్సిలర్ నరేందర్, నాయకులు సంధ్య, వేణు, బాల్ రాజు, అనిత, నెహల్, మండల అధ్యక్షులు సురేష్, అనిల్, రమేష్, భూపాల్, రంజిత్ గౌడ్, శ్రీనివాస్, సరోజ, లతో పాటు 200 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## మినీఅంబేద్కర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయండి

**అసంపూర్తిగా పనులు చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి**

**ఎమ్మెల్యేకు, మేయర్‌కు బొంకూరి మధు వినతి**

**గోదావరిఖని, జనంసాక్షి:** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లోని 31 వ డివిజన్ శివాజీ నగర్ లో నిర్మాణం చేపట్టకుండా అసంపూర్తిగా వదిలిపెట్టిన డివిజన్ కు చెందిన మినీ అంబేద్కర్ భవన నిర్మాణం విషయంలో రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, మేయర్ బంగి అనిల్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని భవనాన్ని పూర్తి చేయవలసిందిగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, సభ్యులు బొంకూరు మధు, విజ్ఞప్తి చేశారు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 31 వ డివిజన్ శివాజీ నగర్ లోని అంబేద్కర్ భవన నిర్మాణ పనులను, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్,కాంపల్లి సతీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇరుగురాల కృష్ణయ్య తో కలిసి పరిశీలించారు, ఫ్లోరింగ్ చేయించకుండా షట్టర్ కు, పైన కప్పు బిగించకుండా, కరెంటు పనులు పూర్తిస్థాయిలో చేపట్టకుండానే అర్ధాంతరంగా కాంట్రాక్టర్ వెళ్లిపోయాడని అన్నారు భవనంలో బాత్రూం టాయిలెట్స్, నిర్మించలేదని, టైల్స్ వెయ్యలేదని, తీసుకువచ్చిన టైల్స్ తిరిగి తీసుకువెళ్లాడని, మెట్లకు గ్రిల్స్ కూడా వేయలేదన్నారు. రూ.10 లక్షల భవన నిధులలో కనీసం రూ.7 లక్షల కూడా ఖర్చు కాలేదు అన్నారు.ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం విజ్ఞప్తి మేరకు,నాటి ఎమ్మెల్యే చందర్, మేయర్ డాక్టర్ అనిల్ కుమార్, కార్పొరేటర్ స్వరూప రామస్వామి లు ప్రత్యేక చొరవతో నిర్మాణం చేయించారన్నారు, ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని శివాజీ నగర్ దళిత ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగంలోకి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, 31వ డివిజన్ శివాజీ నగర్ అధ్యక్షులు పెద్దల్లి రామస్వామి ప్రధాన కార్యదర్శి, రవి, ఓదెలు, జిల్లా కోకన్వీనర్ ఆకునూరి బాలంకుష్, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల సమ్మయ్య, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్, శనిగరపు రామస్వామి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మంథని మండల కన్వీనర్, కాసిపేట పోషం, శంకర్, వెంకటేష్, రాచూరి నర్సయ్య, మహంకాళి హనుమంతు, కొమురయ్య, లింగయ్య పద్మ జుట్టు బూదమ్మ ఎర్ర మల్లమ్మ,, తదితరులు పాల్గొన్నారు.



## కదిలిన జగన్నాథ రథ చక్రాలు

శాంతి సౌఖ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ఈ యాత్ర ద్వారా భగవంతుడిని కోరుకుంటున్నా. మానవ సేవే మాధవ సేవ అనే సూక్తితో మా ప్రభుత్వం పని చేస్తుంది. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజంలో మార్పు వస్తుంది" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## విజేతలకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు

కు అర్హత సాధించిన 31,382 మందికి ఆల్‌ది బెస్ట్ చెప్పారు. అక్టోబర్ 21 నుంచి 27 మధ్య జరిగే మెయిన్స్ పరీక్షల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ 'ఎక్స్' వేదికగా ఆయన పోస్టు పెట్టారు. ప్రిలిమినరీ పరీక్షల్లో విజయం సాధించలేకపోయిన అభ్యర్థులు నిరుత్సాహపడొద్దని విజ్ఞప్తి చేశారు. జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, దాని కోసం ప్రయత్నించడం.. విజయం సాధించే వరకు ప్రయత్నాన్ని విరమించకపోవడం ఒక వ్యాపకంగా పెట్టుకున్నవారు ఎప్పటికైనా విజయతీరాలకు చేరతారని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు.టీజీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాలను ఆదివారం ఉదయం టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. తుది కీతో పాటు రిజల్ట్సను టీజీపీఎస్సీ ఒకేసారి విడుదల చేసింది. గ్రూప్-1 మెయిన్స్‌కు 31,382 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను చెక్ చేసుకోవచ్చు.

## పూరీ జగన్నాథ రథయాత్రలో అపశృతి

సాయంత్రం 5.20 గంటలకు రథయాత్ర ప్రారంభమైంది.అయితే పూరీలోని గ్రాండ్ రోడ్ బారా దండాలో సంప్రదాయబద్ధంగా బలభద్ర స్వామి రథాన్ని లాగుతున్న సమయంలో అపశృతి చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒకరు మరణించగా.. పలువురికి తీవ్ర గాయాలైనట్లు జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి. ఒడిశాలోని పూరీ జగన్నాథుని విశ్వప్రసిద్ధ రథయాత్ర భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ఆదివారం సాయంత్రం వైభవంగా ప్రారంభమైంది. ఒడిశాతో పాటు దేశం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు రథయాత్రను వీక్షించేందుకు తరలి రావడంతో పూరీ పట్టణం జనసంద్రంగా మారింది.జగన్నాథ, బలభద్ర, సుభద్రలు శ్రీక్షేత్రంలోని రత్నసింహాసనం వీడి యాత్రగా... పెంచిన తల్లి గుండిచాదేవి మందిరానికి చేరుకోనున్నారు. గర్భగు డిలో ని దివ్య(దారు) విగ్రహాలు భక్త జనఘోష మధ్య రథాలపై మూడు కిలోమీటర్లు ప్రయాణించి అమ్మ సన్నిధికి చేరుకుంటాయి. ఈసారి రథయాత్రకు ప్రత్యేకత ఉంది. 1971 తర్వాత ఒకేరోజు జగన్నాథుని నవయవ్వన దర్శనం, నేత్రోత్సవం, రథయాత్ర నిర్వహిస్తున్నారు. మూడు వేడుకలు ఈరోజే ఉండడంతో జగన్నాథుని నందిఘోష్, బలభద్రుని తాళధ్వజ, సుభద్ర దర్పదళన్ రథాలు ఆదివారం సాయంత్రానికి అమ్మ ఆలయానికి చేరుకొనే పరిస్థితి లేదు.

## కార్యవర్గం ఎన్నిక

**ప్రింట్ మీడియా సర్కులేషన్ అసోసియేషన్ కరీంనగర్ శాఖ అధ్యక్షుడిగా మంచాల రాజు**



**కరీంనగర్ బ్యూరో (జనంసాక్షి):**ప్రింట్ మీడియా సర్క్యూలేషన్ అసోసియేషన్ కరీంనగర్ శాఖ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికయింది. నగరంలోని మినీ పద్మనాయక కళ్యాణ మండపంలో అసోసియేషన్ సభ్యులు సమావేశామై అసోసియేషన్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గన్ని ఎన్నుకున్నారు. అసోంయేషన్ గౌరవ అధ్యక్షులుగా మాటేటి రవీందర్, అధ్యక్షులుగా మంచాల రాజు, ప్రధాన కార్యదర్శిగా రంగిశెట్టి శ్రీనివాస్, కోశాధికారిగా ఈరమల్ల రమేష్ ఎన్నికైయ్యారు. ఉపాధ్యక్షులుగా చిందం రాజేంద్రప్రసాద్, అమరపాల్ రెడ్డి, పూసల శ్రీనివాస్, పింగళి నరేందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిలుగా అలగిరెడ్డి సతీష్ రెడ్డి, ఏనుగుల ఓంకార్, కార్యవర్గ సభ్యులుగా గుండా రాజేంద్రప్రసాద్, శ్రీపాద వెంకటేష్ , మొండయ్య , సంతోష్ రెడ్డి, రమేష్, మధుకర్, వేణుగోపాల చారి, సంపత్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులంతా నూతన కార్యావర్గాన్ని సన్మానించారు. గౌరవ అధ్యక్షులు, అధ్యక్షు లను ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి పెద్ది లక్ష్మినారాయణ పచ్చునూరి రాజేందర్ లు సన్మానించారు.

## ఆరోగ్యశ్రీ ప్రదాత మందకృష్ణ మాదిగ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 7 (జనంసాక్షి):**ఆరోగ్యశ్రీ ప్రధాత మందకృష్ణ మాదిగ అని ఎం ఆర్ పి ఎస్ మహిళా అధ్యక్షురాలు సత్తిగాడు లక్ష్మి అన్నారు అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆదివారం జెండా ఆవిష్కరించారు. అదేవిధంగా మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మహిళా అధ్యక్షురాలు సత్తిగాడు లక్ష్మి మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎన్నో విజయాలు సాధించామని, అందులో ముఖ్యంగా మందకృష్ణ మాదిగ విజయం సాధించిన కొన్ని పథకాలలో ఆరోగ్యశ్రీ, వికలాంగులు, వితంతుల, కొరకు ఉద్యమం చేసినటువంటి మహానాయకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. 500 నుండి 2000 వరకు పింఛన్ ఇప్పించిన ఘనత, ఆర్టీసీ కార్మికులకు మద్దతు పలికిన మహానేత మందకృష్ణ మాదిగ అన్నారు. అంతేకాకుండా తెలంగాణ అమర వీరుల కడుపుకోత మహాసభ పెట్టి అమరులకు 10 లక్షల రూపాయలు పరికరాలు స్థలం కేటాయించాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ను డిమాండ్ చేసిన చరిత్ర మందకృష్ణ మాదిగ దే అన్నారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మాజీ బట్ట వెంకట రాములు మాట్లాడుతూ మాదిగ కుల సంఘ సమావేశానికి ఏకంగా ప్రధానమంత్రి మోడీని ఆహ్వానించిన చరిత్ర మందకృష్ణ మాదిగ కి దక్కుతుందని కొనియాడారు. మోడీ వర్గీకరణ విషయంలో కట్టుబడి ఉన్నానని వచ్చే పార్లమెంటు సమావేశంలో నిర్ణయం తీసుకుంటారని మోడీ హామి ఇచ్చారని, ఇప్పటికైనా మోడీ హామి కి కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొత్తొల్ల యాదగిరి, మాజీ ఎం ఎస్ పి జిల్లా కన్వీనర్ మాజీ పుల్లూరు పురుషోత్తం, మాచారెడ్డి మండల అధ్యక్షులు బట్ట రమేష్, రామారెడ్డి మండల అధ్యక్షులు రాజ నర్సు, మహిళా అధ్యక్షురాలు లావణ్య, రాజంపేట మహిళా అధ్యక్షురాలు సుజాత, మహిళా నాయకురాలు మానస, రాజేశ్వరి, రజిత, బాబు, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## క్వార్టర్ల తొలగింపు సహేతుకంగా లేదు..

**నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు పోరాటం ఆగదు**

**ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష సమావేశం బాధితుల నిరసన**



**గోదావరిఖని, జనంసాక్షి:**పట్టణ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా లక్ష్మినగర్ రోడ్ల వెడల్పు, సింగరేణి క్వార్టర్ల తొలగింపు అంశం రోజు రోజుకు జఠిలం అవుతున్నది.82 క్వార్టర్ల తొలగింపు నోటీసులు అందుకున్న సింగరేణి కార్మిక కుటుంబాలు తమక్వార్టర్ల తొలగింపునకు ససేమిరా అంటూ పలు నిరసన కార్యక్రమాలు, పలుమార్లు అధికారులను కలిసి పలు వినతులను అందజేసి తమ వ్యతిరేకతను వెలిబుచ్చారు. కొంతమంది కార్మికులు 'హైకోర్టును సైతం ఆశ్రయించి కొన్ని నెలల పాటు ఊరట పొందినారు.హైకోర్టు ఇచ్చిన గడువు తీరిన తర్వాత సింగరేణి మరల ఖాళీగా ఉన్న క్వార్టర్ల కూల్చివేతల ప్రక్రియ ప్రారంభించింది.క్వార్టర్లను ఖాళీ చేయడం ఇష్టం లేని కార్మిక కుటుంబాలు చలో హైదరాబాద్ అనే బస్సుయాత్రను సైతం చేపట్టి ' ప్రజాభవన్'లోని అధికారులకు,సింగరేణి భవన్ లో సిఎండి బాలరాం నాయక్ ను కలిసి వినతి పత్రాలను అందజేసి క్వార్టర్ల తొలగింపు నిర్ణయాన్ని మానుకోవాలని కోరారు.ఈ క్రమంలో క్వార్టర్ల బాధితులు ఆదివారం నాడు స్థానిక గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో అందుబాటులో ఉన్న ఈ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అఖిలపక్షంగా ఏర్పడి రౌండ్ టేబుల్ చర్చాకార్యక్రమం నిర్వహించారు. గోదావరిఖని పట్టణ ప్రాతం పూర్తిగా మైనింగ్ పై పడ్డ ప్రాంతమని, ఈ ఇక్కడ మైనింగ్ కార్యకలాపాలు ముగిస్తే ఇక్కడి ప్రాంతం ఉనికే పశ్నార్ధకంగా మారుతుందని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు.ఇప్పటికే ఒసిపి-5 వల్ల ఇక్కడి నివాస ప్రజలు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కేవలం ప్రధాన రోడ్డు వైపున్న క్వార్టర్లను తొలగించే వరకే పరిమితం చేయాలని, ఆ లెక్కన కేవలం 12 క్వార్టర్లను తొలగిస్తే సరిపోతుందని, మొత్తం మూడు వరుసలు తొలగించి వాణిజ్య అవసరాలకు వినియో గిస్తామనదాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు.లి సింగరేణి క్వార్టర్ల బాదితుల తరపున నాయకత్వం వహిస్తున్న తోటవేణు నేతృత్వంలో జరిగిన సుల్వ లక్ష్మీ నర్సయ్య, వీరేందర్, స్నేహ సాయితి వెంకటేష్, కిరణ్ జీ, వేముల అశోక్, ఉప్పులేటి పర్వతాలు, అడ్వకేట్స్ జేఏసి నుండి పులిపాక రాజ్ కుమార్, మాల మహానాడు నుండి శ్రీహరి, రాజేశ్వర్ రావు, శేఖర్ మరియు అధిక సంఖ్యలో సింగరేణి కార్మిక కుటుంబాలు పాల్గొన్నారు.





### అభిషేక్ రికార్డు సెంచరీ

తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్ యూనిట్‌గా విఫలమైన కుర్రాళ్లు రెండో గేమ్‌లో గేర్ మార్చారు. సిరీస్ సమం చేయాలంటే గెలవక తప్పని మ్యాచ్‌లో జింబాబ్వే బౌలర్లను ఓపెనర్ అభిషేక్ శర్మ(100) ఊచకోత కోశాడు. మెరుపు బ్యాటింగ్‌తో సెంచరీ బాదేసి భారీ స్కోర్‌కు బాటలు వేశాడు.

ఆ తర్వాత రుతురాజ్ గైక్వాడ్(77 నాటౌట్), రింకూ సింగ్(48 నాటౌట్)లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. అభిషేక్ ఔటయ్యాక వీళ్లిద్దరూ బౌండరీలతో విరుచుకుపడడంతో, టీమిండియా స్కోర్ రాకెట్ వేగంతో పరుగులు తీసింది. ఈ ముగ్గురి వీరబాదుడుతో భారత్ ప్రత్యర్థికి 235 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

# అభిషేక్ శతకగర్జన

## అదరగొట్టిన పేసర్లు.. సిరీస్ సమం

- 100 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసిన టీమిండియా
- మొదట 20 ఓవర్లలో 2 వికెట్లకు 234 పరుగులు చేసిన టీమిండియా
- లక్ష్యఛేదనలో 18.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌట్ అయిన జింబాబ్వే
- చెరో మూడు వికెట్లతో జింబాబ్వే పనిబట్టిన ముఖేశ్ కుమార్, అవేష్ ఖాన్

*కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి ఓపెనింగ్ చేసిన అభిషేక్.. తొలి బంతికే సిక్స్ బాదాడు. ఆ తర్వాత గిల్ ఔట్ అవ్వడంతో కాస్త నెమ్మదించాడు. క్రీజులో కుదురుకోవడం కోసం కొంత సమయం తీసుకున్నాడు. ఇక ఎప్పుడైతే మైదానంలో సెటిల్ అయ్యాడో.. ఇక అప్పటి నుంచి తన ప్రతాపం చూపించడం ప్రారంభించాడు. ప్రత్యర్థి బౌలర్లు ఎలాంటి బంతులు వేసినా.. వాటిని తనకు అనుకూలంగా మార్చుకొని దుమ్ముదులిపేశాడు. ఓవైపు రుతురాజ్ నిదానంగా ఇన్నింగ్స్ ఆడితే.. మరోవైపు అభిషేక్ పూనకం వచ్చినట్లు దుమ్ముదులిపేశాడు. ఆకలితో ఉన్న పులి వేటాడితే ఎలా ఉంటుందో.. ఆ రేంజ్‌లో అతను పరుగుల వర్షం కురిపించాడు. ఈ క్రమంలోనే.. అంతర్జాతీయ టీ20లో తన తొలి శతకాన్ని నమోదు చేశాడు.*

ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా.. జింబాబ్వే చేతిలో తొలి మ్యాచ్‌లో ఎదురైన పరాభావానికి భారత జట్టు ప్రతీకారం తీర్చుకుంది. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన రెండో మ్యాచ్‌లో ఘనవిజయం సాధించింది. 235 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే జట్టు.. భారత బౌలర్ల ధాటికి 134 పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో.. 100 పరుగుల తేడాతో టీమిండియా విజయఢంకా మోగించింది. దీంతో.. ఈ సిరీస్‌లో చెరో విజయంతో ఇరుజట్లు సమంగా నిలిచాయి.

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత జట్టు.. నిర్ణీత 20 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (100) శతక్కొట్టడంతో పాటు రుతురాజ్ గైక్వాడ్ (77), రింకూ సింగ్ (48) మెరుపులు మెరిపించడంతో.. భారత్ అంత భారీ స్కోరు చేయగలిగింది. ఇక లక్ష్య ఛేధనలో భాగంగా.. జింబాబ్వే బ్యాటర్లు తడబడటంతో 134 పరుగులకే కుప్పకూలింది. వెస్లీ (43), ల్యూక్ జాంగ్వే (33) మాత్రమే పర్వాలేదని పించారు. మిగతా ఆటగాళ్లు భారత బౌలర్ల ధాటికి ఎక్కువసేపు క్రీజులో నిలదొక్కు కోలేకపోయారు. ఆరుగురు బ్యాట ర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితం అవ్వగా.. అందులో రెండు డకౌట్లు ఉన్నాయి.

భారత బౌలర్లలో.. అభిషేక్ శర్మ మినహాయించి మిగతా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ వేశారు. ప్రత్యర్థి బ్యాటర్లకు పెద్దగా ఆడే అవకాశం ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెట్టారు. అవేశ్ ఖాన్ తన కోటాలో భాగంగా మూడు ఓవర్లు వేసి, కేవలం 15 పరుగులే ఇచ్చి మూడు వికెట్లు తీశాడు. ముకేశ్ కుమార్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఇక రవి బిష్ణోయ్ రెండు వికెట్లు తీయగా.. వాషింగ్టన్ సుందర్ ఒక వికెట్‌తో సరిపెట్టుకున్నాడు. మిగిలిన మూడు మ్యాచ్‌ల్లోనూ భారత యువ ఆటగాళ్లు ఇదే దూకుడు కొనసాగిస్తే.. సిరీస్ భారత్ కైవసం అవుతుంది. మరి.. మిగతా మ్యాచ్‌ల్లో ఎలా రాణిస్తారో చూడాలి.



# బ్రిట్స్, అన్నెకె విధ్వంసం..

## భారత్ ముందు భారీ లక్ష్యం..!



: రెండో టీ20లోనూ దక్షిణాఫ్రికా బ్యాటర్లకు కళ్లెం వేడయంలో భారత బౌలర్లు విఫలమయ్యారు. తొలి మ్యాచ్‌లో అర్ధ సెంచరీతో చెలరేగిన తంజిమ్ బ్రిట్స్(52) మళ్లీ మెరిసింది. ఆఖర్లో అన్నెకె బొస్చ్ (40), అన్నెరీ డెర్క్సెన్(12)లు ధనాధన్ ఆడి జట్టు స్కోర్ 170 దాటించారు. ఈ మ్యాచ్‌లో భారత అమ్మాయిల ఫీల్డింగ్ కూడా సఫారీలకు కలిసొచ్చింది. చివరి రెండు ఓవర్లలో 31 పరుగులు రావడంతో దక్షిణాఫ్రికా హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ముందు భారీ లక్ష్యాన్ని ఉంచగలిగింది. భారత పర్యటనలో వన్డే, టెస్టు సిరీస్‌లో ఓడిన దక్షిణాఫ్రికా టీ20ల్లో తడాఖా చూపిస్తోంది. చిదంబరం స్టేడియం వేదికగా తొలి మ్యాచ్‌లో విక్టరీ కొట్టిన లారా వాల్వార్ట్ బృందం రెండో మ్యాచ్‌లోనూ టీమిండియాకు భారీ టార్గెట్ అప్పగించింది. కెప్టెన్ లారా వొల్వార్డ్(22), ఆల్‌రౌండర్ మరిజానె కాప్(20)లు స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగినా.. ఓపెనర్ తంజిమ్ బ్రిట్స్(52) వరుసగా రెండో ఫిఫ్టీతో కదం తొక్కింది. దీప్తి శర్మ ఓవర్లో బ్రిట్స్ ఔటయ్యాక వచ్చిన బోస్చ్(40) సుడిగాలి ఇన్నింగ్స్ ఆడి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించింది. ఇక ఆఖరి రెండు ఓవర్లలో టెయిలెండర్లు 31 రన్స్ పిండుకున్నారు. దాంతో, నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 177 రన్స్ కొట్టింది. భారత బౌలర్లలో పూజా వస్త్రాకర్(2/37), దీప్తి శర్మ(3/20)లు రెండేసి వికెట్లతో రాణించారు.



## కెరీర్‌కు గుడ్‌బై చెప్పనున్న డబ్ల్యూడబ్ల్యూఈ స్టార్ జాన్ సినా..

ప్రముఖ రెజ్లర్ డబ్ల్యూడబ్ల్యూఈ స్టార్ జాన్ సినా కెరీర్‌కు గుడ్‌బై చెప్పనున్నట్లు ప్రకటించారు. 2025లో జరిగే రెసల్‌మేనియా తన చివరి పోటీ అని తెలిపారు. కెనడాలో జరుగుతున్న డబ్ల్యూడబ్ల్యూఈ మనీ ఈవెంట్‌కు హాజరైన సినా ఆశ్చర్యకరంగా ఈ ప్రకటన చేశారు. జాన్ సినా 2001లో రెజ్లింగ్‌లోకి అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు 16 సార్లు డబ్ల్యూడబ్ల్యూఈ ఛాంపియన్‌గా నిలిచారు. జాన్ సినా కొన్ని హాలీవుడ్ సినిమాల్లో నటించి ఆకట్టుకున్నారు. టీవీ షోల్లోనూ సందడి చేశారు. 'దాదాపు రెండు దశాబ్దాలకుపైగా రెజ్లింగ్‌లో ఉన్నా. ఎన్నో అనుభవాలను ఆస్వాదించా' అని జాన్‌సినా తెలిపాడు. 'ఇప్పుడు వీడ్కోలు నిర్ణయం తీసుకొనేందుకు సరైన సమయం వచ్చిందని భావిస్తున్నా. డబ్ల్యూడబ్ల్యూఈకి ఉన్న ఆదరణ మాటల్లో చెప్పలేం. ఎల్లవేళలా మద్దతుగా నిలిచే అభిమానులే కీలకం. వారి వల్లే కెరీర్‌లో ఉన్నత స్థానాలకు వెళ్లగలం. నా రెజ్లింగ్ కెరీర్‌లో తెలుసుకొన్నది ఒక్కటే. కెనడా వాసులు ఎప్పుడూ రెజ్లింగ్‌ను ఆదరిస్తూనే ఉంటారు' అని సినా పేర్కొన్నాడు.



## స్పెయిన్ ఫైనల్లో సత్తాచాటిన వినేశ్ ఫోగట్

మాడ్రిడ్: ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌కు ముందు భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ సత్తాచాటింది. స్పెయిన్ గ్రాండ్‌ప్రి టోర్నీలో వినేశ్ ఫైనల్ పోరుకు దూసుకెళ్లింది. శనివారం జరిగిన మహిళల 50కిలోల సెమీస్ బౌట్‌లో వినేశ్ 9-4తో క్యాథి దచక్(కెనడా)పై అద్భుత విజయం సాధించింది. అంతకుముందు జరిగిన క్వార్టర్స్ బౌట్‌లో ఈ యువ రెజ్లర్ కెనడాకే చెందిన మాడిసన్ పార్క్స్‌పై అలవోకగా గెలిచింది. వినేశ్..తుది పోరులో రష్యాకు చెందిన మారియా తుమ్రెకోవతో అమీతుమీ తేల్చుకోనుంది.

### నిరాడంబరంగా డిజి రామారావు

## మెమోరియల్ అవార్డు ప్రధానం



**హైదరాబాద్, జూలై 7 (జనంసాక్షి) :**
డి.జి.రామారావు మెమోరియల్ ఫౌండేషన్ ఫర్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో, డి.జి.రామా రావు మెమోరియల్ అవార్డు, ప్రముఖ సంఘ సేవ తత్పరులు అమ్మ నేత్ర అవయవ శరీర దాన అవగాహన సంస్థ స్థాపన చేసిన తొలి అధ్యక్షులుగంజి ఈశ్వర లింగం అందజేశారు. డి.జి.రామా రావు కులనిర్మూలన సంఘం స్థాపక కార్యదర్శి గాను బడుగు బలహీన వర్గాలకు యుసిడి ప్రాజెక్టు డైరెక్టర్‌గా సిద్ధ సమాధి యోగ గురువుగా యోగా శిక్షకులుగా, సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి హృదయాల్లో నిలిచి పోయారు. వారి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు కుమారులు సురేషం జగదీశం కుమార్తె స్వరాజ్యలక్ష్మి రామారావు, కృష్ణ చందు సునీల్, రామారావు మెమోరియల్ అవార్డు ఎంతోమంది జంటలకు ఇచ్చారు. డిజీ రామారావు మెమోరియల్ ఫౌండేషన్ ఫర్ సోషల్ జస్టిస్ అనే సంస్థ స్థాపించి తొలి అవార్డుగా గంజి ఐశ్వరలింగం డీజీ రామారావ్ మెమోరియల్ అవార్డు అందజేయటం జరిగినది. సురేశమ్ నగదు అవార్డ్ అందజేయగా, అవార్డు స్వరాజ్యలక్ష్మి వెంకటేశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమాలకు కొనసాగింపుగా రాబోయే సంవత్సరాలలో సంఘ సేవకు గాను మరిన్ని అవార్డులు అందజేస్తామని డిజీరామారావు మెమోరియల్ ఫౌండేషన్ ఫర్ సోషల్ జస్టిస్ స్థాపక అధ్యక్షులు డి జగదీశం చెప్పారు ఈ కార్యక్రమానికి ఆత్మీయులుగా గుత్తా జ్యోత్స్న, లక్ష్మీ విక్రం ,వహీద్ ,జ్యోతి, రమణ, పృథ్వి, సిహెచ్ శ్రీనివాస్ ,కృష్ణవేణి, చిరంజీవులు సాయి ప్రతిబ్, వరుణ్, కావ్య,డాక్టర్ మోహిత, తదితరులు పాల్గొన్నారు. జగదీష్ గారు మట్టిలో మాణిక్యాలు అనే కవిత శరీర అవయవదాన కార్యకర్తల గురించి స్వయంగా రాసి చదివి వినిపించి వందన సమర్పణ చేశారు.

## ద్రవిడ్‌కు 'భారత రత్న' ఇవ్వాలి

భారత జట్టును పొట్టి ప్రపంచ కప్ విజేతగా నిలిపిన రాహుల్ ద్రవిడ్ తన కలన నిజం చేసుకున్నాడు. ఒక ఆటగాడిగా సాధించలేని ఐసీసీ ట్రోఫీని కోచ్‌గా ముద్దాడి మురిసిపోయాడు. దాంతో, 17 ఏండ్ల కాలంలో ఏ కోచ్ వల్ల కాని ఘనతను ఈ దిగ్గజ క్రికెటర్ సొంతం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో.. యావత్ దేశం గర్వపడేలా చేసిన ద్రవిడ్‌కు 'భారత రత్న' అవార్డు ఇవ్వాలని మాజీ ఆటగాడు సునీల్ గవాస్కర్ డిమాండ్ చేశాడు. భారత ప్రభుత్వం ద్రవిడ్‌ను భారత రత్న పురస్కారంతో గౌరవిస్తే బాగుంటుంది. ఆ అవార్డుకు ద్రవిడ్ అన్ని విధాలా అర్హుడు. భారత జట్టుకు ఆడిన వాళ్లలో ద్రవిడ్ గొప్ప ప్లేయరే కాదు గొప్ప కెప్టెన్ కూడా. అంతేకాదు నేషనల్ క్రికెట్ అకాడమీ చైర్మన్‌గా.. ఆ తర్వాత హెడ్‌కోచ్‌గా పనిచేసిన ద్రవిడ్ ప్రతిభగల కుర్రాళ్లను వెలికితీయడంలో మొనగాడు' అని గవాస్కర్ అన్నాడు.

**ఏకైక క్రికెటర్ సచిన్..**

ఇప్పటివరకూ భారత రత్న అవార్డు అందుకున్న ఏకైక క్రికెటర్ సచిన్ టెండూల్కర్. 2014లో ఈ పురస్కారం సచిన్‌ను వరించింది. అప్పటి నుంచి 10 ఏండ్లు గడుస్తున్నా మరే క్రికెటర్ ఈ అవార్డుకు నోచుకోలేదు. దాంతో, టీమిండియా 13 ఏండ్ల ట్రోఫీ కరువు తీర్చిన ద్రవిడ్‌కు ఈ అత్యుత్తన్నత పురస్కారం ఇవ్వాలని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు.

**టెస్టు స్పెషలిస్ట్‌గా..**

రాహుల్ ద్రవిడ్ లేని భారత క్రికెట్‌ను ఊహించలేం. సచిన్ టెండూల్కర్, సౌరభ్ గంగూలీ అజారుద్దీన్‌లు దూకుడును నమ్ముకొని స్టార్ ఆటగాళ్లుగా పేరుతెచ్చుకుంటే.. ద్రవిడ్ మాత్రం తన సొగసైన ఆట, బలమైన టెక్నిక్‌తో టెస్టు స్పెషలిస్ట్‌గా మారాడు.ఆస్ట్రేలియా గడ్డపై 2008లో తొలి టెస్టు విజయంలో ద్రవిడ్ కీలక పాత్ర పోషించాడు. కంగారూ పేస్ దళాన్ని సమర్థంగా ఎదుర్కొంటూ పెర్త్ టెస్టులో 93 పరుగులతో టీమిండియాను గెలిపించాడు.



**తొలి విజయాన్ని రుచి చూసి..**

ఇక భారత్.. దాయాది పాకిస్థాన్‌పై 2005లో తొలి సిరీస్ గెలవడంలో ద్రవిడ్ రోల్ ఉంది. బౌన్సీ పిచ్‌లకు కేరాఫ్ అయిన దక్షిణాఫ్రికా గడ్డపై తొలి విజయాన్ని రుచి చూసిన కెప్టెన్ కూడా ద్రవిడే కావడం విశేషం. టెస్టుల్లో 36, వన్డేల్లో 12 సెంచరీలు బాదిన ద్రవిడ్ 2012లో తనకెంతో ఇష్టమైనక్రికెటకూ వీడ్కోలు పలికాడు. రిటైర్మెంట్ అనంతరం అండర్ 19 జట్టుకు కోచ్‌గా, బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ చీఫ్‌గా కొనసాగాడు. రవిశాస్త్రి తర్వాత టీమిండియా కోచ్‌గా పగ్గాలు అందుకున్న ద్రవిడ్ టీ20 చాంపియన్‌గా కెరీర్‌ను ముగించాడు.

# వీరశైవుల అభ్యున్నతికి తన వంతు సహాయ సహకారాలు

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కాప్రా /కీసర, జులై 07 (జనంసాక్షి) :**
వీరశైవుల అభ్యున్నతికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తాన ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా వీరశైవ సమాజం నూతన కమిటీ పరిచయ కార్యక్రమంలో భాగంగా అధ్యక్షుడు ప్యాట జ్ఞానేశ్వర్, గౌరవ అధ్యక్షులు యావపురం విశ్వనాథం ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఏఎస్ రావు నగర్ డివిజన్లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కమిటీని పరిచయం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనను, శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియ



జేశారు. అనంతరం కమిటీ సభ్యులను సత్కరించి, వీరశైవుల సాధకబాధలు తెలుసని అన్నారు, అదేవిధంగా వీరశైవుల అభ్యున్నతికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తాన న్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గంగా ఈశ్వరయ్య, కోశాధికారి కత్తి శివానంద్, ఉపాధ్యక్షులు ఉత్పత్తి శ్రీశైలం, నమస్కరి శివ, సిద్దేశ్వర్, సహాయ కార్యదర్శులు శంభులింగం, కార్యానిర్వహక కార్యదర్శిలు మటమ్ శివకుమార్, కె.ప్రవీణ్, జగదీష్, కొప్పునూరు రాజేష్, యావపురం రవి, షాపూర్ నగర్ వీరశైవులు బి.నాగరాజు గౌడ, రుద్రకుమార్, అమర్నాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.





## సింపుల్ మార్ట్‌గేజ్ అంటూ..

# సేల్ డీడ్!

## మామకు.. "టోకరా కొట్టిన అల్లుడు"

- కాజేసిన భూమి విలువ కోట్లల్లో
- ప్రశ్నిస్తే ఇష్టమొచ్చిన చోట్ల చెప్పుకో అని బెదిరింపు
- న్యాయం చేయాలంటున్న బాధిత రైతు

**సంగారెడ్డి ప్రతినిధి /న్యాల్‌కల్, జులై 07, (జనం సాక్షి) :**
మామా..? రూ. లక్ష అప్పు తీర్చేందుకు ఒకరితో మాట్లాడాను..? వారు అప్పు ఇచ్చేందుకు ఒప్పు కున్నారు.. ఎకర వ్యవసాయ భూమిని బ్యాంకులో సింపుల్ మాడగేజ్ చేసుకొని అప్పు ఇస్తారు.. మామా.. నీవు సరే అంటే పనిపూర్తి చేద్దాం అంటూ.. స్వయానా అల్లుడైన సుభాష్ రెడ్డి మామకే ఎగనామం పెట్టి సింపుల్ మాడ్గేజ్ కు బదులుగా ఏకంగా 2 ఎకరాల మేర తన (సుభాష్ రెడ్డి) పేరున సేల్ డీడ్ రిజిస్టర్ చేసుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా, ఝరాసంఘం మండలంలో చోటు చేసుకుంది. బాధిత రైతు పి.సంగారెడ్డి, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝరాసంఘం మండలం, నర్సాపూర్ గ్రామానికి చెందిన రైతు సంగారెడ్డి తన అవసరం కోసం ఎవరి వద్దనుండైనా రూ:లక్ష అప్పుగా తీసుకువస్తావా..? అల్లుడు అంటు.. తన కూతురి భర్త, మణూర్ మండలం, బెల్లాపూర్ గ్రామానికి చెందిన అల్లుడైన పి.సుభాష్ రెడ్డికి చెప్పగా.. అందుకు అంగీకరించిన సుభాష్ రెడ్డి సరే మామ.. స్థానిక బ్యాంకులో సింపుల్ మాడ్గేజ్ చేసుకొని ఇస్తారని చెప్పి అవసరమైన ఒరిజినల్ పాసు పుస్తకాలు, ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నాడు. అనంతరం పట్టాదారు (మామ)ను స్థానిక తహసిల్దార్ కార్యాలయానికి తీసుకువెళ్లి సింపుల్ మడిగేజ్ అని చెప్పి ఎకరా చొప్పున సేల్ డీడ్ చేసుకున్నాడు. మరో పక్షం రోజుల తర్వాత వేలిముద్రలు సరిగ్గా పడలేదని, ఫోటో సరిగ్గా పడలేదని చెప్పి తిరిగి తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి మరో ఒక ఎకరాన్ని సేల్ డీడ్ చేసి రూ:లక్ష తనకు ఇచ్చాడని బాధిత రైతు సంగారెడ్డి తెలిపాడు. సుభాష్ రెడ్డి ఇద్దరి వ్యక్తులను సాక్షులుగా కార్యాలయానికి తీసుకెళ్లి సాక్షులను సైతం మోసగించి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకుని తనకు మోసం చేశాడని బాధిత రైతు సంగారెడ్డి వాపోయాడు. రూ: కోట్ల విలువ చేసే వ్యవసాయ భూమిని అక్రమంగా తనను మోసగించి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, తగు న్యాయం కోరుతూ ఈ మేరకు బాధిత రైతు సంగారెడ్డి, కుటుంబీకులు స్థానిక తహసిల్దార్, ఆర్డీఓతో పాటు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న ప్రభుత్వం

- బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసి చేర్చుకునే శ్రద్ధ- కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యపై లేదు
- కడ్తాల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కంబాలపల్లి పరమేష్ మాదిగ



**కడ్తాల్ జూలై 07(జనంసాక్షి):**
కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడంపై ఉన్న శ్రద్ధ,విద్యపై ఏమాత్రం శ్రద్ధ లేదని కడ్తాల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కంబాలపల్లి పరమేష్ మాదిగ ఆరోపించారు.ఆదివారం కడ్తాల్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి 7నెలలు గడిచిపోయిన విద్య శాఖకు మంత్రిని నియమించకుండా,మద్యానికి మంత్రి నియమించారు అని విమర్శించారు.కడ్తాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నూతనంగా ఏర్పడిన కస్తూరిబా భవనాన్ని ప్రారంభించకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చోద్యం చేస్తుందని అన్నారు.విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు నెలగడుస్తున్న ఇంతవరకు భవనాన్ని ఎందుకు ప్రారంభిస్తలేరని అన్నారు.విద్యా సంవత్సరం ప్రారంభమై నెలగడుస్తున్న నూతన కస్తూరిబా భవనాన్ని ఎందుకు ప్రారంభిస్తలేరో విద్యార్థుల తల్లిదండ్రులకు తెలపాలని డిమాండ్ చేశారు.రెండు, మూడు రోజుల్లో పాఠశాలను ప్రారంభించకపోతే బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కంబాలపల్లి పరమేష్ ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపడుతుందని డిమాండ్ చేశారు.పాఠశాల ప్రారంభం గాక విద్యార్థులు,తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఇకనైనా విద్యా వ్యవస్థను గాడిలో పెట్టి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కస్తూరిబా పాఠశాలను వెంటనే ప్రారంభించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్,కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్,మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్,మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహ రెడ్డి,రైతు కోఆర్డినేటర్ జోగు వీరయ్య,మాజీ ఎంపిటిసి లచ్చిరాం నాయక్,డైరెక్టర్ లాయక్ అలీ,శీను తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
8 జూలై 2024

# సింగరేణితోనే భావితరానికి భవిష్యత్తు





- సీనియర్ జర్నలిస్ట్ ఎం డి. మునీర్

**మందమర్రి, జూలై 7 (జనంసాక్షి) :** సింగరేణి సంరక్షణతోనే భావి తరాలకు భవిష్యత్తు అని సీనియర్ జర్నలిస్ట్ ఎండి. మునీర్ అన్నారు. రెవల్యూషన్ భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో మందమర్రి పట్టణంలోని సిఇఆర్ క్లబ్ కేంద్రంలో ఆదివారం సాయంత్రం కోల్ బెల్ట్ యూనియన్ నాయకులు, కార్మిక సంఘాలు, వివిధ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీనియర్ పాత్రికేయులు హనుమండ్ల రవీందర్ అధ్యక్షత వహించగా ఎండి మునీర్, పోతుల పరంధామ్ కుమార్ వక్తలుగా పాల్గొన్నారు. కోల్ బెల్ట్ ప్రాంతం కోసం గతంలో నర్సింగరావు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. దశాబ్దం నారా కాలంగా కోల్ బెల్ట్ పరిస్థితి దినదినం గండంగా మారిందని అందుకు ప్రధాన కారణం పెరిగిపోతున్న నిరుద్యోగం పేదరికంతో ఈ ప్రాంత మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. నల్ల నెల నుండి వచ్చిన వ్యక్తులు ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులుగా ఎదగాలని ఇక్కడ యువకుల పరిస్థితి నిరుపేదరికంలోకి నెట్టి వేయబడిందనీ స్పష్టం చేశారు. నిన్నటికి నిన్న జరిగిన ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రుల సభల్లో సింగరేణి ఊసే లేదని అన్నారు. మా బొగ్గు బ్లాక్స్ మాకు ఇవ్వాలని ప్రచారం కోసం ప్రకటనలు చేయడం తప్ప సింగరేణి సంస్థ కోసం పోరాటం చేసేందుకు నాయకులు ముందుకు రాలేకపోతున్నారని అన్నారు. పేరుకు తండ్రి ఉద్యోగం కుమారుడికి లేదా కుమార్తెకు వచ్చిన కుటుంబంలో మిగిలిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అనేక కుటుంబాల మధ్య జరుగుతున్న బాధాకరమైన విషయం అన్నారు. బీహార్ రాష్ట్రంలో నితీష్ కుమార్ హయాంలో ఒకే దఫాలో ఐదు లక్షల ఉద్యోగాలు ఇచ్చారని తెలంగాణ రాష్ట్రంలో మాత్రం యువతకు ఎడమ చేతి చూపించారని అన్నారు. నల్ల నెల నుండి ఢిల్లీ నోయిడా దాకా సకల జనుల సమ్మెతో సింగరేణి అగ్గిరాజేసి రాష్ట్రాన్ని సాధించి రాజకీయ నాయకుల చేతిలో పెట్టమని గుర్తుచేస్తూ అదే సమ్మె పోరుతో సింగరేణిని కాపాడుకుంటామని అన్నారు. ఇది కార్మికుల సమస్యగానో సింగరేణి సంస్థ సమస్యగానో చూడకుండా ఇది మనిషి మనుగడ సమస్యగా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. పాత బొగ్గు గనులను ఓపెన్ కాస్ట్ చేయడం చూపాల్సిన శ్రద్ధ కొత్త బొగ్గు గనులను ఓపెన్ కాస్ట్ చేయడం జరుగుతోందని అన్నారు. 135 ఏళ్ళ చరిత్ర కలిగిన సింగరేణికి మనుగడ లేకుండా పోతే చూస్తూ కూర్చోవడం కార్మిక ప్రాంత ప్రజలకు తెలియాదని అన్నారు. ఈ సమావేశంలో టీబిజిక్స్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, ఒరుగొండ రాజశేఖర్, సి.ఐ.టి.యూ రాష్ట్ర జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్, అల్లి రాజేందర్, ఏ. సారయ్య, కొమరయ్య, జి.సంపత్, ఏ.రవికుమార్, దుర్గం మల్లేష్ (ఏఐటీయూసీ), ఎండి. జాఫర్ (ఐఎఫ్టియు), జి అంజయ్య, జైపాల్సింగ్(టిఎస్‌యుఎస్), జి.రమేష్(ఐఎఫ్టియూసీ), ఎం.రామయ్య (సీఐటీయూసీ), ఆర్.రామస్వామి (సీఐటీయూ), డి. శంకర్‌రావు (ఐఎన్‌టియుసి), జె. శ్రీనివాస్ (హెచ్ఎంఎస్), వి.శివ (ఎస్టీ వెల్ఫేర్) టి.మల్లేష్, మహేందర్, యువజాన సంఘం సభ్యులు అనిల్ భగత్, అక్బర్, రాజశేఖర్, శ్రీనాథ్, కృష్ణ, జాఫర్, దీపక్, రామకాంత్, స్వామి, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# గనుల వేలానికి వ్యతిరేకంగా పోరు



**(ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వ బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా ఐఎన్‌టీయూసీ తీసుకునే కార్యాచరణపై కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. గోదావరిఖనిలోని లక్ష్మి నరసింహ గార్డెన్స్‌లో ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా ఐఎన్‌టీయూసీ తీసుకునే కార్యాచరణపై కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా యూనియన్ పరంగా తీసుకొనే పలు విషయాలపై చర్చించారు. మన బొగ్గు మన హక్కు నినాదంతో సింగరేణి వ్యాప్తంగా చేపట్టబోయే సింగరేణి పరిరక్షణ రణభేరి యాత్ర ప్రారంభం గురించి సింగరేణి వ్యాప్తంగా అన్ని బొగ్గు గనుల లలో జరుగుతున్న ప్రమాదాలు వాటి నివారణ కోసం తీసుకోవలసిన (సేఫ్టీ) నిర్ణయాల గురించి చర్చించారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్ కార్మికుల కోసం ఐఎన్టియుసి సింగరేణి కాంట్రాక్ట్ యూనియన్ ప్రారంభించి వారి హక్కుల కృషి కోసం పోరాడాలని నిర్ణయించారు. యూనియన్ బలోపేతం కోసం సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహ రెడ్డి, సిద్దం శెట్టి రాజమౌళి, ధర్మపురి, జనరల్ సెక్రెటరీలు త్యాగరాజన్, ఎండి అక్రం, సెంట్రల్ క్యాంపెనింగ్ ఇంఛార్జి వికాస్ కుమార్ యాదవ్, సెంట్రల్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేందర్, మహిళ అధ్యక్షురాలు శేషా రత్నం, జిల్లా అధ్యక్షులు దాస్, ఫెడరేషన్ నాయకులు భీంరావ్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్లు అక్బర్ అలీ, కలవెన శ్యామ్, గరిగ స్వామి, పేరం రమేష్, సెంట్రల్ జాయింట్ జనరల్ సెక్రెటరీలు అరేపల్లి శ్రీనివాస్, ఆల్బర్ట్, మెహబూబ్, గోచికొండ సత్యనారాయణ, సెంట్రల్ సెక్రెటరీ పోచయ్య, పుల్లురి లక్ష్మణ్, మైనింగ్ స్టాఫ్ నాయకులు రఘుపతి రెడ్డి, సదానందం రామగుండం ఒకటి,వైస్ ప్రెసిడెంట్ కె.సదానందం, రామగుండం-2 వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణ రెడ్డి, రామగుండం-3 వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి, భూపాలపల్లి వైస్ ప్రెసిడెంట్ జోగ బుచ్చయ్య, మందమర్రి వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య, శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు, బెల్లంపల్లి వైస్ ప్రెసిడెంట్ పెరం శ్రీనివాస్, కొత్తగూడెం వైస్ ప్రెసిడెంట్ రజాక్, ఇల్లందు వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పీతంబరం పాల్గొన్నారు.

# అడవులను జల్లెడ పడుతున్న పోలీసులు

- మావోయిస్టులకు ఆశ్రయం కల్పించవద్దు
- మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాలు గుత్తికోయ గుంపులపై నిఘా వ్యవస్థ బలోపేతం
- మావోయిస్టుల సమాచారం అందించిన వారికి నగదు బహుమతి అందిస్తాం
- సిఐ అనుముల శ్రీనివాస్



**ఏటూరునాగారం, జూలై 07(జనంసాక్షి) : మావోయిస్టుల అలజడి నేపథ్యంలో పోలీసులు అడవులను జల్లెడ పడుతున్నారు.** ఏటూరునాగారం సిఐ అనుముల శ్రీనివాస్ ఆదివారం తమ సిబ్బందితో కలిసి రాయిబంధం గుత్తి కోయ గుంపులను సందర్శించారు. ఆదివాసీ ప్రజలు ఏజెన్సీ ప్రాంతాలలో దట్టమైన అడవులో నివసిస్తున్నందున వారికి విద్య, వైద్యం, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలు అందించాలనే లక్ష్యంగా జిల్లా ఎస్పీ, ములుగు ఓఎస్‌డి, ఏటూరునాగారం ఏఎస్పీ దృష్టి సారించారు. జిల్లా పోలీస్ అధికారులకు ఆదేశాను సారము గుత్తి కోయగూడాలను సందర్శించి ప్రభుత్వం ద్వారా అందే ప్రయోజనాలను వారికీ తెలియజేస్తూ పిల్లలను చదివించే దిశగా వారిని ప్రోత్సహించాలని ప్రస్తుత వర్షాకాలంలో విష జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించాలని గర్భిణీ స్త్రీల జాబితాను సేకరిస్తూ అనుకోని విధంగా వరదలు సంభవిస్తే ముందస్తు చర్యల్లో భాగంగా వారిని ఆసుపత్రులకు తరలించే విధంగా సిద్ధంగా ఉండాలని సిఐ అనుముల శ్రీనివాస్ తెలియజేశారు. మంగపేట, కన్నాయి గూడెం, ఏటూరునాగారం పరిధిలో గల చింతలపాడు, దొడ్ల కొత్తూరు, చింతలమూరి, కొండాయి, పూల కొమ్మ గుత్తి కోయ గుంపులను సందర్శించారు. రాయి బంధం గోతి కోయ గూడాలను మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను స్థానిక సిఐ అనుముల శ్రీనివాస్ సందర్శించి వారికి అవగాహన కల్పించారు. మావోయిస్టుల ఆచూకీ తెలిపిన వారికీ నగదు బహుమతి అందిస్తామంటూ తెలిపారు. ఆదివాసి ప్రజలు ఎవరూ కూడా అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించవద్దని కొత్త వ్యక్తులు తమ గూడాలలో సంచరిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయి, అంతేకాక వారికి పెద్ద మొత్తంలో నగదు బహుమతి అందచేస్తామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సివిల్, సిఆర్‌పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

# రైతు ఆత్మహత్య బాధాకరం

- నిష్పాక్షికంగా విచారణ.. బాధ్యులు ఎవరైనా కఠిన చర్యలు
- అంతా నా వాళ్లే.. రాజకీయాలకు స్థానం లేదు
- రైతు ప్రభాకర్ కుటుంబానికి న్యాయం చేస్తాం, అన్ని విధాల ఆదుకుంటాం
- మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**ఖమ్మం ప్రతినిధి, జూలై 7 (జనంసాక్షి) :** చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన చేపల సొసైటీ, ఇరిగేషన్ కు సంబంధించి.. తన భూమి, వేసినటువంటి మెరకను తొలగించారని రైతు ప్రభాకర్ మనస్థాపన చెంది ఆత్మహత్య చేసుకున్నట్టు మీడియా ద్వారా మిగతా వారిద్వారా తెలిసింది. రైతు తండ్రి తో మాట్లాడాను, వారి శ్రీమతితో పిల్లలతో మాట్లాడాను, జరిగిన సంఘటన చాలా బాధాకరం, ప్రాణం చాలా విలువైనది, మనం పుట్టింది బతకడానికి కానీ చావడానికి కాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన రైతు ప్రభాకర్ కుటుంబాన్ని ఆయన పరామర్శించిన అనంతరం స్థానికంగా మీడియాతో మాట్లాడారు. ఎంత పెద్ద సమస్య ఉన్న ఎక్కడో ఒకచోట పరిష్కారం మార్గం వెతుకొని బతకడానికి ప్రయత్నం చేయాలి తప్ప ఎవరు ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను అన్నారు. రైతును ఆత్మహత్యకు పురిగొల్పి.. దానికి దారి తీసిన పరిస్థితులు కల్పించిన వ్యక్తులు ఎవరైనా సరే, ఎంత పెద్ద వారైనా సరే.. నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధ్యులైన వారి పైన చట్టపరంగా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించానని తెలిపారు. ఇక్కడ అందరూ మా వాళ్లే.. అందరూ నా వాళ్లే.. జరిగిన పొరపాటుకు ఎవరూ కారణమైన సరే.. ఎవరిని ఉపేక్షించేది లేదు, ఎవరిని వదిలిపెట్టేది లేదు అన్నారు. బాధిత కుటుంబానికి తప్పనిసరిగా న్యాయం జరిగేటట్టుగా .. ఆత్మహత్యకు ప్రేరేపించిన వారిపై చర్యలు తీసుకోవడమే కాకుండా... రైతు ప్రభాకర్ భూమికి సంబంధించిన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం అన్నారు. చేపల సొసైటీ, ఇరిగేషన్, రెవెన్యూ వారితో మాట్లాడి సమస్య ఏంటో తెలుసుకొని.. శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ను ఆదేశించాను అన్నారు. పిల్లలు చదువుకోవడానికి అవసరమైన సహాయ సహకారాలు పూర్తిగా ఏర్పాటు చేస్తానని, పిల్లలు బాగా చదువుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.. వారు చదువుకున్నంత కాలం చదివిస్తాను ఇందులో ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. ఇతరత్రా సమస్యలకు సంబంధించి కుటుంబ సభ్యులు రాసి ఇచ్చారు వాటిని పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటాం ఎలాంటి ఇబ్బంది లేదు అన్నారు. ఇక్కడ అందరూ మావాళ్లే.. ఇటువంటి కేసుల్లో అసలు పార్టీలకు సంబంధమే లేదు... స్థానం లేదు ఇది మానవత్వంతో అందరూ చూడాల్సిన సంఘటన.. ఏ పార్టీ వారైనా మనిషే.. మనిషి ప్రాణం విలువైనది అని పేర్కొన్నారు. ఈ సంఘటనలో ఎవరిని ఉపేక్షించేది లేదని తెలిపారు.

# పాముకాటుకు పసిప్రాణం బలి



**నూగూర్ వెంకటాపురం జూలై 7(జనం సాక్షి) :** ములుగు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. పాముకాటు ఎంతో భవిష్యత్తు ఉన్న ఓ పసి ప్రాణం బలి.వెంకటాపురం మండలం శాంతినగర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే శాంతి నగర్ గ్రామంలో తాటి మనోజ్ , కౌసల్య దంపతుల కుమార్తె తాటి కావ్యశ్రీ (11) బర్లగూడెం గ్రామ పంచాయతీలో ఉన్న ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న చిన్నారి. శనివారం నాడు ఇంట్లో క్రింద పడుకొని నిద్రిస్తున్న సమయంలో నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురైంది అవి చూసిన చిన్నారి కేకలు వేయగా నిద్రలో ఉన్న తన తల్లిదండ్రులు వేచి చూడగా,పాము కాటుకు గురైన చిన్నారిని చూసి గ్రహించిన తల్లిదండ్రులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. చికిత్స చేస్తున్న సమయంలో విషమించి చికిత్స మధ్యలోనే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆ గ్రామంలో విషాద ఛాయలు పులుముకున్నాయి.

# దుస్తులు ఆరేస్తుండగా విద్యుద్ఘాతం

- మహిళ మృతి



**నస్పూర్, జూలై 7, (జనంసాక్షి) :** దుస్తులు ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మహిళ మృతి చెందిన సంఘటన శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శ్రీరాంపూర్ ఎస్సై ఎం సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం నస్పూర్ పట్టణంలోని మూడో వార్డు కృష్ణ కాలనీకి చెందిన తీగుళ్ల శారద (46) ఆదివారం ఉదయం తన ఇంటి ఆవరణలోని రేకుల షెడ్డు కింద ఇనుప తీగలపై దుస్తులు ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది.మృతురాలి కుమారుడు వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# 300 కోట్ల స్మార్ట్ సిటీ నిధుల్లో సునీల్ రావు
# 10 కోట్లు కమీషన్ తీసుకున్నారా?

- కాంగ్రెస్ పార్టీలో చేరినందుకు మేము 10 లక్షలు తీసుకున్నామా..?
- దీనిపై మున్సిపల్ కార్యాలయం ముందు బహిరంగ చర్చకు సిద్ధం
- కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు




**కరీంనగర్ బ్యూరో, జూలై 07 (జనం సాక్షి) :** కరీంనగర్ నగర మేయర్ సునీల్ రావు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం రోజు డిసిసి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ ఆకుల ప్రకాష్ మాట్లాడుతూ...నగరంలో అభివృద్ధి కుంటుపడుతుందని శనివారం రోజు మా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడడాన్ని మేయర్ సునీల్ రావు జీర్ణించుకోలేకపోతున్నారు. నగర అభివృద్ధిని చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారని సునీల్ రావు అంటున్నారు వాస్తవానికి సునీల్ రావు అవినీతిని చూసి నగర ప్రజలు ఆశ్చర్యపోతున్నారన్నారు. కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులలో అవినీతి జరిగిందని బిఆర్ఎస్ పార్టీ మాజీ మేయర్, ఇతర కార్పొరేటర్లు ఫిర్యాదు చేసింది వాస్తవం కాదా అని కార్పొరేటర్ కాశెట్టి శ్రీనివాస్ ఫిర్యాదు పత్రాలను చూపిస్తూ ప్రశ్నించారు. స్మార్ట్ సిటీలో అవకతవకలు జరగలేదన్న విషయాన్ని సునీల్ రావు ప్రజల వద్దకు వచ్చి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు నాడు ఎమ్మెస్సార్ వెంట, టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గంగుల కమలాకర్ వెంట తిరిగి ఇప్పుడు బండి సంజయ్ తో అంటకాగుతున్న సునీల్ రావుకు రాజకీయ నీతి లేదని, శివారు గ్రామాల అభివృద్ధి కోసం స్మార్ట్ సిటీ నిధులను ఎందుకు వెచ్చించలేదని కాశెట్టి శ్రీనివాస్ ప్రశ్నించారు. ఎక్కడైతే అవినీతికి అవకాశం ఉంటుందో అక్కడ మాత్రమే స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు నిర్వహించారని అవినీతి సొమ్మును దండుకున్నారన్నారు. ఈ విషయంపై మున్సిపల్ గేటు ముందు బహిరంగ చర్చకు మేము సిద్ధమని సవాల్ విసిరారు. కమీషన్లు తీసుకోకుండా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని ప్రెస్ మీట్ పెట్టి చెప్పే దమ్ము సునీల్ రావుకు ఉంటే బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్ లను పట్టించుకోకుండా కేవలం ఎక్కడైతే కమిషన్లు దొరుకుతాయో అక్కడ అనుమతులు ఇవ్వడం జరుగుతుంది అనేది వాస్తవం కాదా. అవినీతిపై ప్రశ్నిస్తే వ్యక్తిగత విమర్శలకు దిగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, సీఎం అస్సూరెన్స్ నిధులతో చేపట్టిన పనుల్లో పెండింగ్ బిల్స్ ఇప్పిస్తామని కాంట్రాక్టర్ల నుండి కమిషన్లు ఆశించింది వాస్తవం కాదా. ప్రజలు ఆశించిన అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే మేము పార్టీ మారడం జరిగిందని దళితులమైన మాపట్ల రాజకీయ కక్ష చూపిస్తూ మా డివిజన్లో అభివృద్ధి పనులు చేపట్టడం లేదని 22వ డివిజన్ కార్పొరేటర్ గంట కళ్యాణి శ్రీనివాస్ తెలిపారు. ఉన్నత వర్గానికి చెందిన మీరు బీసీలు దళితులపై ఉద్దేశపూర్వకంగానే నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. చిన్న కాంట్రాక్టర్లు మీ టార్చర్ భరించలేక బిల్లుల కోసం మీకు కమిషన్లు ఇవ్వలేక ఏడుస్తున్నారన్నారు. డబ్బులకు అమ్ముడుపోయి కాంగ్రెస్ పార్టీలో చేరినారని మాపై ఆరోపణలు చేస్తున్న మీరు నాడు కాంగ్రెస్ పార్టీ నుండి టిఆర్ఎస్ పార్టీలోకి వెళ్ళినప్పుడు ఎంతకు అమ్ముడు పోయారని, 20 సంవత్సరాల రాజకీయ జీవితంలో ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని ప్రజలకు సంక్షేమాన్ని అందించాలని మేము పార్టీ మారడం జరిగింది తప్ప డబ్బుల కోసం కాదని గంట కళ్యాణి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత కరెంటును 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సంక్షేమ పథకాలను మీ పార్టీ కార్పొరేటర్ల డివిజన్లో ప్రజలు వినియోగించుకోవడం లేదా. గత ప్రభుత్వంలో మీరు మేయర్ గా ఉండి ఎందుకు నగరంలో ఒక్కరికి కూడా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందజేయలేదు. ఎప్పుడూ ప్రతిపక్షంలో ఉండి పోటీ చేసిన వెలిచాల రాజేందర్ రావు గారిని విమర్శించే స్థాయి రాజకీయ వ్యభిచారి అయినటువంటి సునీల్ రావుకు లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు సరిల్ల ప్రసాద్, పిట్టల శ్రీనివాస్, ఆకుల నరసయ్య, వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370